నాగులుప్పలపాడు మండలంలోని గ్రామ సచివాలయ డేటాబేస్‌లో నమోదు కాని వారందరినీ సర్వే ద్వారా గుర్తిస్తున్నారు. వారిని హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసే పనిలో సచివాలయ సిబ్బంది నిమగ్నమయ్యారు. మండల పరిధిలో 6,735 మంది నమోదుకానట్లు గుర్తించారు. 308 మంది వేరొక ప్రాంతంలో నివసిస్తున్నట్లు తేలింది. 919 మందిని కొత్తగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు చేశారు. 2,524 మంది రాష్ట్రంలో కాకుండా బయట ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు గుర్తించారు. 94 మంది వివరాలు ఇప్పటికీ తెలియలేదు. 958మంది మరణించినట్లు గుర్తించారు. మిగిలిన వారి వివరాలు సర్వే చేయాల్సి ఉందని ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు.

దర్శి మండలంలో ఎంపీడీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటివరకు 3,400 మంది మిస్సింగ్ సిటిజన్స్‌ను గుర్తించారు. కొంతమంది బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అడ్డదారిలో ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందుతున్న వారిని గుర్తించి వారి పేర్లు తొలగించేందుకు, అర్హులైన వారి పేర్లు నమోదు చేసేందుకు వీలుగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు.

ఎక్కడున్నారు?


దర్శి మండలం తూర్పుచెటపాలెంలో మిస్సింగ్ సిటిజన్ సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో కృష్ణమూర్తి, సిబ్బంది (ఫైల్)

మిస్సింగ్ సిటిజన్స్‌పై యంత్రాంగం సర్వే

- కొందరు అనర్హులకు పథకాల లబ్ధి
- వారిని గుర్తిస్తున్న సచివాలయ ఉద్యోగులు
- సచివాలయ డేటాబేస్‌లో లేని వారి వివరాలు సర్వే ద్వారా నమోదు
- ప్రతి పౌరుడి సమాచారం నిక్షిప్తం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిస్సింగ్ సిటిజన్ సర్వే జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. మండల పరిషత్ అధికారులు అన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. జిల్లా, మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ లబ్ధి పొందిన వారితోపాటు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి వివరాలు వివిధ కారణాలతో డేటాబేస్‌లో నమోదు కాలేదు. అలాగే ఇతర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వారి వివరాలను సచివాలయ సిబ్బంది మిస్సింగ్ సిటిజన్ సర్వే ద్వారా డేటాబేస్‌లో పొందుపరుస్తున్నారు. తద్వారా అర్హులకు పథకాల లబ్ధి అందడంతోపాటు అనర్హులను తొలగించే అవకాశం ఉంది. అలాగే ప్రతి పౌరుడి వివరాలు ప్రభుత్వ సైట్‌లో అందుబాటులో ఉంటాయి.

ఒంగోలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి)/నాగులుప్పలపాడు/దర్శి : జిల్లా ప్రజానీకంలోని అనేక మంది ఆచూకీ తెలియడం లేదు. అలాగే ప్రభుత్వ లెక్కల్లోనూ కనిపించడం లేదు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియలో దాదాపు 2.14 లక్షల మంది సమాచారం లభించలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇంచుమించు 46.93 లక్షల మంది వివరాలు లభించకపోవడంతో ప్రభుత్వం జిల్లాల వారీగా మళ్లీ సర్వే చేసి లెక్కలు తేల్చాలని ఆదేశించింది. దీంతో ప్రస్తుతం సచివాలయ సిబ్బంది ద్వారా హౌస్‌హోల్డ్ సర్వే చేస్తున్నారు. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 22.88 లక్షల మంది ఉన్నారు. ఈ పన్నెండేళ్లలో మరో 4 లక్షల మంది వరకు పెరిగినట్లు అంచనా. అలాగే మొత్తం 7.81 లక్షల హౌస్‌హోల్డ్‌లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గతంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ (ఇంటింటి సర్వే)ను ప్రభుత్వం చేపట్టింది. ప్రతి ఇంటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది ఎంతమంది నివాసం ఉంటున్నారు, ఏయే వయస్సులలో, ఎక్కడెక్కడ

మిగతా 6వ పేజీలో

క్యాన్సర్‌ను జయించాలి



- ఉచితంగా స్ర్కీనింగ్ పరీక్షలు
- ప్రభుత్వం నిర్ణయం
- వైద్యశాఖ మంత్రి సత్యకుమార్
- ఏడుగుండ్లపాడులో ఎన్‌సీడీ వ్యాధులపై అవగాహన సదస్సుకు హాజరు
- స్వీయ అనుభవాలను వివరించిన సినీనటి గౌతమి


ఏడుగుండ్లపాడులో కేన్సర్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, సినీనటి గౌతమి, ఎమ్మెల్యే బీఎన్, కలెక్టర్ అన్సారియా



క్యాన్సర్‌పై అవగాహన సదస్సుకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న సినీనటి గౌతమి

మద్దిపాడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి దానిని జయించేందుకు కృషిచేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఏడుగుండ్లపాడులో ఏర్పాటుచేసిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 155మంది సూపర్ స్పెషలిస్టులతోపాటు 238మంది స్పెషలిస్టులు, 4వేల మంది వైద్యాధికారులు, 4వేల మంది ఏఎన్‌ఎంలు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. వీరితోపాటు 18వేల మంది పీహెచ్‌సీ సిబ్బంది కూడా సేవలందిస్తారని చెప్పారు. క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడం వల్లనే ఎక్కువమంది

మిగతా 6వ పేజీలో


వివరాలను వెల్లడిస్తున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు, పక్కన కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు

అఘాయిత్యాలు తాళలేకే హత్య

- కంభంలో శ్యాంప్రసాద్ హత్య కేసులో కుటుంబ సభ్యులే నిందితులు
- తల్లి, ఇద్దరు సోదరులు, ఆటో డ్రైవర్ అరెస్టు
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ నాగరాజు

కంభం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కంభంలో సంచలనం సృష్టించిన కదం శ్యాంప్రసాద్ దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. కుటుంబ సభ్యులే నిందితులను తేల్చారు. శ్యాంప్రసాద్ తల్లి, ఇద్దరు సోదరులతోపాటు ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద హత్యకు ఉపయోగించిన గొడ్డలి, కత్తి స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మార్కాపురం డీఎస్పీ నాగరాజు మంగళవారం కంభం పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న శ్యాంప్రసాద్ మద్యానికి బానిసై సంపాదన మొత్తాన్ని మద్యానికే ఖర్చు చేసేవాడు. మద్యం మత్తులో తరచూ కుటుంబసభ్యులతో గొడవ పడేవాడు. ఇరుగుపొరుగు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. తనకు పిన్ని వరుసయ్యే మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో శ్యాంప్రసాద్‌కు దేహశుద్ధి చేసిన బంధువులు తల్లికి ఫిర్యాదు చేశారు. దీనిపై పెద్దలు పంచాయితీ కూడా చేశారు. అయినా శ్యాంప్రసాద్ ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈనెల 8న ఇంట్లో ఒంటరిగా ఉన్న తల్లిపట్ల కూడా అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న అన్న సుబ్రహ్మణ్యం, తమ్ముడు కాశీరావులు శ్యాంప్రసాద్‌ను మందలించాడు. ఈనెల 12న డ్రైవర్ ఉస్మాన్‌బాషతో కలిసి లారీకి క్లీనర్‌గా ఓర్వకల్లు వెళ్లి అక్కడ మద్యం సేవించాడు. డ్రైవర్‌తో గొడవ పెట్టుకున్నాడు. దీంతో డ్రైవర్ లారీ యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. విషయం తెలుసుకున్న తల్లి, తమ్ముడు శ్యాంప్రసాద్‌ను ఇంటికి తీసుకువచ్చారు. 13వ తేదీ ఉదయం శ్యాంప్రసాద్ మద్యంసేవించి ఇంటికి వచ్చి తల్లి, అన్న, తమ్ముడితో తీవ్రంగా గొడవపడ్డాడు. తల్లి లక్ష్మీదేవి, అన్న సుబ్రహ్మణ్యం, తమ్ముడు కాశీరావు, సుబ్రహ్మణ్యం స్నేహితుడు ఆటో డ్రైవర్ అయిన వి.మోహన్‌తో కలిసి గురువారం మధ్యాహ్నం శ్యాంప్రసాద్‌ను గొంతు నులిమి హత్యచేశారు. మృతదేహాన్ని ఎక్కడికన్నా తీసుకెళ్లి పడేయాలని చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో నలుగురూ కలిసి శ్యాంప్రసాద్ మృతదేహాన్ని కత్తి, గొడ్డలితో 8 ముక్కలుగా నరికి 3 ప్లాస్టిక్ సంచుల్లో నింపారు. అనంతరం ఇంటికి దగ్గరలోని నక్కలగండి కాలువలో పడేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులైన మృతుడి తల్లి, ఇద్దరు సోదరులతోపాటు ఆటోడ్రైవర్ మోహన్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. స్వల్పవ్యవధిలోనే కేసును ఛేదించిన డీఎస్పీ నాగరాజును, కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావులను ఎస్పీ అభినందించారు.

హత్య కేసులో 8 మందికి జీవితఖైదు

ఒంగోలు 7వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి తీర్పు

7వ పేజీలో



ధర తగ్గించినా కొనుగోలుదారులు రాకపోవడంతో మంగళవారం రాత్రి 7 గంటలకే ఒంగోలులో మూసివేసిన చికెన్ దుకాణాలు

చికెన్.. డౌన్

- కిలో రూ.150కి పడిపోయిన ధర
- బర్డ్‌ఫ్లూ భయంతో కొనుగోళ్లకు ప్రజల వెనుకంజ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చికెన్ ధరలు అమాంతం పడిపోయాయి. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వ్యాధితో లక్షలాది కోళ్లు మృతిచెందుతుండటంతో ఆ ప్రభావం జిల్లాపై పడింది. సాధారణంగా ప్రతిరోజూ ఒంగోలులో కొనుగోళ్లు బాగానే ఉంటాయి. అటువంటిది మంగళవారం చికెన్ అమ్మకాలు పూర్తిగా మందగించాయి. ఆయా షాపుల వద్ద ధరలు తగ్గించినట్లు బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా స్పందన అంతంత మాత్రమే. నిన్నటివరకు కిలో రూ.200 నుంచి 220 వరకు విక్రయించగా మంగళవారం ఒక్కసారిగా కిలో రూ.150కు పడిపోయింది. కొన్ని ప్రాంతాల్లో అయితే కిలో రూ.130 నుంచి రూ.140 వరకు ఉంది. చికెన్ తింటే రోగాల బారిన పడతారన్న ప్రచారం నేపథ్యంలో చికెన్‌ప్రియులు కూడా కొనుగోళ్లకు ఆసక్తిచూపడం లేదు. నిత్యం కళకళలాడే కొత్త మార్కెట్ సెంటర్‌లో మంగళవారం ఆ షాపుల వద్ద ఎవరూ కనిపించని పరిస్థితి. బర్డ్‌ఫ్లూ వ్యాధి విజయవాడకు కూడా పాకడంతో ఆ ప్రభావం జిల్లాపై స్పష్టంగా కనిపించింది. మన జిల్లాకు సమీప ప్రాంతాలైన గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా నుంచి ఎక్కువగా కోళ్ల దిగుమతి అవుతాయి. దీని కారణంగా కూడా జిల్లాలో కొనుగోళ్లు మందగించాయని నిర్వాహకులు చెప్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఇప్పటికే కోళ్లను స్టాక్ పెట్టుకున్న వారు నష్టపోవడమే కాకుండా వాటిని మేపేందుకు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.


త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర ఆలయం

త్రిపురాంతకేశ్వరాలయం.. శాసనాలకు నిలయం

- చరిత్రకు సాక్ష్యంగా లిఖించినవెన్నో..
- ఆలయ విశిష్టతపైనా పరిశోధనలు

7

జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవు

- అన్నీ పుకార్లే.. కోడి మాంసం తినొచ్చు
- పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి బేబీరాణి
- పక్క జిల్లాల నుంచి దాణా, కోళ్లు, గుడ్లు రాకుండా చర్యలు

7

నాటుసారాపై సమర భేరి

నేడు ఒంగోలులో నవోదయం 2.0 ప్రారంభించనున్న మంత్రి కొల్లు

6

అక్రమార్కులపై వేటు

ఎర్రగొండపాలెం తహసీల్దార్ బాలకిషోర్ సస్పెన్షన్!

- ఏకంగా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని రాసిచ్చిన వైనం
- కిందిస్థాయి ఉద్యోగులు ధ్రువీకరించకుండానే ఆన్‌లైన్లు
- సెలవులో ఉండి ఇంటి వద్దనే సంతకాలు
- ఇంకా వెలుగులోకి అనేక అక్రమాలు
- వీఆర్వో, సర్వేయర్లపైనా చర్యలు


తహసీల్దార్ బాలకిశోర్ (ఫైల్)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలోని సర్వే నెంబరు 58/1లో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలానికి సంబంధించి ప్రైవేటు వ్యక్తికి తప్పుడు ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన విషయంలో తహసీల్దార్ అల్లరి బాలకిషోర్, ఎర్రగొండపాలెం రెండో వీఆర్వో ముటుకూరి ఎల్లయ్య, 4వ సచివాలయ సర్వేయరు ఎలిసెల దిలీప్‌కుమార్‌లను కలెక్టరు సస్పెండ్ చేశారు. ఆమేరకు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. అవి మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.మల్లికార్జుననాయుడు అందుకున్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినందుకే

ఎర్రగొండపాలేనికి చెందిన దొడ్డపనేని శ్రీనివాసరావుకు ఆర్‌అండ్‌బీ బంగ్లాకు ఎదురుగా ఖాళీ స్థలం ఉన్నట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉన్న సర్వేనెంబరు 58/1లో 201 చదరపు గజాల స్థలాన్ని సర్వేయరు, వీఆర్వో రిపోర్టుతో తహసీల్దారు బాలకిషోర్ పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేశారు. దాన్ని ఉపయోగించి శ్రీనివాసరావు ఆ స్థలాన్ని తన భార్య యోగమ్మ పేరుతో ఎర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంటు నెంబరు174/2025తో జనవరి 18న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రూ.60,12,000 విలువ ఉన్నట్లు సదరు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో



మిగతా 6వ పేజీలో

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన అధికారులు

ఆర్‌అండ్‌బీ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యవహారంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు మార్కాపురం సబ్‌కలెక్టరు సహదిత్ వెంకట్ త్రివినాగ్ విచారించారు. కలెక్టరు కార్యాలయానికి నివేదికలు పంపించారు. దాని ఆధారంగా తహసీల్దారు బాలకిషోర్, వీఆర్‌వో ముటుకూరి ఎల్లయ్య, సర్వేయర్ ఎలిసెల దిలీప్‌కుమార్‌లను సస్పెండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులను ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ స్థలానికి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినందుకు సస్పెన్షన్‌కు గురైన తహసీల్దారు అధిక మొత్తంలో లంచంపొందారని, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికమొత్తంలో దొడ్డపునేని శ్రీనివాసరావు ఖర్చుచేసినట్లు ఎర్రగొండపాలెం ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే వైపాలెం వచ్చిన తహసీల్దార్లు ఇటీవల కాలంలో ఎక్కువగా సస్పెండ్ కావడం చర్చనీయాంశమైంది.

మర్రిపూడి.. అభివృద్ధిలో వెనుకబడి!

అనేక సమస్యలతో జనం సతమతం

చెరువుల్లో నీరు లేక పడిపోతున్న సాగు విస్తీర్ణం

శాశ్వత పథకాలు ప్రతిపాదనలకే పరిమితం

పనుల కోసం వలసలు నిత్యకృత్యం

నేడు మండల అధికారులతో

రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ సత్య సమీక్ష

మర్రిపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మర్రిపూడి మండలం అత్యంత వెనుకబడిన ప్రాంతం. ఎలాంటి అభివృద్ధికి నోచుకోక గ్రామీణ ప్రజలు నేటికీ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం నిత్యకృత్యమైంది. స్థానిక చెరువులకు నీరు అందించాలన్న ప్రతిపాదనలు ఏళ్లతరబడి కార్యరూపం దాల్చకపోవడంతో వ్యవసాయం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 20ఏళ్లుగా మర్రిపూడి చెరువు కింది వరి సేద్యం నిలిచిపోవడమే అందుకు నిదర్శనం. దీంతో పలుచెరువులు ఒట్టిపోయి నిరుపయోగంగా మారాయి. చిలంకూరు వద్ద ముసిపై ఆనకట్ట నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. వంద లాది క్యూసెక్కుల నీరు ఏటా సముద్రంపాలవుతోంది. దీనికితోడు ఇతరత్రా అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు.

కాగితాలకే పరిమితమైన గత ప్రతిపాదనలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పొదిలి చిన్నచెరువు నుంచి గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు పైపులైను ద్వారా సాగర్ జలాలు అందించాలన్న ఉద్దేశంతో రూ.39 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే కెల్లంపల్లి, పన్నూరు, శివరాయునిపేట, కాకర్ల, వల్లాయిపాలెం, చిమట, రామాయపాలెం, మర్రిపూడి, గుండ్లసముద్రం, గొలుసుకుట్ల చెరువులకు సంవృద్ధిగా సాగు నీరు అందుతుంది. తద్వారా 10కిపైగా గ్రామాల్లో భూగర్భ జల మట్టంతోపాటు బోర్లకింద సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుంది. కానీ గత ప్రభుత్వం దాన్ని బుట్టదాఖలు చేసింది. పునుగోడు రిజర్వాయర్ నుంచి కొండ కిందగా సప్లై చానల్ ద్వారా నర్సాపురం, వేమవరం, కూచిపూడి, గంగపాలెం, మర్రిపూడి, గుండ్లసముద్రం చెరువులకు నీరు అందించాలన్న ప్రతిపాదనలను 30 ఏళ్ల క్రితం అప్పటి మంత్రి దామచర్ల ఆంజనేయులు సిద్ధం చేయించారు. అవి కూడా కార్యరూపం దాల్చ లేదు. దీంతోపాటు చిలంకూరు వద్ద ముసినదిపై రోడ్డు, చెక్‌డ్యాం నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. ఇది జరిగితే చిలంకూరు రామాయపాలెం గ్రామాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 3వేల ఎకరాలకుపైగా సాగునీరు అందుతుంది. మర్రిపూడి, చీమకుర్తి మండలాలకు అనుసంధానం ఏర్పడి రవాణా సౌకర్యం మెరుగవుతుంది. ఆ ప్రతిపాదనలు కూడా కాగితాలకే పరిమితమయ్యాయి.



చిలంకూరువద్ద ముసినదిలో వృథాగా పారుతున్న నీరు

కార్యరూపం దాల్చని బీసీ హాస్టల్ ఏర్పాటు

వలసల కారణంగా మండలంలో విద్యార్థుల విద్యాభివృద్ధి కుంటుపడుతోంది. మర్రిపూడిలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలన్న ఆదేశాలు ఇంతవరకూ అమలుకు నోచుకోలేదు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి బీసీ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని ధర్మవరంలో కిడ్నీ వ్యాధి మూలంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈదృష్ట్యా రామతీర్థం నుంచి రక్షిత జలాల సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. దేవదాయ శాఖ అధికారుల తప్పిదం వల్ల మర్రిపూడి గ్రామం మొత్తం నిషేధిత భూముల జాబితాలో చేరింది. దీంతో పదేళ్లుగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమస్యను కూడా పరిష్కరించాల్సి ఉంది.

బెంగళూరు-విజయవాడ హైవేకు ఎగ్జిట్ ఏర్పాటు చేయాలని వినతి

మండలంలోని వృథులగిరి దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం నియోజకవర్గానికి చెందిన నూకసాని బాలాజీ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఉన్నారు. ఆయన వృథులగిరిపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రమైన మర్రిపూడికి కూతవేటు దూరంలో బెంగళూరు, విజయవాడ హైవే నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఎగ్జిట్‌ను ఏర్పాటు చేయించాలని మండల వాసులు కోరుతున్నారు. జగనన్న కాలనీ కోసం మండల కేంద్రమైన మర్రిపూడిలో సేకరించిన భూములు నిరుపయోగంగా మారాయి. వాటిని వినియోగంలోకి తెచ్చి రైతులకు ఉపయోగపడే గోదాములు కానీ, స్టేడియం కానీ నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండలంలోని పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. దీనికితోడు స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. టీడీపీ నియోజకవర్గ కీలక నేత దామచర్ల సత్య రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్‌గా బాధ్యలు చేపట్టారు. దీంతో వీరిద్దరూ మండలాన్ని అభివృద్ధిపథంలో పయనింపజేస్తారని జనం ఆశిస్తున్నారు. ఈనేపథ్యంలో మండలంలోని ప్రధాన సమస్యలపై రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ సత్య అధికారులతో బుధవారం సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

కొణిజేడులో భూముల రీసర్వే పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

టంగుటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల గురించి ఆరా తీశారు. వాటిని ఎలా పరిష్కరిస్తున్నారన్నది. తహసీల్దార్ ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మండలంలోని కొణిజేడుకు వెళ్లారు. అక్కడ భూముల రీసర్వే జరుగుతున్న ప్రాంతాన్ని, రికార్డులను పరిశీలించారు. కొంత మంది రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు.

నాలుగు టిప్పర్లు సీజ్

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): గ్రావెల్‌ను తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి రాజశేఖర్ మంగళవారం తెలిపారు. యరజర్ల నుంచి గ్రావెల్ తరలిస్తుండగా ఒంగోలు నుంచి పొందురు వెళ్లే రోడ్డులో గనుల శాఖ అధికారులు రాజీనాయుడు, సురేష్‌బాబు తనిఖీలు నిర్వహించి సీజ్ చేసినట్లు చెప్పారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 19నుంచి 22వతేదీ వరకు టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు(డ్రాయింగ్, టైలరింగ్) పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు స్థానిక రామనగర్‌లోని మునిసిపల్ హైస్కూలు, ఏబీఎం జూనియర్ కళాశాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు కావాలన్నారు. హాల్‌టిక్కెట్లను ప్రభుత్వ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

ఇమామ్, మౌజన్లకు రూ.45 కోట్లు విడుదలపై హర్షం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇమామ్, మౌజన్లకు అందాల్సిన గౌరవవేతనాల నిధుల్లో ఆరు నెలలకుగాను రూ. 45 కోట్లు వక్ఫ్‌బోర్డుకు విడుదల చేయాలని టీడీపీ కూటమి ఉత్తర్వులు ఇవ్వడంపై టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పఠాన్ హనీఫ్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇమామ్, మౌజన్లకు శుభవార్త అని ఆయన పేర్కొన్నారు.

సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు

మంత్రి డోలా

వైద్యులు, సిబ్బందితో సమీక్ష

కొండపి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కొండపి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆయన మంగళవారం సీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వైద్యశాలలో తగినంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నారన్నారు. త్వరలో శస్త్ర చికిత్సలు ప్రారంభించాలని సూచించామన్నారు. అందుకు అవసరమైన అన్ని వసతులు ఇక్కడ ఉన్నాయన్నారు. అవసరమైన సామగ్రి, సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారన్నారు. రాష్ట్రంలో జీబీఎస్ కట్టడికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకున్నదన్నారు. ఇది అంటువ్యాధి కాదని, లక్షణాలు ఉన్నవారికి ఒంగోలు జీజీహెచ్‌లో వైద్య సాయం అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. గుండెపోటు వచ్చిన వారిని ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు అన్ని వైద్యశాలల్లో ఇంజక్షన్ అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం మంత్రి వైద్యశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రహరీ గోడ నిర్మించాలని వైద్యశాల ఇన్‌చార్జికి సూచించారు. ఆయన వెంట కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.



ఇన్‌పేషెంట్స్ గదిలో వసతులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి స్వామి

నర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏడుగుండ్లపాడులో మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పబ్లిక్ హెల్త్ స్టాండర్స్ సూచనల మేరకు 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సులను నియమించాలని కోరారు. కాంట్రాక్టుపై పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయడంతో పాటు ఉద్యోగోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోపిదేవి ఉదయలక్ష్మి, కార్యదర్శి కొత్తపల్లి మంజేష్, కార్యవర్గ సభ్యులు జానీబాషా, మహేష్, మహబూబ్, బీవీ.రామలక్ష్మి, నాగరాజకుమారి, రమణనాయక్, సుమన్, చినకనయ్య, స్మిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ నేతలు

పురుష ఆరోగ్యకార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలి

మద్దిపాడు, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో గత 22సంవత్సరాల నుంచి పని చేస్తున్న తమను ఉద్యోగాల నుంచి తొలగించారని, దీంతో తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నాయని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పురుష ఆరోగ్యకార్యకర్తలు మంత్రి మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కోరారు. మంగళవారం మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో మంత్రిని కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పురుష ఆరోగ్యకార్యకర్తలు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సేవలు అందించిన తమ వయస్సు 50సంవత్సరాలు దాటిపోయిందని, ఇప్పుడు వేరే పనులు చేయలేకపోతున్నాయని వాపోయారు. తక్షణమే కాంట్రాక్ట్ ఉద్యోగులుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులతో పురుష ఆరోగ్య కార్యకర్తలు నలుగురు మృతి చెందారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు టి.రమణారెడ్డి, ఎస్ఎంఎం.సుభాని, ప్రభాకర్‌రావు, ప్రసాద్, అంజరెడ్డి, మహేష్, బాబురావు, సుల్తాన్ శ్రీనివాసరావు, కరిముల్లా పాల్గొన్నారు.

చతికిలబడిన శనగల ధరలు

ఈ ఏడాది ఎండుతెగులు

దెబ్బకు పడిపోతున్న దిగుబడులు

నేటికీ కోల్డ్ స్టోరేజీల్లో మూలుగుతున్న

పాత నిల్వలు

ఆందోళనలో సాగుదారులు

పర్చూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. తుఫాన్ ప్రభావం, అధిక వర్షాల కారణంగా రబీ సాగులో పైర్లు సకాలంలో వేయలేకపోయారు. కాస్త ఆలస్యంగా శనగను సాగు చేసి పైరును కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రైతులకు ఎండుతెగులు కుంగదీస్తోంది. దిగుబడి తగ్గడం, ధర దిగజారడంతో వారి ఆశలు అడియాశలుగా మారాయి. మూడేళ్ల నుంచి పండించిన శనగ నిల్వలు చాలా చోట్ల శీతల గిడ్డంగుల్లోనే మూలుగుతున్నాయి. మంచి ధర లభిస్తుందన్న ఆశతో నిల్వ చేసుకున్న రైతులకు పతనమవుతున్న ధర మరింత నైరాశ్యానికి గురిచేస్తోంది.



బోడవాడ సమీపంలో ఎండు తెగులుతో దెబ్బతిన్న శగన పైరు

దిగజారిన జేజే-11 రకం ధర

కొన్ని నెలల కిందట క్వింటా రూ.7200 ఉన్న జేజే-11 రకం ధర ప్రస్తుతం రూ.5500కి పడిపోయింది. దీంతోపాటు కాక్ -11, బోల్డ్‌ల ధర కూడా ఇదేవిధంగా నేల చూపుచూస్తున్నాయి. దీనికితోడు ఈ ఏడాది దిగుబడులు కూడా గణనీయంగా తగ్గాయి. చాలాచోట్ల ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఉన్న ధర, దిగుబడులను పరిగణనలోకి తీసుకుంటే కౌలు, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదని శగన రైతులు వాపోతున్నారు.

కోల్డ్ స్టోరేజీలకు చేరుతున్న శనగ

ప్రస్తుతం ధరలు దిగజారుతుండడంతో భవిష్యత్తులో మంచి ధర వస్తుందన్న ఆశతో రైతులు శనగ ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. మరోపక్క వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చుకునేందుకు గత్యంతరం లేని రైతులు వచ్చిన కాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.



కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న శనగలు

సబ్ డివిజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో సాగు

పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో సుమారు 30వేల ఎకరాల్లో రైతులు శగన పైరును సాగుచేశారు. ఈ ఏడాది శనగకు ఎండు తెగులు వెంటాడడంతో పైర్లు గణనీయంగా దెబ్బతిన్నాయి. పూత దశకు చేరుకున్న తరుణంలో తెగుళ్ల సోకడంతో పైర్లు ఎండిపోయి దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు.

ఫోన్ పేతో నగదు మాయం?

చీరాలటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ పేలో అల్పాహారం దుకాణ నిర్వాహకుడు నగదు మాయమైన ఘటన మంగళవారం చీరాల వైకుంఠపురంలో చోటుచేసుకుంది. దుకాణ యజమాని మండగిరి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇతను స్థానికంగా టిఫిన్ హోటల్ నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని మహిళ టిఫిన్ చేసి రూ.36 నగదు ఫోన్ పే చేసింది. అయితే కొద్ది సేపటికే అతని అకౌంట్‌లో రూ.450 కట్ అయ్యాయి. అంతేకాకుండా ఫోన్ పే వాట్సాప్ గ్రూప్‌లో జాయిన్ అవ్వండి అంటూ టెక్స్ మెసేజ్ చేరింది. దీంతో అవాక్కయిన బాధితుడు వెంటనే బ్యాంకు ప్రతినిధులను కలిసి అకౌంట్ బ్లాక్ చేయించారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఇదే తరహా ఘటన ఇటీవల జాండ్రపేటలో కూడా జరిగినట్లు సమాచారం.

అవీఇవీ

నాటుసారాపై సమరభేరి

● నవోదయం 2.0 ప్రారంభం

● నేడు పోలీస్ పేరేడ్ మైదానంలో ప్రారంభించనున్న మంత్రి

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మానవ జీవితాలను కబళిస్తున్న నాటుసారా మహమ్మారిని సమూలంగా రూపుమాపేందుకు నవోదయం మలివిడత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రారంభించనుంది. నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఒంగోలులోని పోలీస్ పేరేడ్ మైదానంలో ఎక్సైజ్‌శాఖ శాఖ కొల్లు రవీంద్ర చేతులు మీదగా ప్రారంభం చేయనున్నారు. నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలను, మానవాళి శరీరాలలో వచ్చే దుష్ప్రభావాలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాజాతాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా నాటుసారా కాసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించి వారి జీవన ప్రమాణాలు పెంచేదుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోనుంది. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న నాటుసారా తాగడం వల్ల కలిగే నష్టాలను వివరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. 2014-19 మధ్యకాలంలో నవోదయం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వల్ల వచ్చిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని మరో విడత ఈ కార్యక్రమాన్ని మలివిడతగా ప్రారంభించనున్నారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు పోలీస్ పేరేడ్ మైదానంలో మంత్రి రవీంద్ర చేతులు మీదగా నవోదయం 2.0 కార్యక్రమం ప్రారంభించనున్నారు.

క్యాన్సర్‌ను జయించాలి

(5వ పేజీ తరువాయి)

మృత్యువాత పడుతున్నారన్నారు. వ్యాధిని సరైన సమయంలో గుర్తించి చికిత్స పొందితే బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి పరీక్షలు చేస్తారన్నారు. స్టెమీ కార్యక్రమంలో భాగంగా గుండెపోటు నివారణకు రూ.45వేలు విలువైన ఇంజెక్షన్ ప్రభుత్వం ఉచితంగా చేస్తుందన్నారు. ప్రతి సామాజిక కేంద్రంలో ఇంజెక్షన్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సినీనటి, లైఫ్ ఎగైన్ సంస్థ వ్యవస్థాపకురాలు గౌతమి హాజరై క్యాన్సర్ గురించి స్వీయ అనుభవాలను వివరించారు. అవగాహన ఉంటే క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చన్న సంగతి తన విషయంలోనే రుజువైందన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ సోకిన తాను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స చేయించుకోవడం వల్ల 20 ఏళ్ల క్రితం మహమ్మారి నుంచి తాను బయటపడగలిగానన్నారు.

రిమ్స్‌లో నిరంతర పరీక్షలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిరంతరం పరీక్షలకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో క్యాన్సర్‌పై మరింత అవగాహన పెంచేలా కృషిచేస్తామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే 63శాతం నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ కె.శ్యామల, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ ప్రసాద్, బీజేపీ నాయకులు దారా సాంబయ్య, ఏడుగుండ్లపాడు సర్పంచ్ దాసరి శిల్ప సౌందర్య, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంతిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, రాయపాటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మండల వెంకటస్వామి, గోరంట్ల చిరంజీవి, ఆలా లక్ష్మీనారాయణ, మోపర్తి సందీప్, నల్లూరి శ్రీనివాసరావు, వైద్యాధికారులు డాక్టర్ ఆనంద్ మోహన్, డాక్టర్ బెజవాడ శ్రీవాణి, డాక్టర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రచ్చబండ చెట్టును ఆరోగ్య శాఖ అధికారులు అందంగా తీర్చిదిద్దగా మనిషి అవయవాలను చెట్టులో అమర్చడం చూపిన మంత్రి అభినందించారు.

ఎక్కడున్నారు?

(5వ పేజీ తరువాయి)

ఏమి చేస్తున్నారన్నది వారికి ఆధార్ నంబర్లు, పాన్ నంబర్లు ఇలా అన్ని వివరాలు సేకరించారు. ఈ తరహా సర్వే గతంలోనే చేశారు.

లక్షల మంది వివరాలు లేవు

జనాభా లెక్కకు, మ్యాపింగ్ సర్వేలో వచ్చిన లెక్కలకు తేడాలు ఉన్నాయి. రాష్ట్రంలో సుమారు 46.93 లక్షల మంది వివరాలు లేకపోవడంతో వారిని మిస్సింగ్ సిటిజన్‌గా ప్రభుత్వం భావిస్తోంది. అలా జిల్లాలో 2,14,932 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని అంచనా. అంటే అంతమంది సమాచారం ప్రభుత్వ లెక్కల్లో తేలడం లేదు. దీంతో మరోసారి మ్యాపింగ్ సర్వేను అప్‌డేట్ చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా ప్రస్తుతం మళ్లీ సర్వే సాగుతోంది. అలా జిల్లాలోని 7.81 లక్షల గృహాలలో సుమారు 7.28 లక్షల గృహాల సర్వే పూర్తయినట్లు సమాచారం. గతంలో ఇంటింటికి వెళ్లి మళ్లీ మ్యాపింగ్ చేసి ఉండటంతో సిబ్బంది తమ వద్ద ఉన్న గతంలో చేసిన సర్వే వివరాలను సరిచూస్తున్నారు.

54వేలమంది ఇతర రాష్ట్రాల్లో...

కొత్తగా జన్మించిన, మరణించిన వారితోపాటు ఆధార్ నంబర్ల వివరాలు, వలస వెళ్లినట్లుగా భావించే వారి వివరాలను సరిపోల్చుతున్నారు. ఈ ప్రక్రియలో మిస్సింగ్ జాబితాలో ఉన్న 2.14 లక్షల మందిలో దాదాపు 1.14 లక్షల మంది వివరాలను ఇప్పటి వరకు పరిశీలించినట్లు సమాచారం. ఈ క్రమంలో కొత్తగా 9,589 గృహాలు జాబితాలో చేరగా 34,088 మంది వాటిలో నివాసితులుగా గుర్తించారు. అలాగే 54,144 మంది ఇతర రాష్ట్రాలలో నివాసం ఉంటున్నారు. 19,236 మంది మృతిచెందినట్లు గుర్తించారు. ఇక 7,520 మంది ఎక్కడ ఉంటున్నారన్నది ఆచూకీ లేదు. మరో 91,852 మంది వివరాలను పరిశీలించాల్సి ఉంది. మొత్తం మీద తొలుత నిర్వహించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు సరిగా ఇవ్వకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో మిస్సింగ్ సిటిజన్‌ల వివరాలను సిబ్బంది మళ్లీ పరిశీలిస్తున్నారు.

అక్రమార్కులపై వేటు

(5వ పేజీ తరువాయి)

చూపారు. అదేవిధంగా ఆర్అండ్‌బీ స్థలానికి 58/1లో మరో డాక్యుమెంటు నెంబరు 207/2025తో శ్రీనివాసరావు తన భార్య యోగమ్మ పేరుతో మరికొంత స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీని విలువ రూ.20,10,000 ఉన్నట్లు చూపారు. తహసీల్దార్ బాలకిషోర్ ఇచ్చిన పొజిషన్ సర్టిఫికెట్‌తోనే ఆర్అండ్‌బీ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది.

తహసీల్దారు రూటే సప'రేటు'

ఎర్రగొండపాలెం తహసీల్దారుగా 2024 సెప్టెంబరులో బాలకిషోర్ బదిలీపై వచ్చారు. నాటి నుంచి ఇష్టానుసారం భూములను ఆన్‌లైన్ చేశారు. ఆర్అండ్‌బీ, స్థలానికి ప్రైవేటు వ్యక్తులకు పొజేషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. ఇదే కాకుండా, గ్రామాల్లో రైతులకు చెందిన భూములను ఒకరి భూములు మరొకరి ఆన్‌లైన్ చేసినట్లు ఆరోపణలున్నాయి. తద్వారా లబ్ధిపొందిన వ్యక్తుల నుంచి పెద్దమొత్తంలో ముడుపులు స్వీకరించి, తమకు అన్యాయం చేశారని భూములు కోల్పోయిన రైతులు లబోదిబో అంటున్నారు.

తహసీల్దార్ అక్రమాల్లో మచ్చుకు కొన్ని..

మండలంలోని వైకొత్తపల్లి గ్రామంలో వనిపెంట గురవమ్మకు చెందిన 1.90 ఎకరా భూమిని ఎర్రగొండపాలేనికి చెందిన ఎస్‌కేఎం రఫీకి తహసీల్దార్ ఆన్‌లైన్ చేశారని ఆరోపణలున్నాయి. వెంకటాద్రిపాలెం రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబరు 654/1లో భూమి కొనుగోలు పథకం కింద వెంకటాద్రిపాలేనికి చెందిన లబ్ధిదారులు ప్రభుత్వం కొనిచ్చిన 68 ఎకరాల భూమిని పెద్దమొత్తంలో ముడుపులు తీసుకొని ఒక ఫార్మా కంపెనీకి ఆన్‌లైన్ చేసి తమ కడుపు కొట్టాడని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లంపల్లి రెవెన్యూలో 3 ఎకరాల అటవీశాఖ భూమిని, 7 ఎకరాల కొండ పోరంబోకు భూములను అక్రమార్కులకు ఆన్‌లైన్ చేసి లక్షలు దండున్నారు. మొగుళ్లపల్లిలో భూయజమానులను తొలగించి ఇతరులకు ఆన్‌లైన్ చేశారు. దీంతో భూయజమానులు కార్యాలయం వద్ద గొడవ చేయడంతో తిరిగి అసలు రైతుల పేర్లు ఎక్కించారు. ఫిబ్రవరిలో సెలవులో ఉండి కూడా వెబ్ కీ తన వద్ద ఉంచుకొని 20 ఎకరాలు ఆన్‌లైన్ చేశారని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే కింద స్థాయి ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. తహసీల్దార్ సస్పెండ్ అయిన నేపథ్యంలో ఆయన ఆన్‌లైన్ చేసిన భూములపై మరింత లోతుగా విచారించాలని బాధితులు పేర్కొంటున్నారు.

త్రిపురాంతకేశ్వరాలయం..

శాసనాల నిలయం

త్రిపురాసుర సంహారం జరిపిన పరమేశ్వరుడు నిలిచిన స్థానమే కుమార గిరి. ఈ గిరిపై పరమేశ్వరుడు త్రిపురాంతకేశ్వరుడిగా విరాజిల్లుతున్నాడు. పార్వతీదేవి స్కందమాతగా దర్శనమిస్తోంది. త్రిపురాసుర సంహార సహాయకారి అయిన అమ్మవారు దగ్గరలోని చెరువులో ఉన్న నడబావిలో బాలాత్రిపురసుందరీదేవిగా విరాజిల్లుతోంది. ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందనీ, అపూర్వమైన చరిత్ర ఉందనీ తెలిపే కొన్ని వందల శాసనాలు, శాసన శిల్పాలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఆ శాసనాలు ప్రధానాలయంతోపాటు, ఉప ఆలయాలు, చీకటి మిద్దెలో కనిపిస్తున్నాయి. ఆ శాసనాలను తెలిపే ప్రత్యేక కథనం..


• చరిత్రకు సాక్ష్యంగా లిఖించినవెన్నో.. • ఆలయవిశిష్టతపైనా పరిశోధనలు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణా వాసి, చారిత్రక పరిశోధకుడు బి.ఎన్.శాస్త్రి స్థానికంగా ఉన్న కవి పాలుట్ల వెంకట నర్సయ్యతో కలిసి 1960 ప్రాంతంలో 100 శాసనాలను గుర్తించి పుస్తక రూపంలోకి తెచ్చారు. అనంతరం మరికొందరు పరిశోధకులు అనేక శాసనాలను వెలుగులోకి తెచ్చారు. ఆలయ గోడలపైనా, చీకటి మిద్దెతోపాటు ఆలయ పరిసరాల్లోనూ శాసనాలను గుర్తించారు. పూర్వం ఎందరో రాజులు, మంత్రులు, సామంతులు, గురువులు, సీమపాలకులు, ప్రజలు స్వామివారి నిత్యాభిషేకం, దూప దీప నైవేద్యాలు, అన్నప్రసాదాలు, ఇతర కార్యక్రమాల కోసం, పుణ్యం కోసం అనేక భూదానాలు, బంగారు, వెండి ఆభరణాలు, గోవులు దానధర్మాలు చేసి, గోపురాలు కట్టించి శాసనాల రూపంలో ఏర్పాటు చేశారు. ఇక్కడి శాసనాల నిర్మాతల ప్రకారం అప్పట్లో వెలనాడు, కమ్మనాడు, కొంజపల్లినాడు, పలనాడు, పూంగినాడు, పొత్తపినాడు, మెట్టవాడి, నతవాడి, మార్జవాడి, నడవళికంపణం, దువ్వలికంపణం, నీరువ, వేంగి మొదలగు సీమలు ఉన్నట్లు శాసనాల్లో లిఖించి ఉంది. స్థానిక చారిత్రక పరిశోదకుడు తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ ఇటీవల కాలంలో పలు పరిశోధనలు చేసి కొన్ని శాసనాలను గుర్తించారు.

శాసనాల్లోని ముఖ్యాంశాలు

త్రిపురాంతకేశ్వరాలయంలో క్షేత్రంలో లభ్యమైన 1106 నాటి మొదటి శాసనంలో వెలనాటి గొంకరాజు కమ్మనాటిలోని బేటలపాడు గ్రామాన్ని స్వామివారి కైంకర్యాల కోసం దానం చేసినట్లు ఉంది. 1177లో ఆలయ స్థానాచార్యులు వ్యాసరాసి పండితుడు మిరియంపల్లిలోని పొలాన్ని దానం చేశాడు. 1185లో కాకతీయ రుద్రదేవుడు ఆలయాన్ని సందర్శించి కృష్ణాతీరంలోని రేవూరును దానం చేశాడు. 1254లో కాకతీయ గణపతిదేవుని కాలంలో గంగయసాహిణివారు త్రిపురాంతకేశ్వరుడికి దువ్వలికంపణములోని కంకులకుంటను దానం చేశారు. అదే ఏడాది విశ్వేశ్వరాచార్యుల కుమారుడు శాంతశంబు స్వామివారి విమానగోపురాన్ని తెల్లచలువరాతితో నిర్మించాడు. 1261లో ఆలయం తూర్పు గోడకు వేయించిన శాసనంలో రుద్రమదేవి పేరు ఉండటం విశేషం.


త్రిపురాంతకేశ్వరాలయం ప్రాంగణంలోని శాసనాలు


త్రిపురాంతకేశ్వరాలయం(ఫైల్)


చోడ శాసనం : చీకటి మిద్దె ఎదురుగా పది అడుగుల నంది స్థంభంపై ఈ శాసనం ఉంది. ఇది 1100 సంవత్సరంలో చోడ దేవుడు అనే రాజుకాలంలో త్రిపురాంతకేశ్వరుడికి దేవతార్చన చేసే పూజారి శ్రీధరబట్టు నాగస్తంభాన్ని నిలిపినప్పుడు వేయించిన శాసనం ఇది.


అన్నదేవ మహారాజు శాసనం : కాకతీయుల కాలంలో అన్నదేవ మహారాజు స్వామివారి వైభోగాలకు, దూపదీప నైవేద్యాలకు, సోమవార ఉత్సవాలను పుస్కరించుకుని కంచనపల్లి అనే గ్రామాన్ని దానం ఇచ్చినట్లు తెలిపే శాసనం ఉంది. దీనిలో పానవట్టంతో కూడిన శివలింగం, నంది, మానవ చిత్రాలు ఉన్నాయి


అంబదేవుడి స్వయం ప్రకటిత శాసనం : కాయస్థ అంబదేవరాజుకు త్రిపురాంతకంతో ఎక్కువ అనుబంధం ఉంది. 1290లో స్వయం ప్రకటిత శాసనం వేయించాడు. దాని ప్రకారం అంబదేవుడు బ్రాహ్మణ విద్వేషి అయిన మల్లికార్జునుని సప్తాంగ హరణం చేసి పారదోలినట్టు ఈ శాసనం తెలుపుతోంది.


మైలాంబ శాసనం : కాకతీయ గణపతిదేవుడి సోదరి మైలాంబ. ఈమె శైవక్షేత్ర యాత్రలో భాగంగా త్రిపురాంతకేశ్వరాలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని గుర్తుగా మైలాంబికేశ్వరాలయం అనే ఉపాలయాన్ని 1209లో నిర్మించింది. స్వామివారి నైవేద్యాల కోసం తన ఏలుబడిలోని దిత్తాలు అనే గ్రామ చెరువు మాన్యాలను దానంగా ఇచ్చింది. కాలక్రమేణా మైలాంబికేశ్వరాలయం శిథిలమైంది. ఈ ఆలయ నిర్మాణానికి గుర్తుగా అప్పట్లో వేసిన శాసనమే మైలాంబ శాసనం.


రుద్రమదేవి శాసనం : 1261లో వేయించిన ఈ శాసనం ప్రకారం రుద్రమదేవికి సకల సేనాధిపతి దాలుక్య వంశంవాడు. ఆయన త్రిపురాంతకేశ్వరుడి అఖండ దీపానికి 50 పశువులను దానం చేసినపుడు ఈ శాసనం వేయించారు. దీనిలో రుద్రమదేవిని రుద్రదేవ మహారాజు అని సంభోదించారు.


'నక్ష' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పక్కన మేయర్ గంగాడ సుజాత

'నక్ష' సర్వేతో ఆదాయ వనరుల పెంపు

• ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల ఆదాయ వనరుల పెంపు కోసం అవసరమైన చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ల్యాండ్ నేతృత్వంలో పట్టణాల భూ రికార్డులను ఆధునికీకరించడం కోసం చేపట్టిన 'నక్ష' కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్-బెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్ కింద దేశంలోని 152 నగరాలను, మునిసిపాలిటీలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ సర్వే ద్వారా నగర పరిధిలోని భూ రికార్డులు, గృహాలు, ఆస్తులు ఆధునికీకరిస్తారన్నారు. రాష్ట్రంలో పది కార్పొరేషన్‌లు ఎంపిక చేయగా, అందులో ఒంగోలుకు స్థానం లభించడం సంతోషంగా ఉందన్నారు. మరో అతిథి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద మొదటిగా ఎంపికైన మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఇంటింటి సర్వే జరుగుతుందని తెలిపారు. దీని ద్వారా ప్రతి ఇంటినీ పరిశీలించి ఆ ఇంటికి కేటాయించిన ఆస్తిపన్నును గుర్తిస్తారన్నారు. నగర కమిషనరు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సర్వేతో ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల ఆదాయ వనరుల పెంపునకు దోహదపడతాయన్నారు. ఇంటింటి సర్వే చేసి, అండర్ అసెస్‌మెంట్‌లను గుర్తించడంతోపాటు, ఆస్తి పన్నుల్లో లోపాలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, సీడీఎంఏ డిప్యూటీ డైరెక్టర్ అనిత నక్ష సర్వేపై దిశ నిర్దేశం చేశారు. దేశ వ్యాప్తంగా మంగళవారం మధ్యప్రదేశ్‌లో రూరల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించగా, ఆ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డిజిటల్ తెరపై ప్రదర్శించారు.

'రెవెన్యూ' అర్జీలను పరిష్కరించాలి

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని జేసీ గోపాలకృష్ణ హెచ్చరించారు. మంగళవారం ఒంగోలులోని ఆర్డీవో కార్యాలయంలో ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల తహసీల్దార్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రెవెన్యూసదస్సులలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై వినూత్న ప్రచారం

రసాయనాల్లేని కృత్రిమ ఎరువుల వాడకంతో చెట్లు ఎంత ఆరోగ్యంగా ఉంటాయో వాటి ఫలాలు అంతే ఆరోగ్యాన్నిస్తాయి. అలాగే వివిధ రసాయనాలు కలిసిన ఆహారాల వల్ల మన శరీరంలో గుండె, ఊపిరితిత్తులు, మెదడు, కిడ్నీలలో ఏదో ఒకటి పాడైపోయి క్యాన్సర్లకు దారితీస్తుందనీ, దీని నివారణకు ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలనీ అవగాహన కలిస్తూ చేపట్టిన కార్యక్రమంలోనిది ఈ దృశ్యం. మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడులో మంగళవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించిన సందర్భంగా ఓ చెట్టును ఇలా అలంకరించి అవగాహన కల్పించారు.

యువకుడి హత్య కేసులో 8 మందికి జీవితఖైదు

• ఒక్కొక్కరికీ రూ.5వేల జరిమానా • ఒంగోలు 7వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రాజా వెంకటాద్రి తీర్పు

మార్టూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తమ మతానికి చెందిన యువతిని ప్రేమించాడనే కోపంతో వేరే మతానికి చెందిన యువకుడిని హత్య చేసిన కేసులో 8 మందికి జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం ఒంగోలు సెవెంత్ అడిషనల్ అండ్ డిస్ట్రిక్ సెషన్స్ న్యాయాధికారి టి.రాజవెంకటాద్రి తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికీ రూ.5వేలు జరిమానా విధించారు. మొత్తం ఈ కేసులో 9 మంది నిందితులు కాగా, వారిలో 8వ నిందితుడిగా ఉన్న జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ గతంలోనే మృతి చెందాడు. మిగిలిన ఎనిమిది మంది నేరస్థులుగా కోర్టు నిర్ధారించింది. వారిలో షేక్ మున్నీర్‌బాషా (ద్రోణాదుల), షేక్ అన్వర్‌బాషా (ద్రోణాదుల) షేక్ నజీర్ (ద్రోణాదుల), షేక్ కరిముల్లా (రామకూరు), షేక్ బాజిబుడే (రామకూరు), షేక్ సద్దాంహుస్సేన్ (రామకూరు), షేక్ షకీల (రామకూరు), పటాన్ మౌలాలి (యద్దనపూడి)లకు కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ కేసుకు సంబంధించి వివరాలను సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. జె.పంగులూరు మండలం రామకూరు గ్రామంలో బూరగ యేసుదయమ్మ కుమారుడు రత్నబాబు ట్రాక్టరు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామంలో షేక్ కరిముల్లా కుమార్తె కరిష్మా (బాలిక) రత్నబాబు ప్రేమించుకున్నారు. వారి ప్రేమపై ఆగ్రహం వ్యక్తం చేసిన కరిష్మా తల్లిదండ్రులు 2015 మార్చి 23వ తేదీన ఇంటి నుంచి కుమార్తెను బయటకు పంపించారు. కరిష్మాను రత్నబాబు తన ఇంటికి తీసుకువెళ్లాడు. మైనారిటీ తీరిన తర్వాత కరిష్మాను వివాహం చేసుకుంటానని రత్నబాబు కుటుంబసభ్యులకు చెప్పారు. తర్వాత 15 రోజులకు కరిష్మా మూడో మామ నజీరు, నాల్గవ మామ మునీర్ బాషా, మరో వ్యక్తి అన్వర్ రత్నబాబు ఇంటికి వచ్చి కరిష్మా వివాహానికి తాము అంగీకరిస్తున్నట్లు చెప్పి ఇంటిలోనే మద్యంతో పార్టీ చేసుకున్నారు. తరువాత 2015 ఏప్రిల్ 28న అన్వర్, మునీర్‌బాషా.... రత్నబాబు ఇంటికి వచ్చి రేపు ఉదయం జె.పంగులూరు మసీదులో కరిష్మా వివాహం చేద్దామని, అందు కోసం నూతన వస్త్రాలు కొనుగోలు చేయాలని రత్నబాబును తీసుకొని మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి వెళుతున్నట్లుగా యేసుదయమ్మకు చెప్పారు. అయితే వారు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం రత్నబాబును రామకూరు ఉత్తరం పొలాలవైపు తీసుకువెళ్లి అక్కడ అతనిని కత్తులతో కిరాతకంగా పొడిచి హత్య చేశారు. హత్య చేసిన విషయాన్ని వారు కరిష్మాకు ఫోన్‌చేసి చెప్పారు. మరుసటిరోజు గ్రామస్థులతోపాటు రత్నబాబు కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లగా అక్కడ రత్నబాబు మృతదేహం ఉంది. ఈ విషయమై రత్నబాబు తల్లి యేసుదయమ్మ మార్టూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేశారు. అప్పటి చీరాల డీఎస్పీ జయరామరాజు వేగంగా దర్యాప్తు చేశారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు డీఎస్పీ జి.రామాంజనేయులు పర్యవేక్షణలో సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ కిరణ్... నిందితులను కోర్టులో హాజరు పరచేవిధంగా కృషి చేశారు. అడిషనల్ పీపీ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ తరఫున కోర్టులో వాదనలు వినిపించారు. నేరం నిర్ధారణ కావడంతో కోర్టు జీవిత ఖైదు ఖరారు చేసింది. నిందితులకు జైలుశిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీసు అధికారులను, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

పుకార్లే.. బర్డ్‌ఫ్లూ కేసుల్లేవు!

• జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి


కోడి, కోడుగుడ్లను చూపుతున్న పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి, సిబ్బంది

సంతనూతలపాడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవని, కేవలం అపోహ మాత్రమేనని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి పేర్కొన్నారు. మంగళవారం సంతనూతలపాడు పశువైద్యశాలలో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాలకు చెందిన పశుసంవర్ధకశాఖ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పక్క జిల్లాల నుంచి పశువుల దాణా, కోడిగుడ్లు, కోళ్లను ఇక్కడకు రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కోడి గుడ్డు, కోడి మాంసంలో పోషకాహార విలువలు కలవని, ప్రజలు ఎటువంటి సందేహం లేకుండా తీసుకోవచ్చన్నారు. జిల్లాలో 2,36,500 బాయిలర్ కోళ్లు, అదేవిధంగా రైతుల వద్ద 8,33,434 పెరటికోళ్లు, 1,64,500 గుడ్లుపెట్టే కోళ్లు ఉన్నట్లు ఆమె తెలిపారు. వీటి ద్వారా జిల్లాలో సంవత్సరానికి 3,20,77,800 కోడుగుడ్లు ఉత్పత్తి అవుతున్నట్లు చెప్పారు. అందువల్ల బర్డ్‌ఫ్లూ లేదని, అపోహ మాత్రమే అనే విషయాన్ని గ్రామాల్లోని ప్రజలకు తెలిపాలని కోరారు. పశువైద్యుడు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కె.సుధీర్‌బాబు, టి.మనురూప్, వై.పేరయ్య, పి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

BUILDING FOR RENT / SALE

ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఎదురు, రామ్‌నగర్, 6వ లైను, N.R.K.M లాడ్జి ప్రక్కన, 5 అంతస్తుల బిల్డింగ్ (40X80 RCC) కొలతలతో అద్దె / అమ్మకానికి కలదు. సెల్: 9866659049, 7013261494 AJO-232668

HOUSE FOR SALE

కొండపి (మం), కె.ఉప్పలపాడు గ్రామంలోని 6 సెంట్లలో కన్‌స్ట్రక్షన్ జరిగిన డూప్లెక్స్ హౌస్ అమ్మబడును. Price : కోటి 10 లక్షలు, నెగోషబుల్ కలదు, సెల్: 99590 53803. AJO-211451

WANTED

పామూరులోగల అశ్విని హాస్పిటల్ నందు ల్యాబ్ టెక్నిషన్‌గా పనిచేయుటకు అనుభవం కలిగిన టెక్నిషన్ కావలెను. వివరములకు సంప్ర॥ సెల్: 9441173327 AJO-211445

WANTED

బాంద్స్ టైలర్స్, MSR రోడ్, కనిగిరి పాంట్స్, షర్ట్స్ కుట్టుటకు అనుభవం కలిగిన వర్కర్లు కావలెను మరియు ఇచ్చట మిషిన్ వర్క్ కూడా నేర్పబడును. సంప్ర॥ సెల్ : 9908462823 AJO-200196

WANTED

ఒంగోలులోని ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు సెక్షన్ ఇన్‌ఛార్జులు, జూనియర్ లెక్చరర్స్, PROలు కావలెను. Q: డిగ్రీ, M.Sc., M.B.A, అనుభవము బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 6399552222 AJO-388

WANTED

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ MARAM VENKATAREDDY INFRA, గుంటూరు మరియు ఒంగోలు నందు పనిచేయుటకు MARKETING DIRECTORS, GENERAL MANAGERS, ASST GENERAL MANAGERS, DIGITAL MARKETING PERSONS మరియు ACCOUNTANTS కావలెను (అనుభవం కలిగిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడును) సంప్రదించవలసిన నెంబరు : 9515980476, 8074432717 AJG-210366

డిస్టెన్స్ ఎడ్యుకేషన్

గీతం డిగ్రీ కాలేజ్, ANU అఫిలియేటెడ్ స్టడీ సెంటర్ నందు B.A., B.B.A., B.Com., M.Sc., All M.Sc సైకాలజీ M.B.A, M.C.A., B.Lisc., M.A(All) M.Com, MHRM, M.S.W కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఒంగోలు. సంప్ర : 90305 68558, 98491 24970 AJO-232672

కావలెను

చీరాల మసీదు సెంటరుకు దగ్గరలోని ప్రముఖ ఆసుపత్రి నందు పనిచేయుటకు ఆయా కావలెను. సంప్ర॥ సెల్: 92422 73274. AJO-211379

ఇన్సూరెన్స్

LIC పాలసీ, హెల్త్ ఇన్సూరెన్స్, యాక్సిడెంటల్ పాలసీ & ట్రావెల్స్ పాలసీ (ఆల్ కంట్రీస్) కొరకు సంప్రదించండి. కె.అశోక్‌చౌదరి. సెల్ : 97042 50705, 7032178599. AJO-211328

అమ్మకము

ప్రకాశం జిల్లాలో 370-HITACHI ప్రొక్లైన్స్, 210-HYUNDAI ప్రొక్లైన్స్ with సింగిల్ జాకీ డ్రిల్లింగ్ మెషిన్, CAT WHEEL LOADER (988K), ROCK-BUGGY (డ్రిల్లింగ్ మెషిన్) MAN TIPPERS మరియు DUMPERS (1035) అమ్మకమునకు కలవు. చీమకుర్తి మండలం నందు 4.5 ఎకరాలలో విస్తరించి ఉన్న MVR స్టోన్ క్రషర్స్ (36/30-1no & 30/9-2no) కంకర మిల్లు అమ్మకమునకు కలదు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 8074432717, 80087 00148 AJG-210361

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వేడుక ఏదైనా సందర్భం ఎటువంటిదైనా మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో... దినపత్రిక ద్వారా మరింత చేరువకండి.

జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు | విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు | ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | జయంతి/ శ్రద్ధాంజలి/ వర్ధంతి

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥ 9985411484

వినియోగంలోకి.. స్వచ్ఛభారత్ ఆటోలు

● వైసీపీ పాలనలో వదిలేసిన వాటికి మరమ్మతులు
● పరిశీలించిన మంత్రి స్వామి



మరమ్మతులు చేసిన ఆటోను నడిపి పరిశీలిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో మూలనపడేసిన స్వచ్ఛ భారత్ ఈ-ఆటోలు మళ్లీ వినియోగంలోకి రానున్నాయి. వీటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించారు. తూర్పునాయుడుపాలెంలో ఉంచిన ఈ ఆటోలను మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో గ్రామాల్లో చెత్త సేకరణ కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆటోలను ఇచ్చామన్నారు. వాటిని గత వైసీపీ ప్రభుత్వం మూలనపడేసిందన్నారు. ఐదేళ్ల పాలనలో ఎస్సీ కార్పొరేషన్‌ను జగన్ నిర్వీర్యం చేశాడని విమర్శించారు. కనీసం ఐదుగురికి కూడా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం ఇవ్వలేదని ధ్వజమెత్తారు.

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య

● రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రారంభం
● దీని ద్వారానే ప్రభుత్వ పథకాలు, రాయితీలు

చీమకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తికి ఆధార్ నంబరు ఉన్నట్లుగా భూమి కలిగిన ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న రైతుసేవా కేంద్రాల్లో ఈ విశిష్ట సంఖ్య కోసం నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో ఈ ప్రాజెక్టును కేంద్రప్రభుత్వం చేపట్టింది. ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతిరైతుకూ 11నంబర్లతో యూనిక్‌కోడ్‌ని కేటాయిస్తారు. ప్రస్తుతం భూ యజమానులకు మాత్రమే నమోదు ప్రక్రియ జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ప్రతి రైతూ రిజిస్టర్ చేయించుకుని యూనిక్ నంబరు పొందాల్సి ఉంటుంది. ఈ నంబరుతో వ్యవసాయ సంబంధిత సేవలన్నీ పొందే అవకాశం లభిస్తుంది. కాగా పేర్ల నమోదుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలకు గురించి ఏవో భాస్కర్ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. భూహక్కులు కలిగిని ప్రతిరైతూ గ్రామంలో ఉన్న రైతుసేవా కేంద్రానికి ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్‌నంబర్(ఓటీపీ కోసం), భూహక్కు యాజమాన్యపత్రాలు తీసుకొని వెళ్లాలని కోరారు. అక్కడ గ్రామ సహాయకులు నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. అందువల్ల రైతులు త్వరగా పేర్లు నమోదు ప్రక్రియను పూర్తిచేసుకోవాలని ఆయన కోరారు.

రైతులందరూ యూనిక్ నంబరు పొందాలి

సంతనూతలపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 11 అంకెల యూనిక్ నంబరు ఇవ్వాలని నిర్ణయించినందున రైతులు తమ గ్రామాల్లో రైతుసేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏవో పావని తెలిపారు. మంగళవారం పేర్నమిట్ట, ఎండ్లూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె రైతులతో మాట్లాడారు. ఈనెల 26వ తేదీలోపు యూనిక్ నంబరు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.



చీమకుర్తి వ్యవసాయశాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● మాజీ మంత్రి నాగార్జున



మిరపకాయలను పరిశీలిస్తున్న నాగార్జున

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంట సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మెరుగ నాగార్జున డిమాండ్ చేశారు. మండలంలోని ఒమ్మెవరం గ్రామంలోని మిర్చి కల్లాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది మిర్చి రైతులు నష్టాల్లో కూరుకుపోయారని చెప్పారు. మిర్చి పంటకు మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు ఎక్కడా మద్దతు ధర అడగలేదన్నారు. గత ఏడాది మిర్చి ధరలు క్వింటా రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఉన్నాయని, ప్రస్తుతం రూ.12 వేలకు పడిపోయనిఓ చెప్పారు. రైతులు ఎకరానికి రూ.2.50 లక్షలు పెట్టుబడి కాగా తెగుళ్ల, పురుగుల ధాటికి దిగుబడి సైతం తగ్గిపోయి, ధరలు పతనంతో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, కంచర్ల సుధాకర్, పోలినేని కోటయ్య, మాదాసు రాంబాబు, గుండు హరిబాబు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, పొట్లేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్విస్ విద్యార్థుల ప్రాజెక్టుకు బహుమతులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం నిర్వహించిన జిల్లాస్థాయి యువ ఉత్సవ్ ఇండియా-47 కార్యక్రమంలో ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వినూత్న శానిటరీ ప్యాడ్ తయారు చేసిన ప్రాజెక్టుకు మొదటి బహుమతి లభించింది. ఈసీఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన గోనుగుంట లక్ష్మి, పొన్నావల్లి లక్ష్మీహారిక, పచ్చిపులుసు పృథ్వీలు ఈ బహుమతులను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎస్.శ్రీగాయత్రిలు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ హిమబిందు, ప్రాజెక్టు మెంటార్ షేక్షావలి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు పాల్గొన్నారు.

క్విస్ హైస్కూలు విద్యార్థుల ప్రతిభ

స్థానిక కర్నూలు రోడ్డులోని క్విస్ హైస్కూలు విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటారు. నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు బాపట్ల జిల్లా అద్దంకిలో జరగ్గా ఎం.యేసన్న కుమితేలో బంగారు పతకం, కరాటేలో వెండి పతకాన్ని సాధించారు. కరాటేలో కె.జయంత్, శుభశ్రీదాస్ బంగారు పతకాలను అందుకున్నారు. మహేంద్రకుమార్ ద్వితీయ, అభయ్‌తారక్ తృతీయ బహుమతులు పొందారు. క్రీడాకారులను క్విస్ విద్యా సంస్థల అధినేత సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శ్రీగాయత్రి అభినందించారు.

21న శునకరాగాలు పుస్తకావిష్కరణ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ రచించిన శునక రాగాలు పుస్తకావిష్కరణ ఈ నెల 21వ తేదీన సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు నూనె అంకమ్మరావు మంగళవారం తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ కళాపరిషత్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలలో ఈ పుస్తకాన్ని సాహిత్య, పురప్రముఖుల చేతులమీదుగా ఆష్కరన ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అరుణా సికిందర్ పుస్తకాన్ని స్వీకరిస్తారిస్తారని తెలిపారు. అదేవిధంగా గద్వాల సోమన్న రచించిన పిల్ల తెమ్మెరలు బాలగేయాల పుస్తకావిష్కణ సైతం ఉంటుందన్నారు. కనుక కార్యక్రమంలో సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రూ.2 కోట్లతో భైరవకోన అభివృద్ధి

మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు అన్నిఏర్పాట్లు
ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భైరవకోనను రూ.2కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనను మంగళవారం వివిధశాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఆలయ పరిసరాలను, జలప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్ల గురించి దేవస్థాన ఈవో వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా దైవదర్శన కోసం దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రాబోవు రోజుల్లో భైరవకోనలో పలు అభివృద్ధి పనులు చేపట్టి పర్యాటక ప్రాంతంగా గుర్తింపు తీసుకొస్తామన్నారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీగా వస్తారన్నారు. ఈసందర్భంగా జలపాతం వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ ఏర్పాటు్లు చేయాలని ఆదేశం చారు. భక్తుల నడక ప్రాంతంలో రాళ్లగుట్టలను తొల గించాలన్నారు. రోడ్డు మార్గంలో వాహనాల రాకపోక లకు జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. మహిళా భక్తులకు ప్రత్యేక స్నాన, మరుగుదొడ్లు, బస్ పార్కింగ్, విద్యుత్ లైటింగ్ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. టెంకాయలు తెచ్చుకొనేందుకు ప్లాస్టిక్ కవర్లుకు బదులు క్లాత్ సంచులు తెచ్చుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. మంచినీటి వసతి, పారిశుధ్య చర్యలు చేప ట్టాలని సూచించారు. ఈసందర్భంగా ఉత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, డీఎల్‌డీవో పి.శ్రీనివాసరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

సంతనూతలపాడులో రోడ్డుకు మరమ్మతులు

ఎస్పీ ఆదేశాలతో
గుంతల పూడ్చివేత చేపట్టిన పోలీసులు



చెరువుకట్ట వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్



మరమ్మతులు చేయిస్తున్న ఎస్ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఆర్అండ్‌బీ రోడ్డులో అధ్వానంగా పలు చోట్ల పోలీసుల ఆధ్వర్యంలో మరమ్మతులు పనులు చేపట్టారు. స్థానిక చెరువుకట్ట సమీపంలోను, పోలీస్‌స్టేషన్ వద్ద, వేంకటేశ్వర ఆలయం వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్లు వద్ద ఏర్పడిన గుంతలతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఇటీవల ఒంగోలు నుంచి చీమకుర్తి వెళుతున్న ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆయా స్పీడ్‌బ్రేకర్ల ప్రదేశంలో అధ్వానంగా ఉన్న గుంతల పరిస్థితిని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వి.అజయ్‌బాబును ఆదేశించారు. ఈక్రమంలో పోలీసులు మంగళవారం స్పీడ్ బ్రేకర్ల వద్ద తారు, కంకరరాళ్లను తెప్పించి గుంతలను పూడ్చివేసే పనులు చేపట్టారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం
రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపీ జేసీ అమరావతి మహిళా విభాగం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షురాలు పి.లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అమరావతి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహిళా విభాగం పని చేస్తుందన్నారు. మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న చోట కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వంలో మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులను రెండు సంవత్సరాలకు పొడగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 21 జిల్లాల్లో మహిళా కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మార్కాపురం, కనిగిరి, ఒంగోలు, ఒంగోలు అర్బన్ డివిజన్లలో మహిళా కమిటీలను నియమించినట్లు చెప్పారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లాలో మహిళా ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పాటుపడాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీదేవి, జేఏసీ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మధుసూదన్‌యాదవ్, కె.వెంకటేశ్వర్లు, రెవెన్యూ అసోయేషన్ కార్యదర్శి ఆర్.వాసుదేవరావు, శ్రీనివాసరావు, సాయి పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో ప్రభుత్వ వైద్యశాలను నిర్మించాలి

మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు
కూటమి నాయకుల వినతి



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న కూటమి నాయకులు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అతి పెద్ద మేజర్ గ్రామ పంచాయతీ ఉప్పుగుండూరు గ్రామంలో 50 పడకల ప్రభుత్వ వైద్యశాల నిర్మించాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు గ్రామానికి చెందిన కూటమి నాయకులు కోరారు. మంగళవారం మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో జరిగిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమానికి వచ్చిన మంత్రిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. 12వేలకు పైగా జనాభా ఉండే ఉప్పుగుండూరులో అధిక శాతం ఎస్సీఎస్టీలతో పాటు పేద ప్రజలు నివశిస్తున్నారని మంత్రికి తెలిపారు. వారితో పాటు నిత్యం వందల సంఖ్యలో పలు గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారని, వారందరికి అందుబాటులో ప్రభుత్వ వైద్యశాల లేక ఉచిత వైద్యం కోసం జిల్లా కేంద్రం ఒంగోలు వెళ్లాల్సివస్తుందని చెప్పారు. అందువల్ల ఉప్పుగుండూరులో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించి పేదలకు ఉచిత వైద్యం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు కనగాల శ్రీనివాసరావు, కె.సెల్వం, మిండాల శ్రీనివాసరావు, బెల్లం శ్రీనివాసరావు, ఆత్మకూరి వాసు, విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్ కేఎల్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులోని బీజేపీ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలులోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సందర్శించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక దేవుడు చెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్‌ను జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాదరస్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో కొద్దిసేపు పార్టీ శ్రేణులతో మాట్లాడారు. మంత్రి సత్యకుమార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి శాలువతో సత్కరించారు. అదేవిధంగా మంత్రితో పాటు పార్టీ కార్యాలయానికి వచ్చిన సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌ను కూడా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్, మాజీ అధ్యక్షుడు పీవీ.కృష్ణారెడ్డి, నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, శివాజీ, డి.శ్రీనివాసరావు, రవి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న క్విస్ విద్యా సంస్థల అధినేత సూర్య కళ్యాణ్‌చక్రవర్తి

'జ్ఞానజ్యోతి'ని విజయవంతం చేయాలి

● డీవైఈవో చంద్రమౌళేశ్వరరావు

చీమకుర్తి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రవేశపెట్టిన జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీవైఈవో చంద్రమౌళేశ్వరరావు కోరారు. మండలంలోని బండ్లమూడి హైస్కూల్లో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై ఆరురోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంవో రమేష్, ఎంఈవోలు నరసింహారావు, శివాజీ, హెచ్ఎం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) ప్రోగ్రాంలో భాగంగా సంతనూతలపాడులో పాఠశాల విద్యాశాఖ, మహిళ శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగనవాడీ టీచర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంఈవోలు చంద్రమౌళీశ్వర్, వెంకారెడ్డి మాట్లాడుతూ ఆటాపాటలతో అంగనవాడీ చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకోసం ప్రభుత్వం ఏడాదిలో 40 రోజుల చొప్పున మూడేళ్లలో 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు శిక్షణ కార్యక్రమానికి రూపకల్పన చేసిందని తెలిపారు. మండలంలో మొత్తం 56మంది అంగనవాడీ టీచర్లు పనిచేస్తుండగా 55మంది శిక్షణకు హాజరయ్యారు. రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

మద్దిపాడులో..



మాట్లాడుతున్న ఆర్జేడీ జయలక్ష్మి

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చసిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమాన్ని ఆర్జేడీ జయలక్ష్మి పరిశీలించారు. చిన్నారులుకు ఆటపాటలతో పాటు విద్యాబోధన అందించాని ఆమె చెప్పారు. అనంతరం పలు అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: మండలంలోని రెండు సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై ఆరు రోజుల శిక్షణను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ విద్య బలోపేతానికి సంబంధించిన అంశాలపై కోర్సు డైరెక్టర్‌లు సుబ్బారావు, వసంతరావు, చిలంకూరి చంద్రశేఖర్, హనుమంతరావు, సుసన్నకుమార్, సీహెచ్.సుబ్బారావు శిక్షణ ఇచ్చారు. సీడీపీవో మాధవీలత, ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు, సూపర్‌వైజర్ విక్టోరియారాణి పాల్గొన్నారు.

జరుగుమల్లిలో..

జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలోనూ శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, ఎంఈవో బి.నాగేంద్రవదన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి కృషి

● సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్‌ఇమ్మానియేలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. మంగళవారం ఒంగోలులోని విద్యుత్‌భవన్‌లో వినియోగదారుల అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. కాగా 14 సమస్యలు రాగా 4 సమస్యలను అక్కడక్కడే పరిష్కరించారు. కొన్ని సమస్యలు పాలనా నిర్ణయాలు కావడంతో వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్‌వినియోగదారుల పరిష్కార వేదిక సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్.శ్రీనివాసరావు, ఎ.సునీత, విద్యుత్‌శాఖ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, ఈఈ మాకినేని హరిబాబు, టౌన్ డీఈ వీపీ.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు

నేడు, రేపు తపాలా జీవిత బీమా మేళా

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తపాలా జీవిత బీమా/గ్రామీణ తపాలా జీవిత బీమా మెగా మేళాను ఈనెల 19,20 తేదీలలో నిర్వహిస్తున్నట్లు సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎండీ.జాఫర్‌సాధిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వెయ్యికి పైగా కొత్త బీమా పాలసీలను చడంతోపాటు కోటి రూపాయల ప్రీమియం సమీకరణే లక్ష్యమన్నారు. పోస్టల్ జీవిత బీమా వల్ల తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్ లభిస్తుందని తెలిపారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలోని అన్నీ పోస్టాఫీస్‌లలో నేడు, రేపు జరిగే మెగా మేళాను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక కౌన్సిల్ హాలులో జరుగుతుందని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 2025-26 ఏడాదికి సంబంధించి ఆదాయం, వ్యయం అంచనాలపై చర్చ జరుగుతుందన్నారు. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కార్పొరేటర్లు పాల్గొని సలహాలు, సూచనలు చేయాలని ఆయన కోరారు.

సబ్సిడీ రుణాల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ సబ్సిడీ పథకాల రుణాల దరఖాస్తులను ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో బ్యాంకు, సచివాలయ సిబ్బంది పరిశీలించారు. మొత్తం 404 మంది దరఖాస్తు చేసుకోగా తొలిరోజున 200 దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు, ఏపీజీబీ మేనేజర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ పరీక్షకు పేస్ విద్యార్థుల హాజరు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ 2024-25లో శిక్షణను పూర్తిచేసుకొని విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఈనెల 15న ప్రాక్టికల్స్, 16న రాతపరీక్షను నిర్వహించారు. అందులో ఒంగోలుకు చెందిన 34(ఆంధ్ర) ఎన్‌సీసీ బెటాలియన్, చీరాల, నర్సరావుపేటకు చెందిన 23(ఆంధ్ర) బెటాలియన్‌లకు ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంగా పరీక్ష నిర్వహించగా సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్‌తో పాటు కళాశాల ఏఎన్‌వోలు కూడా పాల్గొన్నారు. ఇటువంటి పరీక్షల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం, పట్టుదల పెరుగుతుందని పేస్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. గుంటూరు గ్రూప్ కమాండింగ ఆఫీసర్ కల్నల్ ఎస్ఎం.చంద్రశేఖర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారని పేర్కొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో కిరణ్‌కుమార్ సూచించారు. నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని గదులు, ఇతర సౌకర్యాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అర్థవంతంగా బోధించి మంచి ఫలితాలు సాదించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వారి పనితీరుపై సమీక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటసుబ్బయ్య, సింగమ్మ, వెంకటరావు, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు



సరస్వతీ విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

కొండపి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలోని జడ్పీస్కూల్‌లో పూర్వ విద్యార్థులు రూ.2లక్షలతో సరస్వతీ విగ్రహం ఏర్పాటు చేశారు. దాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఎంఈవో-2 పి.రామారావు, స్కూల్ హెచ్ఎం సుసన్నకుమార్ అభినందించారు. కార్యక్రమంలో 1994-95లో 10వ తరగతి చదివిన విద్యార్థులు, స్కూల్ కమిటీ చైర్మన్ బ్రహ్మయ్య, పూర్వపు కమిటీ చైర్మన్ రాఘవేంద్రశర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై విచారణ

మద్దిపాడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై మంగళవారం డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఒంగోలుకు చెందిన మాగంటి గోపి మద్దిపాడులోని పుల్కా పాయింట్‌లో పనిచేస్తూ ఓ బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్న సంఘటనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఎస్పీ శ్రీనివాస రావు మద్దిపాడు వచ్చి బాలిక తల్లిదండ్రులను విచారించారు. వారి దగ్గర స్టేట్‌మెంట్ తీసుకుని, ఇరుగుపొరుగు వారిని కూడా విచారించారు. ఆయన వెంట ఎస్ఐ శివరామయ్య ఉన్నారు.

ఈదరలో గంజాయి పట్టివేత?

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం పోలీసులకు సమాచారం అందిన మేరకు వారు వెళ్లి గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొన్నారు. అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై పోలీసులను అడగ్గా తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని వారు పేర్కొన్నారు.

అవీ..ఇవీ

రైతులు విధిగా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

కొమరోలు, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విశిష్ట సంఖ్యను విధిగా నమోదు చేసుకోవాలని ఏవో కే.రాజశ్రీ అన్నారు. మండలంలోని రాజుపాలెం, ఇడమకల్లు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాష్ట్రంలోని భూమి కలిగిన ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం అవుతాయన్నారు. కావున ప్రతి రైతు తమ ఆధార్‌కార్డు, పొలం పాసుపుస్తకం, సెల్ ఫోన్ తీసుకుని మీమీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ఈ నెల 25లోపు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హనుమంతరెడ్డి, వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తుంది

గిద్దలూరు : మండలంలోని ముండ్లపాడు, బురుజుపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వై.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రర్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన వన శాఖాధికారిణి విష్ణుప్రియ, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు రవిచంద్రుడు, కిరణ్మయి పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్టర్‌లో నంబరు తప్పనిసరి


రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రసన్నరంగలక్ష్మి

కొనకనమిట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతిరైతు ఫార్మర్ రిజిస్టర్‌లో పేరు నమోదు చేసుకోవాలని ఏవో ప్రసన్నరంగలక్ష్మి చెప్పారు. మండలంలోని తువ్వపాడు, రేగుమానిపల్లి గ్రామాలలో మంగళ వారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు విధిగా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నెంబర్‌తో లింకైన ఫోన్ తీసు కొని రైతు సేవాకేంద్రాలకు రావాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వీఏఏలు సాయిలక్ష్మి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అమ్మా ఫౌండేషన్ చేయూత


నగదు అందిస్తున్న బోనేని వెంకటేశ్వర్లు

కొమరోలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిచర్ల గ్రామంలో నివసిస్తున్న బొగ్గు వెంకట్రావు కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంచానికే పరిమితం కావడంతో ఆ కుటుంబం గడవడం కష్టంగా మారిందని తెలుసుకున్న అమ్మా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు వారికి రూ.20 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మా ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని విద్యార్థులకు, దివ్యాంగులకు అభాగ్యులకు చేయుతనిచ్చేందుకు అమ్మ ఫౌండేషన్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు పందరబోయిన భూపాల్ యాదవ్, కాశీరావు పాల్గొన్నారు.

నిద్రమాత్రలు మింగిన ఏఈవో

పొదిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పొదిలి వ్యవసాయ కార్యాలయంలో ఏఈవోగా పనిచేస్తున్న అరుంధతి మంగళవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సోమవారం కుంచేపల్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమం అనంతరం నిద్రమాత్రలు మిగినట్లు సంబంధిత అధికారులు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమచికిత్స చేశారు. అనంతరం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

గౌరవ వేతనం మంజూరుపై హర్షం

కంభం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదు వేల ఆదాయంలేని మసీదుల ఇమామ్‌లు, మౌజన్‌లకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేయడం పట్ల టీడీపీ ఎన్‌ఆర్‌ఐ ప్రచార సభ్యులు సయ్యద్ రఫి హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మైనారిటీ సంక్షేమాన్ని గాలికి వదిలివేసిందని, కూటమి ప్రభుత్వం మైనారిటీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.

చిట్టీల నిర్వాహకురాలిపై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పొదిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చిట్టీల పేరుతో మోసం చేసి పారిపోవాలని ప్రయత్నించిన మహిళను బాధితులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఘటన మంగళ వారం చోటుచేసుకొంది. బాధితుల వివరాల ప్రకారం, పట్టణంలోని విశ్వనాథపురానికి చెందిన లక్ష్మీ అనే మహిళ చిట్టీ డబ్బులతో ఉడాయించేందుకు ప్రయత్నించిందని పొదిలి పోలీస్‌స్టేషన్‌లో శ్యాముతోపాటు పలువురు ఫిర్యాదు చేశారు. సుమారుగా 30 నుండి 50 మంది బాధితులు ఉన్నట్లు వారు తెలిపారు. అందరికి కలిపి రూ.50లక్షలకుపైగా డబ్బులు ఇవ్వాల్సి ఉన్నా చిట్టీడబ్బులు ఇవ్వకుండా తిప్పుతున్నట్లు బాధితులు తెలిపారు. అయితే సదరు మహిళ మాత్రం ఇవ్వాల్సినమాట వాస్తవమేనని, తనకు కూడా కొంత మంది వద్ద నుంచి డబ్బు రావాల్సి ఉందన్నారు. రెండు నెలల గడువులో ఇవ్వాల్సివారికి చెల్లిస్తానని ఆమె గడువు కోరినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి నిర్మమహేశ్వరుడి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న ఆగమ పండితులు

పొదిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పార్వతీ సమేత నిర్మామహేశ్వరుని బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి అంకురారోపణతో అత్యంత వైభవవంగా ప్రారంభమయ్యాయి. ఈవో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉభయదాతలు భరతకుమార్, రమణకిషోర్, కిరణ్‌లను మేళతాళాలతో దేవస్థానానికి ఆహ్వానించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉభయదాతలు, అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆగమన పండితులు రామమూర్తి, సుధాకర్, సుబ్బయ్యలు శాస్త్రోక్తంగా పూజలు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. బుధవారం స్వామివారు ధ్వజారోహణతో పార్వతీ సమేత నిర్మమహేశ్వరులు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వెల్లడి
- అర్ధవీడులో ప్రజాదర్బార్ ఏర్పాటు


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

కంభం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాసమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధవీడు మండల సమావేశ మందిరంలో ఎంపీడీవో నరసయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాన్ని గాడిలో పెడుతోంద న్నారు. మండలాల వారిగా ప్రజాదర్బార్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించి నట్లు తెలిపారు. ఈ ప్రజాదర్బార్‌లో మండల, నియోజకవర్గ స్థాయి అధికారులందరూ ఒకే చోటుకి వచ్చేలా చేసి ప్రజల సమస్యలపై ఇచ్చే అర్జీలకు పరిష్కారం చూపుతామన్నారు. గతంలో కంభం నుంచి అర్ధవీడు మండలానికి రావాలంటే నరకప్రాయంగా ఉండేదన్నారు. రోడ్ల అంచులన్ని కోతకు గురై అడుగుకు ఒక గుంతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కంభం నుండి అర్ధవీడు వరకు రోడ్డు నిర్మాణానికి రూ.11 కోట్లు, వెలగలపాయకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు నిధులు మంజూరు చేయించి నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయ న్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా మండల నిధులు రూ.50 లక్షలను వినియోగించుకోవాలన్నారు. ఇతర ఏ పనులకు ఆ నిధులు వినియోగించరాదన్నారు. అర్ధవీడు మండలంలో శాశ్వతంగా నీటి ఎద్దడి నివారణకు వెలిగొండ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి మార్కాపురం జిల్లా కేంద్రంగా త్వరగా ప్రకటిస్తారన్నారు. పశ్చిమ ప్రకాశాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. జూలైలో తల్లికి వందనం, మహిళలకు 1500, తదితర వాగ్దానాలన్ని నెరవేరుస్తారన్నారు. అనంతరం ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎంపీపీ వెంకటరావు, మాజీ ఎంపీపీ పాలుగుళ్ల పురుషోత్తంరెడ్డి, ఏడీఈ బాలాజీనాయక్, మండల అధ్యక్షులు బండి అంజనేయులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొగాకులో అన్య పదార్థాలు లేకుండా గ్రేడింగ్ చేయాలి


రైతులకు సూచనలు ఇస్తున్న జీపీఐ జీఎం ప్రభాకరరావు

పొదిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పొగాకులో అన్యపదార్థాలు లేకుండా గ్రేడింగ్ చేస్తే మంచి ధరలు వస్తాయని జీపీఐ కంపెనీ జనరల్ మేనేజర్ ప్రభాకర్ అన్నారు. వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సింగరాయకొండ త్రెషింగ్ ప్లాంట్‌ను పలువురు రైతులతో కలిసి సందర్శించారు. బోర్డు పరిధి లోని కూచిపూడి, సన్నమూరు గురుగుబాడు, అగ్రహారం, కాటూరివారిపాలెం గ్రామాల రైతులను విజ్ఞానయాత్రకు తీసుకెళ్ళినట్లు చెప్పారు. రైతులు పండించిన పంటను వివిధ దశల్లో గ్రేడింగ్, అత్యాధునిక యంత్రాలతో ప్యాకింగ్ చేసే ప్రక్రియన రైతులకు చూపించా మన్నారు. పొగాకు పండించడంతో పాటు గ్రేడింగ్, మండె ఏర్పాటులో ప్రధానంగా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. రైతులు సొంతంగా నిర్ణయాలు తీసుకోకుండా అధికారుల సలహాలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ హెచ్‌వీ పునీత్, మదన్, హాఫీజ్, శ్యామల, క్రాఫ్ట్ డెవలప్ మెంట్ మేనేజర్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి ఆలయాల్లో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న మహాశి వరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు బాధ్యతతో పనిచేసి విజయవంతం చేయాలని టీడీపీ వైపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బా బు అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల నిర్వ హణ, ఏర్పాట్లపై రెండో సమీక్షను అమ్మవారి ఆలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, వీఐపీలు, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. విద్యుత్ నిరం తరం సరఫరా చేయాలన్నారు. తాగునీరు అవసరమైన మేర ఉండాలన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో అన్ని రకాల మందులను, 108, 104లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నెస్పీ కాలువ వద్ద స్నాన ఘట్టాలు, బారికేట్లు, దుస్తు లు మార్చుకునే గదులు ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేసు కునేందుకు డీఎఫ్‌వో ఒప్పుకున్నారన్నారు. ఈవో రజనీకుమారి మాట్లాడు తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, బారికేట్లు ఏర్పాటుచేసి దర్శనాలను కల్పిస్తామన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా 200 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తు న్నామన్నారు. ఎన్నెస్పీ కాలువ వంతెన దగ్గర, మిగిలిన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలె త్తకుండా చూస్తామని సీఐ అస్సాన్ తెలిపారు. అన్ని శాఖల అధికారులూ ఉత్సవాల విజయ వంతానికి కృషి చేయాలని తహసీల్దారు శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను ఎరిక్షన్‌బాబు, అధికారులు ఆవిష్క రించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమా ర్, విద్యుత్‌శాఖ ఏఈఈ సురేష్‌రెడ్డి, ఎంపీఐ మాదవరావు, టీడీపీ నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వభూపాలుడిగా మువ్వ గోపాలుడు

తర్లుపాడు, ఫిబ్రవరి 18 ఆంధ్రజ్యోతి: తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం గజవాహనంపై సర్వభూపాలుడి అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. కారంపూడి వెంకట రమణాచార్యులు, కూనపులి వెంకటశర్మ, మోహన్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను రథంపైకి తీసుకొచ్చి తర్లుపాడు పురవీధుల్లో మేళతాళాలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లుపోసి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదాతలు పార్లపల్లి వెంకటేశ్వరప్రసాద్, ధర్మపత్ని ఈశ్వరమ్మ, నీలకంఠేశ్వరరావు, ధర్మపత్ని హేమలత, సుధాకర్‌రావు, ధర్మపత్ని పద్మావతి, మురళీ, ధర్మపత్ని అరుణ, భూపాల్, ధర్మపత్ని పద్మావతిలు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్య క్రమంలో ఆలయ నిర్వాహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్ రావు, వివిధ వాహనసేవల ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల ఆడిట్ సమర్ధవంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న వెలుగు క్లస్టర్ సమన్వయకర్త సుధాకర్

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి). గ్రామాలలో స్వయం సహాయక సంఘాలకు నిర్వహించే ఆడిట్‌ను సీఆర్‌పీలు సమర్ధవంతంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ వెలుగు మార్కాపురం క్లస్టర్ కోఆర్డినేటర్ ఒంగోలు సుధాకర్ కోరారు. స్థానిక ఎస్సీ, బీసీ, కాలనీలోని డ్వాక్రా బజారులో మార్కాపురం క్లస్టర్ పరిధిలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల పరిధిలోని ఆడిట్ సీఆర్‌పీలకు మంగళవారం ఆదివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, గ్రామాలలోని ప్రతి స్వయం సహాయక సంఘానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సంఘాలలోని మహిళలు తీసుకున్న బ్యాంకు రుణాల చెల్లింపు వివరాలను సమగ్రంగా నమోదు చేయాలన్నారు. పొదుపు ఖాతాలలో జమ చేసుకున్న నగదు వివరాలను పూర్తిగా వారికి తెలియజేయాల న్నారు. ఆడిట్ సమయంలో సంయ మనం పాటించి మీ దృష్టికి వచ్చిన విషయాల ను సంబందిత అధికారు లకు తెలియజేయాలని తెలి పారు. మార్కాపురం మండల ఏపీఎం పిచ్చయ్య మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో లోటుపాట్లు ఏమైనా ఉంటే గుర్తించి సమాచారాన్ని తెలియజేయా లని కోరారు. ప్రతి సభ్యురాలు సంఘంలో జమ చేసిన జమ, చెల్లింపు వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎర్రగొండపాలెం క్లస్టర్ ఎల్‌సీ మూల వెంకటరెడ్డి, మార్కాపురం క్లస్టర్ ఎల్‌సీ నాగభూషణం, స్త్రీనిధి మేనేజర్ సులోచన, సీసీలు నాగయ్య, మనోకుమారి, అకౌంటెంట్ నాగమణి, నాలుగు మండలాల ఆడిట్ సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న ఎంఈవోలు

కొమరోలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు కలసి కృషిచేయాలని ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, బోర్రా వెంకటరత్నంలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళ వారం జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు అంగన్‌వాడీ నుంచి 10వ తరగతి వరకు వివిధ రకాల పాఠశాలలను విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలను మార్పుచేస్తోందన్నారు. మార్పుచేసిన పాఠశాలలకు అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ప్రభుత్వ పాఠశాలల పరిధిలోకి తీసుకురావాలన్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలను అదే పాఠశాలల్లో చేర్పించడంతో ఆ పాఠశాల బలోపేతం కానుందన్నారు. అటు అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి విద్యను అందించే వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంతకుమారి శిక్షకులు అనీల్‌కుమార్, అజ్మనీకుమార్, సురేంద్ర, శ్రీనివాసులు, సీఆర్పీలు కొమరోలు పుల్లయ్య, వీరాంజి, రామాంజనేయులు, వీరనారాయణలు పాల్గొన్నారు.

21న శునకరాగాలు పుస్తకావిష్కరణ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ర చించిన శునక రాగాలు పుస్తకావిష్కరణ ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు నూనె అంకమ్మరావు మంగళవారం తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ కళాపరిషత్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలలో ఈ పుస్తకాన్ని సాహిత్య పురప్రముఖుల చేతులమీదుగా ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం అరుణా సికిందర్ పుస్తకాన్ని స్వీకరిస్తారిస్తారని తెలిపారు. అదేవిదంగా గద్వాల సోమన్న రచించిన పిల్ల తెమ్మెరలు బాలగేయాల పు స్తకావిష్కణ సైతం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, సా హిత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

26 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

గిద్దలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరొందిన గిద్దలూరులోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ఈవో చిక్కుడు శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు అనీల్‌శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఉదయం సుప్రభాతసేవ, సాయంత్రం కల్యాణ మహోత్సవం, 27న రుద్రాభిషేకం, రుద్రహోమం, 28న లక్ష కుంకుమార్చన, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భాష్యంలో పట్టభద్రుల దినోత్సవం


పట్టాలు అందుకున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌ఎస్ నగర్‌లోని భాష్యం పాఠశాలలో విద్యార్థులకు పట్టభద్రుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవి 5 నుంచి 6వ తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, సంకల్పంతో భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, లిటిల్ ఛాంప్స్ ఇన్‌చార్జ్ హేమసుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

గిద్దలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5వ వార్డులోని రజక వీధిలో నీటిసమస్య పరిష్కారమైంది. ఈ ప్రాంతవాసులు నీటిసమస్య పరిష్కారం కోసం వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంతవాసులు నీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో అధికారులు రజక వీధిలో ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని విడుదల చేశారు. నీటిసమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి ఈ ప్రాంతవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


వెంకటస్వామి (ఫైల్)

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ పర్వినేని వెంకటస్వామి(51) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై ఆకస్మి కంగా మృతిచెందాడు. మృతుడు వెంకటస్వామికి భార్య లింగమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం చేశారు. మరొక కుమారుడు, కుమార్తె డిగ్రీ చదువుతున్నట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ పెద్ద దిక్కు వెంకటస్వామి ఆకాలమృతితో ఆ కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. టీడీపీ నాయకుడు వెంకటస్వామి మృతదేహానికి జడ్పీటీసీ మాజీ నియోజకవర్గ నాయకుడు కందుల రామిరెడ్డి, ఆయన తనయుడు కందుల రోహిత్‌రెడ్డిలు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ కాశీం డిమాండ్ చేశారు. స్థానిక పూల సుబ్బయ్యభవన్ లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల రాష్ట్ర ప్రథమ మహాసభలను పురస్కరించుకొని మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాశీం మాట్లాడుతూ.. మీటర్ రీడర్లకు విద్యుత్ సంస్థల్లోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. కనీస వేతనం అమలుచేస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ నెల 20వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పరాజు నారాయణ, గౌరవ అధ్యక్షుడు సతీష్ కుమార్, సభ్యులు షేక్ ఉమర్, సుబ్రహ్మణ్యం, సీపీఐ నాయకులు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మకు మొక్కులు తీర్చుకున్న భక్తులు


అంకాలమ్మకు బోనాలు తీసుకెళుతున్న భక్తులు

కంభం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణం తెలుగువీధిలో వెలసిన మాదాసు అండాలమ్మకు బోనాలు సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. గంగపుత్రులైన బేస్త సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి ప్రారంభమైన అంకాలమ్మ తిరునాళ్లు నేటితో ముగిశాయి. ఈ సందర్భంగా మంగళవారం తెలుగువీధి మహిళ భక్తులు అంకాలమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి


సీడీపీవోకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు సీఎం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ.., అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. సీఎం గతంలో అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని, బడ్జెట్‌లో అంగన్‌వాడీల వేతనాల పెంపుదలకు నిధులు ఇవ్వాలన్నారు.అనంతరం సీడీపీవోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు ప్రభావతి, ఆశాబీ, రమా, నారాయణమ్మ, చైతన్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

పామూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని కెనరాబ్యాంక్ సీనియర్ మేనేజర్ కెతిరుమలరావు అన్నారు. డిపాజిట్ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వాణిజ్య బ్యాంకులకంటే కెనెరా బ్యాంకులో డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి.వేణుగోపాల్, జి.విజయ, వి.వెంగమ్మ, నారాయణ ఎస్. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

కురిచేడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కురిచేడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు పెంచాలని, సమ్మె హామీలు అమలు చేయాలని కోరుతూ అంగన్ వాడీలు ఎస్సెస్సీ కాలనీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ సమస్యలపై తహసీల్దార్ రజనీకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఫాతిమా, విజయరాణి, రాజ్యలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

లలిత్‌సాగర్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు

కురిచేడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌ను మంగళవారం ఆపార్టీ కురిచేడు మండల నాయకులు, కార్యకర్తలు నరసరావుపేటలో కలసి సన్మానించారు. టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా లలిత్ సాగర్ అందుకున్నారు. లలిత్ సాగర్‌ను సన్మానించిన వారిలో మొఘల్ మస్తాన్ వలి, గడ్డం బాలయ్య, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, దాసరి ఏడుకొండలు, పెద్దిరాజు, కాశీ విశ్వనాధరావు, నరసింహారావు, బాదం సుబ్బారెడ్డి, గంధం గురునాధరావు, బస్సు రామయ్య, దాసరి రవి, ఏనుగంటి కోటిలింగం తదితరులు ఉన్నారు.

వైభవంగా భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ముండ్లమూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడక భక్తాంజనేయ స్వామి దేవాలయ 13 వార్షికోత్సవం వేడుకలు మంగళవారవ వైభవంగా జరిగాయి. ముందుగా విఘ్నేశ్వర పూజ అనంతరం స్వామి వారికి పంచామృత అభిషేకం, ఆకుపూజ, విశేష నామార్చన నిర్వహించారు. అద్దంకికి చెందిన స్వర్ణ సుబ్బారావు బృందం హనుమాన్ చాలీసాను గానం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు జె.హనుమంతరావు, జేబీ రామారావు, జె.హరగోపాల్ క్రిష్ణ, గొర్రెపాటి శంకర్, కాపా రమణారెడ్డి, మేకల చెంచిరెడ్డి, సుంకర కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల అపహరణ

పీసీపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గొర్రెల దొడ్డిలో ఉన్న రెండు పొట్టేళ్ల అపహరణకు గురైన ఘటన మండలంలోని మారెళ్ల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సిద్ధయ్య, సెంచయ్యలు గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే గ్రాసం కోసం సోమవారం కూడా గొర్రెలను కాపరులు పొలానికి తోలుకెళ్లారు. రాత్రికి ఇంటికి వచ్చిన తరువాత పాఠశాల సమీపంలో ఉన్న గొర్రెలదొడ్డిలో గొర్రెలతో పాటు పొట్టేళ్లను కూడా ఉంచారు. మంగళవారం ఉదయం గొర్రెలదొడ్డి వద్దకు వచ్చిన కాపరులకు పొట్టేళ్ల కనిపించలేదు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని గ్రామానికి చెందిన కొంతమంది చూసి ప్రశ్నించారు. తాము దారితప్పి వచ్చామని మురుగుమ్మికి వెళ్లాలని చెప్పగా దారి చూపించినట్లు తెలిపారు. అనుమానాస్పదంగా ఉన్న ఆ ఇద్దరు వ్యక్తులే పొట్టేళ్లను అపహరించుకుపోయి ఉంటారని గొర్రెల కాపరులు భావిస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన రబీ వరిపైరులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. దర్శి పట్టణంలోని ఐదో సచివాలయ పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపు చ్చుకోవాలన్నారు. రైతులందరూ విశిష్ట గుర్తింపు కార్డులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కందులను మద్దతు ధరకు విక్రయించుకోవాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కందిని సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు మంగళవారం తెలిపారు. రైతు సేవాకేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంటను అమ్ముకోవచ్చున్నారు. మండలంలో 1335 ఎకరాల్లో కందిపంట సాగు చేశారని తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవటంతో దిగుబడులు సక్రమంగా రావటం లేదన్నారు.

రూ.2 కోట్లతో భైరవకోన అభివృద్ధి

- మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు అన్నిఏర్పాట్లు
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తదితరులు

సీఎస్‌పురం(పామూరు) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భైరవకోనను రూ.రెండు కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనను మంగళవారం వివిధశాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఆలయ పరిసరాలను, జలప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్ల గురించి దేవస్థాన ఈవో వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా దైవదర్శన కోసం దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రాబోవు రోజుల్లో భైరవకోనలో పలు అభివృద్ధి పనులు చేపట్టి పర్యాటక ప్రాంతంగా గుర్తింపు తీసుకొస్తామన్నారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీగా వస్తారన్నారు. ఈసందర్భంగా జలపాతం వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల నడక ప్రాంతంలో రాళ్లగుట్టలను తొలగించాలన్నారు. రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలకు జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. మహిళా భక్తులకు ప్రత్యేక స్నాన, మరుగుదొడ్లు, బస్ పార్కింగ్, విద్యుత్ లైటింగ్ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. టెంకాయలు తెచ్చుకొనేందుకు ప్లాస్టిక్ కవర్లుకు బదులు క్లాత్ సంచులు తెచ్చుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. మంచినీటి వసతి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా ఉత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, డీఎల్‌డీవో పి.శ్రీనివాసరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు


అధ్వానస్థితికి చేరిన నూజెండ్లపల్లి - మారెళ్ళ ఆర్అండ్‌బీ రహదారి

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా నూజెండ్లపల్లి - మారెళ్ళ ఆర్అండ్‌బీ రహదారి దారుణంగా ఉంది. ఆరు కిలో మీటర్లు ఉండే ఈ మార్గం అడుగడుగునా గోతులమయమైంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారి మరమ్మతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. అద్దంకి నుంచి వయా తిమ్మాయపాలెం మీదుగా జమ్మలమడక, మక్కెనవారిపాలెం వెళ్ళాలంటే ఈ రహదారి ఎంతో కీలకమైంది. నిత్యం వేల సంఖ్యలో వాహన చోదకులు ప్రయాణం సాగిస్తుంటారు. అంతటి ప్రాముఖ్యం కలిగిన రహదారి గోతుల మయమైనా కనీసం మరమ్మత్తులు చేయాలన్న ఆలోచన కూడా సంబంధిత అధికారులకు రాలేదు. రాత్రుల సమయాల్లో కొత్త వ్యక్తులు ఈ రహదారిపై ప్రయాణిస్తూ మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. మరికొందరు క్షతగాత్రులయ్యారు.

అలాగే, ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే పంచాయతీ రాజ్ రహదారి కూడా ఇదే రీతిలో ఉంది. ఐదు సంవత్సరాల నుంచి ఎలాంటి మరమ్మత్తులకు నోచుకోలేదు. కంకర మొత్తం లేచిపోయి రాళ్ళన్నీ బయటపడటంతో వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. మండల కేంద్రానికి ఎగువ ప్రాంతమైన బొప్పూడివారిపాలెం, భీమవరం, పూరిమెట్ల, అగ్రహారం, తమ్మలూరు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రహదారిపై ప్రయాణం సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


తమ్మలూరు - ముండ్లమూరు రహదారి రోడ్డు దుస్థితి


డ్రోన్ కెమెరా పనితీరును పరిశీలిస్తున్న డీఎస్పీ యశ్వంత్

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

వెలిగండ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. త్వరితగతిని వీటిని పరిష్కరించాలని ఎస్ఐని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈసందర్భంగా దాతల సహాయంతో స్టేషన్‌కు అందజేసిన డ్రోన్ కెమెరా పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్‌రావు, ఏఎస్ఐ జిలానిబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదరలో గంజాయి పట్టివేత?

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్నట్టు మంగళవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారువెళ్లి గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొన్నారు. అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. గంజాయి విక్రయానికి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. ఈవిషయంపై పోలీసులను అడగ్గా తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని తెలిపారు.

'జ్ఞాన జ్యోతి'పై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

దొనకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలకు విద్యాశాఖ, సమగ్ర శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంపై మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఎంఈవో సాంబశివరావు, మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్లో బోధించటానికి రీసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆరు రోజులు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పక పాల్గొనాలన్నారు. జిల్లా కోఆర్డినేటర్ వెంకటనారాయణ, దర్శి సీడీపీ వో భారతి శిక్షణ కేంద్రాన్ని సందర్శించి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈ వో-2 షేక్ అమీర్, కోర్సు డైరెక్టర్ రామాంజనేయులు, డీఆర్‌పీలు శ్రీనివాసరెడ్డి, ఆర్.ఎనోష్, పీవీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, జి.సంజీవిలు మాట్లాడుతూ చిన్నారుల్లో మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధికి పునాది వేయాలన్నారు. 8 సంవత్సరాలలోపు వయస్సు గల చిన్నారుల్లో అన్నిరకాల అభివృద్ధి దశలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతులను ఆరు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సిఆర్పీలు శ్రీనివాసులు, నరసింహారావు, హెచ్ఎం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈవోలు జి.సుబ్బయ్య, సుధాకర్‌రావు తెలిపారు. స్థానిక వీకే ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన శిక్షణలో వారు పాల్గొన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు మరింత సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషగిరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, సీఆర్‌పీలు శ్రీమన్నారాయణ, చంద్రిక, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు


కురిచేడు: బోదనంపాడులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దర్శి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులందరూ విశిష్ట గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొట్లపాలెం, తూర్పువీరాయపాలెం రైతుసేవా కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా 11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డుల ను నమోదు చేసుకోవాలని తెలిపారు. గుర్తింపు కార్డులు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం పథకాలు అందుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో బాలకృష్ణా నాయక్, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని ప్రతి రైతు విశిష్ట సంఖ్య కోసం రిజిష్టర్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బోదనంపాడు సచివాలయంలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఖ్యతో రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం పథకాలు ఈ నంబరు ద్వారానే అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య తప్పనిసరి

పీసీపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులందరూ తప్పనిసరిగా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని ఏ డీఏ వెంకటరమణ అన్నారు. విశిష్ట సంఖ్య నమోదు ప రిశీలనలో భాగంగా మంగళవారం మురుగుమ్మి, పెద యిర్లపాడు, చింతగుంపల్లి, పీసీపల్లి గ్రామాల్లో నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్‌కార్డు తరహాలో రైతు లకు 11అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తుం దన్నారు. భూములు కలిగిన ప్రతిరైతు కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలు అందిస్తున్న పథకాలు పొందాలంటే తప్పనిసరి గా విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని కోరారు. స్థానిక రైతుసేవా కేంద్రాలకు వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా విశిష్ట సంఖ్యను నమోదు చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ నరికివేత

- అక్రమంగా రవాణాచేస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు


రవాణాకు సిద్ధంగా ఉన్న జామాయిల్ కర్ర

పామూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుచోట్ల అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన భూముల్లోని జామాయిల్ చెట్లను అక్రమార్కులు పట్టపగలే నరికి సొమ్ము చేసుకొంటున్నారు. మండలంలోని రేణిమడుగు, కంభాలదిన్నె, గుమ్మలంపాడు, చిలంకూరు, దూబగుంట, పడమటకట్టకిందపల్లి గ్రామాల్లో వేలాది ఎకరాల్లో అగ్రిగోల్డ్ సంస్థ జామాయిల్ తోటలు సాగు చేస్తుంది. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారాలు కోర్టు కేసుల్లో ఉండటంతో తోటల్లోని జామాయిల్ చెట్లు ఏపుగా పెరిగాయి. వీటిపై కన్నువేసి గుట్టుచప్పుడుగా చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. అడపదడపా పోలీసులు దాడులు నిర్వహించి పలువురుపై కేసులు నమోదు చేస్తున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

మండలంలోని పడమటకట్టందపల్లి రెవిన్యూ పరిధిలోని కందువారిపల్లి, పడమటకట్టకిందపల్లి గ్రామాల్లో అగ్రిగోల్డ్ సంస్థ 450 ఎకరాల్లో జామాయిల్ తోటలు సాగుచేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 150 ఎకరాలకు పైగా చెట్లను నరికి సొమ్ము చేసుకొన్నారు. ప్రస్తుతం కడప జిల్లాకు చెందిన వ్యక్తి మరపగుంట్లకు చెందిన వ్యక్తి ద్వారా బాపట్ల ప్రాంతం నుంచి కూలీలను తెచ్చి అక్రమంగా జామాయిల్ చెట్లను నరికి రవాణా చేస్తున్నారు. ఈక్రమంలో రైతులకు చెందిన భూముల్లోని కర్రను కూడా కొట్టివేయడంతో ఆందోళన చెందుతున్నారు. పది రోజుల క్రితం గ్రామస్థులు ప్రశ్నించడంతో కందువారిపల్లి గ్రామంలో బొడ్డురాళ్ల ఏర్పాటుకు రూ.ఆరు లక్షలు, కట్టకిందపల్లి గ్రామాభివృద్ధికి రూ.పది లక్షల వరకు అంజేసినట్టు సమాచారం. పట్టపగలే అక్రమార్కులు లారీల ద్వారా సరుకును చెక్‌పోస్టులు దాటిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి.


మాట్లాడుతున్న న్యాయాధికారి భరత్‌చంద్ర

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర అన్నారు. మంగళవారం పోలీసులు, న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 8న కనిగిరి కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, తదితర కేసులను ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. పోలీసులు, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం నిర్వహించటంతో పాటు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌తో విలువైన సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్న విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రశాంతమైన జీవితం గడిపేందుకు కేసులు అవరోధంగా మారతున్న విషయాన్ని వివరించాలన్నారు. సమావేశంలో సీఐ ఖాజావలి, ఎస్ఐలు మాధవరావు, వివిధ మండలాల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

దొనకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మరింత వేగంగా సేవలందించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపకరిస్తాయని ఎస్ఐ త్యాగరాజు అన్నారు. వీటి ఏర్పాటుకు స్వచ్ఛందంగా సహకరించాలని ఆయన కోరారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన త్యాగరాజును అభినందించేందుకు వచ్చే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రామాల్లో వాటి ఏర్పాటుపై బాధ్యతగా ముందుకు రావాలని కోరుతున్నారు. ఒక్క సీసీ కెమెరా పది మంది కానిస్టేబుల్స్‌తో సమానమన్నారు. 24 గంటలు, 365 రోజులు నిర్విరాయంగా పనిచేస్తాయన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు నివారించేందుకు, దొంగలను పట్టుకునేందుకు, గ్రామాల్లో ఏమైనా గొడవలు జరిగినప్పుడు ఎంతో ఉపయోగకరమన్నారు. సీసీ కెమెరాల వలన భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. దొనకొండ మండలంలో 100 నుంచి 120 వరకు సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. అందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

పామూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎం.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి మోపాడు రిజర్వాయర్‌ను చేర్చి రెండు టీఎంసీల నీటిని అందించాలన్నారు. ఈనెల 20న తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు ఎస్టీ మౌలాలి, రైతు సంఘం నాయకులు పి.రఘునాథరెడ్డి, కె.శంకర్, శివరామిరెడ్డి, పి.కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి


మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

పామూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం పామూరులో జరిగిన అక్షర విద్యాసంస్థల 15 వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన విద్యాబోధన కోసం కూటమి ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉన్నత చదువులకు ఇంటర్ విద్య మలుపులాంటిదని అన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటి వైస్‌చాన్సలర్ డీబీఆర్ మూర్తి మాట్లాడుతూ మార్కులే పరమావధిగా విద్య బోధన మంచిది కాదన్నారు. భవిష్యత్తుకు అనుగుణంగా విద్య బోధన సాగాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు, పెద్దిశెట్టి సునీల్, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సీఐ ఎం.భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు, అక్షర కళాశాలల కరస్పాండెంట్ కదిరి బాబురంగారావు, డైరెక్టర్ కదిరి సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

కురిచేడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర నాయుడు పాలెం పంచాయతీ వల్లెల యానాది కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వేముల వెంకటరవి కుమార్‌ను సస్పెండ్ చేశారు. పాఠశాలలో వంట కార్మికురాలిని ఈనెల 14న దుర్భాషలాడుతూ చెప్పుతో కొట్టడంతో ఇటీవల గ్రామస్థులు అతనికి దేహశుద్ధి చేశారు. బాధిత మహిళ కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈవిషయమై కేసు నమోదుచేసి ఉన్నతాధికారులకు నివేదించారు. మండల విద్యాశాఖాధికారులు సైతం నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి పంపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు మండల కేంద్రానికి పంపారు.

దాడికేసులో ఇద్దరి అరెస్ట్

పీసీపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురుగుమ్మిలో ఈనెల 13న జరిగిన దాడి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు. గ్రామానికి చెందిన లెక్కల వెంగళ్‌రెడ్డి, వల్లెం రాజశేఖర్‌రెడ్డిల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తుంది. ఈవివాదాన్ని మనసులో పెట్టుకున్న రాజశేఖర్‌రెడ్డి ఈనెల 13న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వెంగళ్‌రెడ్డి, శబరికంతారెడ్డిలపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు నిందితులుగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, రాజ్యలక్ష్మిలను మంగళవారం అరెస్ట్‌చేసి కనిగిరి కోర్టులో హాజరుపర్చారు. న్యాయాధికారి 14రోజుల రిమాండ్ విధించగా వారిరువురిని ఒంగోలు జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బైకుపై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర వద్ద మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రమణారెడ్డిపాలెంకు చెందిన గోపనబోయిన ఆదినారాయణ ద్విచక్ర వాహనంపై ఈదర వెళ్ళి స్వగ్రామానికి వస్తున్నారు. ఈక్రమంలో ఈదర సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు 108 సిబ్బందికి సమాచారం అం దించటంతో చికిత్స నిమిత్తం అద్దంకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

నిబంధనలు పాటించని క్వారీలను సీజ్ చేయాలి

కనిగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని గ్రానైట్ క్వారీలు, పాలిషింగ్ యూనిట్లను సీజ్ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు పీవీ శేషయ్య డిమాండ్ చేశారు. గ్రానైట్ క్వారీ యజమానులు తమ ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్డు పైకి తరలిస్తున్నందున కుచించుకుపోతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవోను కోరినట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న 11 గ్రానైట్ కంపెనీలకు నోటీసులు జారీ చేసి సమావేశం కూడా నిర్వహించినట్టు రోడ్డు వెంబడి వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని సమావేశంలో హెచ్చరికలు జారీ చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే ప్రజాపోరాటానికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.



ఎండీఎంఏ మత్తులో విద్యార్థులు



- బెంగళూరు నుంచి గుంటూరుకు సరఫరా
- 9 మంది ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్టు.. ఇద్దరు పరారీ
- 10.67 గ్రాముల ఎండీఎంఏ సహా, కేజీ గంజాయి స్వాధీనం

మత్తు మందు ప్యాకెట్లు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు

గుంటూరు, ఫిబ్రవరి 18: అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ మత్తు మందుకు విద్యార్థులు బానిసలవుతున్నారు. నిషేధిత మత్తు మందును గుంటూరు కేంద్రంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు నాలుగేళ్లుగా సరఫరా చేస్తున్నారు. గుంటూరులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ మత్తు మందును సరఫరా చేస్తున్న వారిని, దానికి బానిసలైన విద్యార్థులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన ఎం సాయికృష్ణ అనే విద్యార్థి గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతడి సోదరుడితో పాటు తెనాలి సమీపంలోని చినరావూరుకి చెందిన ధరావత్ సతీష్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో గతంలో సాయికృష్ణ అనేక సార్లు బెంగళూరు వెళ్లగా అక్కడ సతీష్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. సతీష్‌కుమార్ అప్పటికే బెంగళూరుకు చెందిన నితిన్ అనే వ్యక్తితో కలిసి ఎండీఎంఏ మత్తుమందును వినియోగిస్తున్నాడు. దీంతో సతీష్ కుమార్ ద్వారా సాయికృష్ణ కూడా ఆ మత్తుకు బానిసయ్యాడు. ఆ మందును గుంటూరులో విక్రయించి సొమ్ము చేసుకోవచ్చని నితిన్ సూచించాడు. దీంతో నితిన్ ద్వారా ఆ మందును నాలుగేళ్లుగా సాయికృష్ణ, సతీష్‌కుమార్ గుంటూరు తెచ్చి ఇంజనీరింగ్ విద్యార్థులకు విక్రయిస్తున్నారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల కోదండ రామానగర్‌లోని సాయిలక్ష్మీ అపార్ట్మెంట్లో ఉంటూ మత్తు మందును విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం రోడ్డులో ఎక్సైజ్ టూ టౌన్ సీఐ యశోదరాదేవి సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గుడి పక్కన ఖాళీ స్థలంలో ఇద్దరు వ్యక్తులు అధికారులను చూసి గాబరాపడుతుండగా అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. 2.52 గ్రాముల ఎండీఎంఏ మత్తు మందును వారి వద్ద గుర్తించారు. ఆ మందును అమ్ముకోవడానికి తాము వచ్చినట్లు విచారణలో ఎక్సైజ్ అధికారులకు వారు చెప్పారు. సాయికృష్ణ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఎక్సైజ్ అధికారులు అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేపట్టగా 8.15 గ్రాముల మత్తుమందుతోపాటు, కేజీ గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు లభించాయి. ఫ్లాట్‌లో సాయికృష్ణతో ఉన్న ఏడుగురు విద్యార్థులను కూడా గుర్తించారు. చెరుకుల కృష్ణారెడ్డి(జాకీర్‌హుస్సేన్ నగర్), రాచబత్తుని రాహుల్ (శివనాగరాజుకాలనీ), దొంత ప్రవీణ్ అలియాస్ మమ్మీ(ఆదర్శనగర్), అందే లోకేశ్(పట్టాభిపురం), కొప్పుల ప్రద్యుమ్న(రెడ్డిపాలెం), మొలబంటి సాయికృష్ణ(కాజ), ధరావత్ సతీష్‌కుమార్ (చిన్న రావూరు), మద్దిబోయిన దొరస్వామి రాజు(యడ్లపాడు మండలం కొత్త పాలెం), విష్ణుమొలకల చైతన్య (కారంపూడి మండలం లక్ష్మీపురం) అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉండగా 9 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సాయికృష్ణ బంధువు వేంపాటి చైతన్య, బెంగళూరుకు చెందిన నితిన్‌లను అరెస్టు చేయాల్సి ఉంది. ప్రమాదకరమైన మత్తుమందు కేసును ఛేదించిన టూ టౌన్ ఎక్సైజ్ సీఐ ఎం యశోదరా దేవిని డీసీ డాక్టర్ శ్రీనివాసులు అభినందించారు. గత నెలలో కొకైన్ కేసును కూడా సీఐ ఛేదించారన్నారు. ఎస్ఐలు సత్యనారాయణ, మాధవి, హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతరావు, సీహెచ్ రాజు, మైలా శ్రీనివాసరావు, రవిబాబు, బీఎస్ఎస్ రాజు, వీ నాగేశ్వరరావు, ఎం సూర్యనారాయణ, వీవీ చారి చిన్నబాబు తదితరులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి వీ అరుణకుమారి, ఏఈఎస్ ఈడే మారయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రాము రూ.5వేలకు విక్రయం..

బెంగళూరులో ఎండీఎంఏ మత్తుమందును గ్రాము రూ.1400 కొనుగోలు చేసి రూ4,000 నుంచి 5 వేలకు అమ్ముతున్నారు. గుంటూరు సమీపంలోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలోని కొందరు విద్యార్థులకు ఈ మందును సాయికృష్ణ అలవాటు చేశాడు. గోరంట్లలోని తన ఫ్లాట్‌కి విద్యార్థులను పిలిపించుకుని మత్తు మందును విద్యార్థులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాడు. నాలుగేళ్లుగా సాయికృష్ణ ఈ వ్యాపారం చేస్తున్నాడు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి తన స్వగ్రామానికి చెందిన సమీప బంధువు ద్వారా విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

అత్యంత ప్రమాదకరం

బ్రౌన్‌షుగర్, కొకైన్.. వంటి మత్తు మందులకంటే ఎండీఎంఏ అత్యంత ప్రమాదకరమైందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మత్తు మందుకు బానిసైన వారిలో నరాల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఆలోచనలు, విచక్షణ కోల్పోతారన్నారు. ఆకలి, నిద్ర ఉండదన్నారు. ఈ మందుకు బానిసైన వారు నగదు కోసం ఎంతటి అఘాయిత్యానికైనా పాల్పడతారన్నారు.



పల్లెలు.. పట్టణాల్లో శాశ్వతంగా తాగునీటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. వాటర్ గ్రిడ్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కసరత్తు చేపట్టింది. అయితే వాటర్‌గ్రిడ్ అనుసంధానం అన్ని పట్టణాలకు సాధ్యం కాదని కొన్నింటికే పరిమితం చేస్తూ అధికారులు తేల్చారు. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలు వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం సాధ్యం కాదని తేల్చేశారు. 2058 నాటికి 731.51 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల పరిధిలోని మున్సిపాల్టీల వారీగా నీటి అవసరాలకు సంబంధించిన నివేదికను ఆర్‌డబ్ల్యూ ఎస్ ఇంజనీర్లకు పబ్లిక్ హెల్త్ అధికారులు అందజేశారు. దీనిపై సాధ్యా సాధ్యాలను అధ్యయనం చేసిన సదరు ఇంజనీర్లు కొన్ని మున్సిపాల్టీలనే వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. గ్రిడ్ వ్యయ అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. త్వరలో సీఎం చంద్రబాబునాయుడు వాటర్ గ్రిడ్‌పై సమీక్షిస్తారని సదరు అధికారులు తెలిపారు.

వాటర్ గ్రిడ్.. కొన్ని పట్టణాలకే

కొన్ని మున్సిపాలిటీలకే అనుసంధానం

- 2058కి 731.51 ఎంఎల్‌డీ నీరు అవసరం
- ఆర్‌డబ్ల్యుఎస్‌కు నివేదిక అందజేసిన పబ్లిక్‌హెల్త్
- గుంటూరు సహా పల్నాడులోని పట్టణాలకు అసాధ్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చేందుకు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గ్రిడ్ పథకాన్ని తొలి విడత పల్నాడు జిల్లాలో అమలు చేసేందుకు రూ.1,200 కోట్లతో గతంలో టెండర్ ప్రక్రియను కూడా నిర్వహించారు. టెండర్ ఆమోదించి పనులు చేపట్టే తరుణంలో మున్సిపాల్టీలకు కూడా ఈ పథకాన్ని అనుసంధానం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం చేసే అంశంలో గత వారం రోజులుగా జరుగుతున్న కసరత్తు ఒక కొలిక్కి వచ్చింది. ఏమున్సిపాల్టీలకు సాధ్యం.. ఏఏ మున్సిపాల్టీలకు సాధ్యం కాదన్న అంశాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు తేల్చేశారు. ఇందుకు సంబంధించి అంచనా వ్యయం రూపొందిస్తున్నారు. అయితే గుంటూరు కార్పొరేషన్‌తో పాటు పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం సాధ్యం కాదని అధికారులు నిర్ధారించారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, దాచేపల్లి, మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల మున్సిపాల్టీలకు వాటర్‌గ్రిడ్ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు.

ఆ మున్సిపాలిటీల్లో.. అమృత్ 2.0

పల్నాడు జిల్లాలోని గ్రామాలకు వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు టెండర్ నిర్వహించారు. ఈ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్న తరుణంలో మున్సిపాలిటీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం అంశం తెరపైకి వచ్చింది. అయితే పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ సాధ్యం కాదని అధికారులు తేల్చారు. దీంతో ఆయా మున్సిపాల్టీల్లోని నీటి పథకాలను అమృత్ 2.0 కింద విస్తరించనున్నారు. గుంటూరు కార్పొరేషన్‌కు ఉన్న నీటి పథకాన్ని కూడా అమృత్ కింద విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పనులకు సంబంధించిన డీపీఆర్‌లను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే.

ప్రకాశం బ్యారేజి వద్ద ప్లాంట్

వాటర్‌గ్రిడ్‌తో అనుసంధానం చేసి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ప్రకాశం బ్యారేజి సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు జిల్లా పరిధిలోని మంగళగిరి - తాడేపల్లి, పొన్నూరు, తెనాలి మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం చేయవచ్చని అధికారులు నిర్ధారించారు. బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాల్టీలకు నీటిని సరఫరా చేయవచ్చని తేల్చారు. ప్రకాశం బ్యారేజ్ సమీపంలో ఏర్పాటు చేసే నీటి శుద్ధి ప్లాంట్ నుంచి గ్రామాలకు, మున్సి పాల్టీలకు తాగునీటిని సరఫరా చేసే దిశగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

మునిసిపాల్టీల వారీగా రానున్న 33 ఏళ్లలో నీటి అవసరాల అంచనా వివరాలు

మునిసిపాల్టీ	ప్రస్తుత నీటి సరఫరా ఎంఎల్‌డీ	2058 నాటికి నీటి అవసరం ఎంఎల్‌డీ
పల్నాడు జిల్లా..		
నరసరావుపేట	22	40.9
చిలకలూరిపేట	16	31.78
వినుకొండ	7	16.94
దాచేపల్లి	2.5	10.99
పిడుగురాళ్ల	9.78	19.63
గురజాల	2	8.74
మాచర్ల	6	17.69
సత్తెనపల్లి	9	17.59
గుంటూరు జిల్లా..		
గుంటూరు	157.2	296.74
మంగళగిరి.. తాడేపల్లి	22.5	98.28
తెనాలి	20	53.87
పొన్నూరు	7.45	18.8
బాపట్ల జిల్లా..		
చీరాల	10	28.07
బాపట్ల	10	24.57
రేపల్లె	4	15.24
అద్దంకి	2.74	13.68

బీ ఫార్మసీ పరీక్షలు ప్రారంభం

- కేంద్రాలలో సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు తనిఖీ
- మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచన

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బీఫార్మసీ 4/4 ఏడవ సెమిస్టర్ (రెగ్యులర్), 3/4 ఆరవ సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షలు పటిష్ట ఏర్పాట్ల మధ్య మంగళవారం నుంచి ప్రారంభ మయ్యాయి. విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు, ప్రకాశం జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏడవ సెమి స్టర్ రెగ్యులర్ పరీక్షలు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం పీ జీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల సమన్వ య కర్త ఆచార్య ఎం.సుబ్బారావు విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల పరీక్షా కేంద్రంలో జరుగుతున్న పరీక్షలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో 24 మంది విద్యార్థులకు ఇద్దరు ఇన్వి జిలేటర్లు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహిం చేందుకు గానూ పరిశీలకులను, తనిఖీకి స్క్వాడ్ బృందాలను నియమించామని ఆచార్య సుబ్బారావు తెలిపారు.



హాల్ టికెట్లను పరిశీలిస్తున్న పరీక్షల సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు

జీబీఎస్‌పై అవగాహన కల్పించాలి

కలుషిత ఆహారం, తాగునీటితోనే వ్యాధి వ్యాప్తి

గుంటూరు, ఒంగోలులో ప్రత్యేక చికిత్సా కేంద్రాలు

కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గులియన్ బ్యారి సింద్రోమ్(జీబీఎస్) వ్యాధి నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వ్యాధి వ్యాప్తిపై మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లావాసులు వ్యాధిబారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలుషితమైన తాగునీరు, ఆహార పదార్థాలు తీసుకోవడంతోనే వ్యాధి వస్తుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి సోకితే మూడురోజులపాటు తగ్గకుండా జ్వరం వస్తుందని, తీవ్రమైన నీరసం, డయేరియా, పక్షవాతం, నరాలు చచ్చుపడటం, కాళ్ల వేళ్ల నుంచి క్రమేపి స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందిస్తుందన్నారు. గుంటూరు జీజీహెచ్, ఒంగోలు రిమ్స్‌లో ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యకార్డుపై మంగళగిరిలో ఎయిమ్స్‌లో చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సరఫరా చేసే తాగునీటిని శుభ్ర పర్చాలని అధికారులను ఆదేశించారు. కాసి వడగట్టి చల్లార్చిన నీటిని తాగాలని ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెరువులలో తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్యాంక్‌లను పూర్తిగా ఎండబెట్టి క్లోరినేషన్ చేసి తర్వాత నీటిని నింపాలని సూచించారు. డీఎంహెచ్‌వో ఎస్.విజయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాలికల హక్కులను పరిరక్షించాలి

బాలికల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జె. వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. బాలికల హక్కుల పరిరక్షణకు జిల్లా స్థాయిలో కమిటీని నియమించనున్నట్లు ప్రకటించారు. మహిళల పని ప్రదేశాల్లో స్నేహపూర్వక వాతావరణం, సామాజిక భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, గ్రానైట్, టెక్స్‌టైల్స్, ఆక్వా పరిశ్రమలలో కమిటీ తనిఖీలు చూస్తూ 18 సంవత్సరాలలోపు బాలికలు ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. పద్నాలుగేళ్ల లోపు బాలికలు బడిలోనే ఉండాలని, వారు ఎట్టి పరిస్థితులలో పనిలో ఉండరాదన్నారు. బాలికల సంరక్షణకు పనిచేస్తున్న సార్డ్స్, బచ్పన్ బచావ్ వంటి స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాసరావు, కార్మిక శాఖాధికారి వెంకటశివప్రసాద్, మహిళా, శిశు సంక్షేమశాఖాధికారి ఉమా, కాలుష్య నియంత్రణమండలి అధికారి, సార్డ్స్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సృజని, బచ్పన్ బచావ్ మేనేజర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు.. ముఖహాజరు

బీసీ వసతి గృహాల్లో అమలుకు ఆదేశాలు

ఇక పక్కాగా లబ్ధి

- సాంకేతికతతో బోగస్ హాజరు నియంత్రణ
- హాస్టళ్లకు సంబంధించిన బిల్లులు యాప్‌కు అనుసంధానం

గంటూరు(విద్య), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేక పోయినా ఉన్నట్లుగా.. వారు భోజనం చేయకపోయినా చేసినట్లుగా.. ఇతర పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్లుగా.. ఇలా అనేక వసతిగృహాల్లో పెద్దసంఖ్యలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇక నుంచి ఇలాంటి అక్రమాలను అడ్డుకు నేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధమైంది. బోగస్ హాజరును నివారిస్తే అక్రమాలకు చెక్ పడినట్లేనని ఆ దిశగా ప్రభుత్వం చర్యలకు ఆదేశించింది. ఈ క్రమంలో తొలుత బీసీ సంక్షేమ వసతిగృహాల్లో బోగస్ హాజరు నివారణకు నూతన సాంకేతిక విధానం అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే అమలు చేసిన ముఖ హాజరు(ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్)ను ఇక నుంచి బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు అమలు చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి ప్రత్యేక యాప్ ద్వారా నూతన హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా దాదాపు 90శాతం పైగా సరైన హాజరు వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు(3 నుంచి 10వ తరగతి వరకు) 65పైగా, కళాశాల స్థాయి విద్యార్థులకు 36 వరకు హాస్టల్స్ ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 7 వేలమందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు.



ఫోన్‌లో యాప్ ద్వారా ముఖ హాజరు తీసుకుంటున్న సిబ్బంది

బీసీ వసతిగృహాల్లోని పేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే లబ్ధి పక్కాగా అందనున్నది. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా తీసిన ఫొటోను ఏపీనివాస్ యాప్‌లో నమోదు చేస్తారు. అందులో విద్యార్థి చదువు, ఎక్కడ నివాసం ఉంటున్నాడు.. తదితర వివరాలు నిక్షిప్తం అవుతాయి. ఈ విధానం ద్వారానే విద్యార్థుల మెస్ బిల్లులు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల ఎటువంటి అక్రమాలకు అస్కారం ఉండదని అధికారులు చెబుతున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని అన్ని బీసీ హాస్టళ్లలో ఈ నెల ఒకటి నుంచి ముఖ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నట్లు సంక్షేమశాఖాధికారి మయూరి తెలిపారు. మెస్ సహా ఇతర అన్ని బిల్లులు దీనికి అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలలోపు హాజరు పూర్తి చేసి వివరాలను వెల్ఫేర్ ఆఫీసర్లు యాప్‌లో అప్‌లోడు చేయాల్సి ఉంటుందన్నారు.

బయోమెట్రిక్‌లోనూ.. బోగస్ హాజరు

బీసీ వసతిగృహాల్లో గతంలో విద్యార్థులకు బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు తీసుకున్నారు. ఇందులో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. అనేక హాస్టళ్లలో బయోమెట్రిక్ యంత్రాల ద్వారా సైతం బోగస్ హాజరు నమోదు చేసినట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. గతంలో విజిలెన్స్ అధికారులు చేసిన దాడుల్లో బోగస్ హాజరు బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో ముఖ హాజరు విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈవిధానాన్ని ఎంపిక చేసిన వసతిగృహాల్లో అమలు చేశారు. అది విజయవంతం కావడంతో అన్ని వసతి గృహాల్లోనూ ఫిబ్రవరి 1 నుంచి అమలు చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

కొణిజేడులో భూముల రీసర్వే పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

టంగుటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల గురించి ఆరా తీశారు. వాటిని ఎలా పరిష్కరిస్తున్నారన్నది. తహసీల్దార్ ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మండలంలోని కొణిజేడుకు వెళ్లారు. అక్కడ భూముల రీసర్వే జరుగుతున్న ప్రాంతాన్ని, రికార్డులను పరిశీలించారు. కొంత మంది రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు.

నాలుగు టిప్పర్లు సీజ్

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): గ్రావెల్‌ను తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి రాజశేఖర్ మంగళవారం తెలిపారు. యరజర్ల నుంచి గ్రావెల్ తరలిస్తుండగా ఒంగోలు నుంచి పొందురు వెళ్లే రోడ్డులో గనుల శాఖ అధికారులు రాజీనాయుడు, సురేష్‌బాబు తనిఖీలు నిర్వహిచి సీజ్ చేసినట్లు చెప్పారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 19నుంచి 22వతేదీ వరకు టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు(డ్రాయింగ్, టైలరింగ్) పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు స్థానిక రామనగర్‌లోని మునిసిపల్ హైస్కూలు, ఏబీఎం జూనియర్ కళాశాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు కావాలన్నారు. హాల్‌టిక్కెట్లను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

ఇమామ్, మౌజన్లకు రూ.45 కోట్లు విడుదలపై హర్షం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇమామ్, మౌజన్లకు అందాల్సిన గౌరవవేతనాల నిధుల్లో ఆరు నెలలకుగాను రూ. 45 కోట్లు వక్ఫ్‌బోర్డుకు విడుదల చేయాలని టీడీపీ కూటమి ఉత్తర్వులు ఇవ్వడంపై టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పఠాన్ హనీఫ్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇమామ్, మౌజన్లకు శుభవార్త అని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పంగులూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు-తూర్పుకొప్పెరపాడు రోడ్డులో ఎం.సుభాష్ (25) ద్విచక్రవాహనం వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన సుభాష్ ద్విచక్రవాహనంపై వెళ్తూ కొప్పెరపాడు సమీపంలో రోడ్డు మార్జిన్‌లో మంగళవారం రాత్రి మృతిచెంది ఉన్నాడు. వాహనం స్కిడ్ అయి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

వీసీపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురుగుమ్మిలో ఈనెల 13న జరిగిన దాడి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు. గ్రామానికి చెందిన లెక్కల వెంగళ్‌రెడ్డి, వల్లెం రాజశేఖర్‌రెడ్డిల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తుంది. ఈవివాదాన్ని మనసులో పెట్టు కున్న రాజశేఖర్‌రెడ్డి ఈనెల 13న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వెంగళ్‌రెడ్డి, శబరికంఠారెడ్డిలపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు నిందితులుగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, రాజ్యలక్ష్మిలను మంగళవారం అరెస్ట్‌చేసి కనిగిరి కోర్టులో హాజరుపర్చారు.

వెలిగొండ ప్రాజెక్ట్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

పామూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎం.ప్రసాద్ అధ్యక్షత వహించారు.

చతికిలబడిన శనగల ధరలు

- ఈ ఏడాది ఎండుతెగులు
- దెబ్బకు పడిపోతున్న దిగుబడులు
- నేటికీ కోల్డ్ స్టోరేజీల్లో
- మూలుగుతున్న పాత నిల్వలు
- ఆందోళనలో సాగుదారులు

పర్చూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. తుఫాన్ ప్రభావం, అధిక వర్షాల కారణంగా రబీ సాగులో పైర్లు సకాలంలో వేయలేకపోయారు. కాస్త ఆలస్యంగా శనగను సాగు చేసి పైరును కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రైతులకు ఎండుతెగులు కుంగదీస్తోంది. దిగుబడి తగ్గడం, ధర దిగజారడంతో వారి ఆశలు అడియాశలుగా మారాయి. మూడేళ్ల నుంచి పండించిన శనగ నిల్వలు చాలా చోట్ల శీతల గిడ్డంగుల్లోనే మూలుగుతున్నాయి. మంచి ధర లభిస్తుందన్న ఆశతో నిల్వ చేసుకున్న రైతులకు పతనమవుతున్న ధర మరింత నైరాశ్యానికి గురిచేస్తోంది.

దిగజారిన జేజీ-11 రకం ధర

కొన్ని నెలల కిందట క్వింటా రూ.7200 ఉన్న జేజీ-11 రకం ధర ప్రస్తుతం రూ.5500కి పడిపోయింది. దీంతోపాటు కాక్-11, బోల్డ్‌ల ధర కూడా ఇదేవిధంగా నేల చూపుచూస్తున్నాయి. దీనికితోడు ఈ ఏడాది దిగుబడులు కూడా గణనీయంగా తగ్గాయి. చాలాచోట్ల ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఉన్న ధర, దిగుబడులను పరిగణనలోకి తీసుకుంటే కౌలు, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదని శగన రైతులు వాపోతున్నారు.



బోడవాడ సమీపంలో ఎండు తెగులుతో దెబ్బతిన్న శగన పైరు

సబ్ డివిజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో సాగు

పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో సుమారు 30వేల ఎకరాల్లో రైతులు శగన పైరును సాగుచేశారు. ఈ ఏడాది శనగకు ఎండు తెగులు వెంటాడడంతో పైర్లు గణనీయంగా దెబ్బతిన్నాయి. పూత దశకు చేరుకున్న తరుణంలో తెగుళ్లు సోకడంతో పైర్లు ఎండిపోయి దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు.

కోల్డ్ స్టోరేజీలకు చేరుతున్న శనగ

ప్రస్తుతం ధరలు దిగజారుతుండడంతో భవిష్యత్తులో మంచి ధర వస్తుందన్న ఆశతో రైతులు శనగ ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. మరోపక్క వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చుకునేందుకు గత్యంతరం లేని రైతులు వచ్చిన కాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.



కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న శనగలు

ప్రజలు లేకుండా ప్రజా వేదిక

- గుట్టుచప్పుడు కాకుండా నిర్వహణపై విమర్శలు
- హాజరుకాని ప్రజాప్రతినిధులు
- అవకతవకలను బయటపెట్టిన ఆడిట్ బృందాలు
- బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో
- పెద్ద ఎత్తున అవినీతి

బల్లికురవ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహాత్మ గాంధీ జాతీయ ఉపాధీ హామీ పథకం ద్వారా 2023-24 సంవత్సరాలలో జరిగిన పనులకు సంబంధించి మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ప్రజలు, ప్రజాప్రతినిధులు లేకుండానే సామాజిక తనిఖీ జరిగింది. ముందుగా ప్రజలకు తెలియజేకుండా, గతంలో జరిగిన అవకతవకలు బయటపడకుండా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ప్రజావేదిక సభను ఏర్పాటు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి పథక సిబ్బంది మాత్రమే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సభకు బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్టు డెరెక్టర్ విజయలక్ష్మి హాజరయ్యారు. కుర్చీలు ఖాళీగా ఉండడం చూసి ఆమె సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం 2023-24లో రూ.13కోట్లతో జరిగిన 1051 పనులకు సంబంధించి, మెటీరియల్ పనులకు సంబంధించి గత నెల 31 వరకు ఆడిట్ బృందాలు జరిపిన తనిఖీ వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ ఏడాది రూ.15కోట్ల పనులు లక్ష్యంగా గ్రామాలలో కూలీలకు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ చిరంజీవి, ఎంపీడీవో కుసుమకుమారి, ఏపీడీ కోటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు కూలీలు తాము పనికి వెళ్లామని కానీ కూలి చెల్లించలేదని ఫిర్యాదు చేశారు. సామాజిక తనిఖీలో జరిగిన లోపాలపై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో నివేదిక రానుంది.



ప్రజలు, ప్రజాప్రతినిధులు లేకుండానే సిబ్బందితో నిర్వహించిన ప్రజా వేదిక

బయటపడిన అక్రమాలు

- ముక్తేశ్వరం, పలు గ్రామాలలో సంతకాలు లేకుండానే కూలీలకు చెల్లింపులు జరిగాయి.
- 30 నేమ్ బోర్డులు పెట్టకుండానే నగదు డ్రా చేశారు.
- కొత్తూరు గ్రామంలో మస్టర్లపై సంతకాలు లేకుండా వేలిముద్రలు మాత్రమే వేసి ఉన్నాయి. అదే గ్రామంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగికి 52 రోజులు పని చేసినట్లు రికార్డులో చూపించి, నగదు స్వాహా చేశారు.
- పొరుగు మండలంలో పనిచేసే సచివాలయ ఉద్యోగికి, ఆయన భార్య వలంటీర్‌కు బోగస్ మస్టర్లు వేశారు.
- మల్లాయపాలెంలో ప్రభుత్వ భవనాలను నిర్మించకుండానే నిధులు డ్రా చేశారు.
- కె.రాజుపాలెంలో ఎంబుక్ రికార్డు లేకుండానే పేమెంట్లు చేశారు.
- కొప్పెరపాడు గ్రామంలో పలువురు వలంటీర్లకు మస్టర్లు వేశారు. హార్టికల్చర్‌లో సాగు చేసిన మొక్కలు లేకుండానే నిధులు పక్కదారి పట్టాయి.
- వల్లాపల్లిలో మునగ, జామ మొక్కలు నాటినట్లు డబ్బులు డ్రా చేయగా, ప్రస్తుతం ఒక్క మొక్క కూడా కనిపించడం లేదు.
- అలాగే ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన పంట కాలువను పూడ్చి వేయడంతో నిధులు వృధా అయ్యాయి.
- పలు గ్రామాలలో హార్టికల్చర్ ద్వారా సాగు చేసిన పండ్ల మొక్కలు లేవు.



అవకతవకల గురించి ప్రజావేదికలో వివరిస్తున్న ఆడిట్ బృందం

జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవు..అపోహ మాత్రమే !

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవని, కేవలం అపోహ మాత్రమేనని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి పేర్కొన్నారు. మంగళవారం సంతనూతలపాడు పశువైద్యశాలలో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాలకు చెందిన పశుసంవర్ధకశాఖ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పక్క జిల్లాల నుంచి పశువుల దాణా, కోడి గుడ్లు, కోళ్లను ఇక్కడకు రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కోడి గుడ్డు, కోడి మాంసంలో పోషకాహార విలువలు కలవని, ప్రజలు ఎటువంటి సందేహం లేకుండా తీసుకోవచ్చన్నారు. జిల్లాలో 2,36,500 బాయిలర్ కోళ్లు, అదేవిధంగా రైతుల వద్ద 8,33,434 పెరటికోళ్లు, 1,64,500 గుడ్లుపెట్టే కోళ్లు ఉన్నట్లు ఆమె తెలిపారు. వీటి ద్వారా జిల్లాలో సంవత్సరానికి 3,20,77,800 కోడుగుడ్లు ఉత్పత్తి అవుతున్నట్లు చెప్పారు. అందువల్ల బర్డ్‌ఫ్లూ లేదని, అపోహ మాత్రమే అనే విషయాన్ని గ్రామాల్లోని ప్రజలకు తెలిపాలని కోరారు. పశువైద్యుడు ప్రతాప్ ఎరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కె.సుధీర్‌బాబు, టి.మనురూప్, వై.పేరయ్య, పి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కోడి, కోడుగుడ్లను చూపుతున్న పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి, సిబ్బంది

నర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏడుగుండ్లపాడులో మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ సూచనల మేరకు 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సులను నియమించాలని కోరారు. కాంట్రాక్టుపై పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయడంతో పాటు ఉద్యోగోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోపిదేవి ఉదయలక్ష్మి, కార్యదర్శి కొత్తపల్లి మంజేష్, కార్యవర్గ సభ్యులు జానీబాషా, మహేష్, మహబూబ్, బీవీ.రామలక్ష్మి, నాగరాజకుమారి, రమణనాయక్, సుమన్, చినకనయ్య, స్మిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ నేతలు

పురుషు ఆరోగ్యకార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలి

మద్దిపాడు, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో గత 22సంవత్సరాల నుంచి పని చేస్తున్న తమను ఉద్యోగాల నుంచి తొలగించారని, దీంతో తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నాయని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పురుష ఆరోగ్యకార్యకర్తలు మంత్రి మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కోరారు. మంగళవారం మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో మంత్రిని కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పురుష ఆరోగ్యకార్యకర్తలు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సేవలు అందించిన తమ వయస్సు 50సంవత్సరాలు దాటిపోయిందని, ఇప్పుడు వేరే పనులు చేయలేకపోతున్నాయని వాపోయారు. తక్షణమే కాంట్రాక్ట్ ఉద్యోగులుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులతో పురుష ఆరోగ్య కార్యకర్తలు నలుగురు మృతి చెందారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు టి.రమణారెడ్డి, ఎస్ఎంఎం.సుభాని, ప్రభాకర్‌రావు, ప్రసాద్, అంజిరెడ్డి, మహేష్, బాబురావు, సుల్తాన్ శ్రీనివాసరావు, కరిముల్లా పాల్గొన్నారు.

నాటుసారాపై సమరభేరి

- నవోదయం 2.0 ప్రారంభం
- నేడు పోలీస్ పేరేడ్ మైదానంలో ప్రారంభించనున్న ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మానవ జీవితాలను కబళిస్తున్న నాటుసారా మహ్మారిని సమూలంగా రూపుమాపేందుకు నవోదయం మలివిడత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రారంభించనుంది. నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఒంగోలులోని పోలీస్ పేరేడ్ మైదానంలో ఎక్సైజ్‌శాఖ శాఖ కొల్లు రవీంద్ర చేతులు మీదగా ప్రారంభం చేయనున్నారు. నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలను, మానవాళి శరీరాలలో వచ్చే దుష్ప్రభావాలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాజాతాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా నాటుసారా కాసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించి వారి జీవన ప్రమాణాలు పెంచేదుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోనుంది. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న నాటుసారా తాగడం వల్ల కలిగే నష్టాలను వివరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. 2014-19 మధ్యకాలంలో నవోదయం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వల్ల వచ్చిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని మరో విడత ఈ కార్యక్రమాన్ని మలివిడతగా ప్రారంభించనున్నారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు స్థానిక పోలీస్ పేరేడ్ మైదానంలో మంత్రి కొల్లు రవీంద్ర చేతులు మీదగా నవోదయం 2.0 కార్యక్రమం ప్రారంభించనున్నారు.

ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాతో పాటు పలువురు అధికారులు హాజరవుతారని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి ఎస్‌కే.ఖాజామోహిద్దిన్ తెలిపారు. అదేవిధంగా కళాజాత బృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, నగరంలో అవగాహన ర్యాలీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అవీఇవీ

రైలు ప్రమాదంలో యువకుడు మృతి



పృథ్వీరాజ్ (ఫైల్)

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వరుస రైలు ప్రమాద మరణాలతో ప్రజలు భీతుల్లుతున్నారు. ఇప్పటికే చీరాల ఏరియా వైద్యశాలలో మూడు గుర్తు తెలియని మృతదేహాల ఆధారాలు సేకరించే పనిలో ఉండగా, మంగళవారం మరో వ్యక్తి మరణించాడు. వేటపాలెం మండలం దేశాయిపేటకు చెందిన పావులూరి పృథ్వీరాజు(27) ఓ షోరూమ్‌లో సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య అనూష, మూడు నెలల బాబు ఉన్నారు. ఇతను ఉదయం దేశాయిపేట రైల్వే స్టేషన్ సమీపంలో చూడకుండా పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈక్రమంలో కన్నీటిపర్యంతమైన భార్యను చూసిన అందరి కళ్లు చెమర్చాయి.

ఫోన్ పేతో నగదు మాయం?

చీరాలటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ పేలో అల్పాహారం దుకాణ నిర్వాహకుడు నగదు మాయమైన ఘటన మంగళవారం చీరాల వైకుంఠపురంలో చోటుచేసుకుంది. దుకాణ యజమాని మండగిరి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇతను స్థానికంగా టిఫిన్ హోటల్ నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని మహిళ టిఫిన్ చేసి రూ.36 నగదు ఫోన్ పే చేసింది. అయితే కొద్దిసేపటికే అతని అకౌంట్‌లో రూ.450 కట్ అయ్యాయి. అంతేకాకుండా ఫోన్ పే వాట్సాప్ గ్రూప్‌లో జాయిన్ అవ్వండి అంటూ టెక్స్ మెసేజ్ చేరింది. దీంతో అవాక్కయిన బాధితుడు వెంటనే బ్యాంకు ప్రతినిధులను కలిసి అకౌంట్ బ్లాక్ చేయించారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఇదే తరహా ఘటన ఇటీవల జాండ్రపేటలో కూడా జరిగినట్లు సమాచారం.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు



ప్రతిభావంతులను అభినందిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న పవర్ లిఫ్టింగ్ (స్త్రీ, పురుషులు), బాడీ బిల్డింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. కాకినాడ జేఎన్‌టీయూ వారి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ కాలేజీ సెలక్షన్స్‌ను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పర్యవేక్షించారు. ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, శ్యామ్ కుమార్, డైరక్టర్ డాక్టరు సుబ్బారావు, రమణమూర్తి పాల్గొన్నారు.

24న రాష్ట్ర స్థాయి జూనియర్ ఎడ్ల పోటీలు

చినగంజాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసి ఉన్న లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు రాష్ట్ర స్థాయి జూనియర్ ఎడ్ల నాటు బండి పోలురాదా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. సోపిరాల గ్రామస్థుల సహకారంతో టైరుబండ్ల అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తుట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.30,116, రెండో బహుమతిగా రూ.25,116, మూడో బహుమతిగా రూ.20,116, నాలుగో బహుమతిగా రూ.15,116, ఐదో బహుమతిగా రూ.10,116, ఆరో బహుమతిగా రూ.7,116, ఏడో బహుమతిగా రూ.6,116, ఎనిమిదో బహుమతిగా రూ.5,116, తొమ్మిదో బహుమతిగా రూ.3,116 అందజేయనున్నట్లు తెలిపారు. బండి తోలే వారు ఆరుగురు మాత్రమే ఉండాలని, బరువు 150 కేజీలు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9133377719, 9704551084, 9063646319 సెల్ నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

తమ్మవరంలో పొట్టేళ్ల పందెలు

మేదరమెట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మవరంలో పొట్టేళ్ల పందేలు మంగళవారం జరిగాయి. తమ్మవరంలోని పొట్టేళ్ల పెంపకందారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన కొంతమంది గతంలో మార్టూరు, తదితర ప్రాంతాలకు పోటీలకు వెళ్లేవారని, అదే క్రమంలో తమ్మవరంలో తొలిసారి ఈ పోటీలు నిర్వహించారు. పలు గ్రామాల వారు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ఆలయాల పరిసరాలను పరిశీలించిన సీఐ



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ రమణయ్య

చినగంజాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని కొత్తపాలెంలోని బాలకోటేశ్వరస్వామి, సోపిరాల గ్రామంలోని రామకోటేశ్వరస్వామి ఆలయాల పరిసరాలను ఇంకొల్లు సీఐ రమణయ్య మంగళవారం పరిశీలించారు. రెండు దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులతో ఆయన చర్చించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ భక్తిభావంతో తిరునాళ్లను జరుపుకుంటూ, అశ్లీల నృత్యాలకు తావు లేకుండా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లను జరుపుకోవాలని అన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. స్వామివార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శీలం రమేష్, దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వేని వేగవంతం చేయాలి

చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఆదిపూడి(పర్చూరు), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కారంచేడు మండల పరిధిలోని ఆదిపూడి గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమం మందకుడిగా జరుగుతుందని ప్రత్యేక చొరవతో వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సర్వేయర్ మసలయ్య, తహసీల్దార్ జి.నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ అనిత, సర్వేయర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



రీసర్వేని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

తగ్గిన ధాన్యం దిగుబడులు

నష్టాల్లో అన్నదాతలు

చినగంజాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం దిగుబడి తగ్గడంతో అన్నదాతలు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. సన్నధాన్యం పండించి మంచి లాభాలు ఆర్జించవచ్చునని ఆశించిన రైతుల ఆశలు అవిరి అయ్యాయి. గత ఏడాది నష్టాలు చవిచూసిన రైతులు ఈ ఏడాది అయినా లాభాలు రాకపోతాయా అన్న ధైర్యంతో వరిసాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చేసరికి దిగుబడులు అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు దిగాలుపడ్డారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు పరిధిలో గొనసపూడి, కడవకుదురు తదితర గ్రామాలకు చెందిన రైతులు కేఎస్ఎం 1638, 1262, 2782, 1156 రకాల వరి వంగడాలను సాగు చేశారు. సన్నరకం సాగు చేసిన ఎకరం విస్తర్ణంలో సరాసరిన 25-35 బస్తాలు పండడంతో రైతులు ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. కేఎస్ఎం 1638, 2782 సన్నరకం ధ్యాన్యం 75 కిలోల బస్తా రూ.1500లు, 1262, 1156 రకం ధాన్యం 75కిలోల బస్తా రూ.1400లకు ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసి, తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు పంపుతున్నారు. 25 బస్తాలకు రూ.37,500 మాత్రమే వస్తుంది. ఎకరానికి కౌలు, పురుగుమందులు, ఎరువులు, దుక్కి, నాటు, కోత తదితర ఖర్చులకు రూ.35వేల వరకు ఖర్చువుతుందని, వచ్చిన దిగుబడులలో ఖర్చులు పోతే గడ్డిమాత్రమే మిగులుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం 17 శాతం ఉన్న 75కిలోల సన్నరకం బస్తాకు రూ.1730 ఇస్తున్నటికీ ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేయడం వలన రైతులకు మరింత నష్టం వాటిల్లుతుంది. రైతులకు అవగాహన లేకపోవడంతో దళారుల మాయాజాలంతో రైతులు మోనపోతున్నారు. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరిగినప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర లేక లేకపోవడం, పంట దిగుబడులు తగ్గడం రైతుల పాలిట శాపంగా మారింది. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి ఉంటే రైతులు వ్యవసాయం చేసే పరిస్థితి ఉందని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వర్షభావ పరిస్థితులు, సరిగా సాగునీరు రాకపోవడం వలన వేసిన పంటలు సక్రమంగా పండలేదు. ఈ సంవత్సరం వర్షాలు పడి సాగునీరు సమృద్ధిగా ఉండడంతో దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడం విచారకరం. గత ప్రభుత్వం రైతుల గురించి పట్టించకోక పోవడం, సాగునీరు సక్రమంగా అందించకపోవడంతో పంటలు అంతంత మాత్రమే పండినాయి. కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం పాటుపడటం, సాగునీరు, విత్తనాలు సకాలంలో అందించినప్పటికీ పంట తక్కువగా ఉండడం నష్టాలు కలిగించింది.



ధాన్యాన్ని లోడు చేస్తున్న కూలీలు

పైరు బాగుంది, దిగుబడి తగ్గింది



వరి నాటినప్పటి నుంచి పైరు బాగా ఉందని, వరి పైరుకు కావలసిన మందులు, అన్ని ఎరువులు సకాలంలో వేశామని, చూడడానికి పంట బాగానే ఉందని, దిగుబడి చూస్తే అధ్వానంగా ఉందని అన్నారు.

- ఏకాంబరం ప్రభు, రైతు, కడవకుదురు

ఖరీఫ్‌లో ఈ క్రాప్ చేయాలి



కడవకుదురు, గొనసపూడి ప్రాంతాల్లో వేసిన వరి పైరును ఖరీఫ్‌లో ఈక్రాప్ చేయాలని అన్నారు. రబీలో ఈ క్రాప్ చేయడం వలన వేసిన పంటలు ముందుగా రావడం వలన ప్రభుత్వం ప్రకటించిన దరకు అమ్ముకోలేకపోతున్నామని అన్నారు.

- నక్కల శ్రీనివాసరావు, రైతు, కడవకుదురు



పాత నేరస్థుల ఇళ్ల వద్ద తనిఖీలు చేస్తున్న డీఎస్పీ మొయిన్

గంజాయి అమ్మితే కఠిన చర్యలు

చీరాల డీఎస్పీ మొయిన్

ఇంకొల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా గంజాయి అమ్మినా, కొన్నా, మొక్కలను పెంచినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ హెచ్చరించారు. మంగళవారం ఇంకొల్లులో బండకాలనీ, ఎస్ఎస్ఎల్ నూలు మిల్లు సమీపంలో ఆయన సందర్శించారు. గతంలో గంజాయి కేసులో ముద్దాయిల ఇళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకంపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. అనంతరం ఇంకొల్లు పోలీసుస్టేషన్‌లో ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. కేసుల పురోగతికి సంబంధించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గంజాయి నియంత్రణపై నిఘా ఉంచాలన్నారు. నేర నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.రాత్రి వేళల్లో గస్తీ పెంచి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ జి.సురేష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ముమ్మర తనిఖీలు

చీరాలటౌన్ : పాత గంజాయి కేసుల్లోని నేరస్థుల విధివిధానాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలో ఇటీవల చీరాల పరిధిలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నారు. చీరాల రూరల్ సీఐ పంతగాని శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని పాత నేరస్థులు ఇళ్లల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈనేపథ్యంలో పరిసరాలను అణువణువు క్షుణ్ణంగా పరిశీలించి కౌన్సెలింగ్ చేశారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, కొనుగోలు జోలికి వెళ్లరాదని హెచ్చరించారు. ఎవరైనా అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై అంబటి చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

అద్దంకి : అద్దంకి పట్టణంలోని అనుమానిత ప్రాంతాలలో మంగళవారం పోలీస్‌లు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రధానంగా గంజాయి వినియోగం గురించి ఎస్సైలు ఖాదర్‌బాషా, రవితేజ ఆధ్వర్యంలో రేణింగవరం రోడ్డు, దర్శిరోడ్డు, శింగరకొండ రోడ్డు లతో పాటు పలు శివారు ప్రాంతాలలో తాత్కాలిక గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్న కుటుంబాలతో పాటు మొండితోకపాలెం తదితర ప్రాంతాలలో తనిఖీలు చేశారు.



రేణింగవరం రోడ్డులో సంచార కుటుంబాల నివాసాల్లో తనిఖీలు చేస్తున్న ఎస్సైలు ఖాదర్‌బాషా, రవితేజ

చీరాల డిప్యూటీ ఈవోగా అద్దంకి ఎంఈవో

అద్దంకి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల డిప్యూటీ ఈవోగా అద్దంకి ఎంఈవో-1 గంగాధరరావును నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయ్‌రామరాజు ఉత్తర్వులు ఇచ్చారు. అద్దంకి ఎంఈవో-1గా పనిచేస్తున్న గంగాధరరావుకు పూర్తి అదనపు బాధ్యతతో చీరాల ఇన్‌చార్జి డిప్యూటీ ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. అటు చీరాల ఇన్‌చార్జి డిప్యూటీ ఈవోగా, ఇటు అద్దంకి ఎంఈవో 1గా రెండు విధులను గంగాధరరావు నిర్వహించనున్నారు.



గంగాధరరావు

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- నిబంధనలు ఉల్లంఘించి, ఉపాధి ద్వారా వేసిన సీసీ రోడ్ల నిధులు డ్రా చేసిన వైనం
- ఇప్పటికే చినకొత్తపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

అద్దంకి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించి సీసీ రోడ్లకు సంబంధించిన ఉపాధి హామీ నిధులు డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.50లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణం చేశారు. ఈ పనులకు సంబంధించి టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ 30శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.15,74,283 విలువైన సామగ్రిని సరఫరా చేశారు. అందుకు సంబంధించి 2021 సెప్టెంబరు 3న రూ.15,74,283 ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. ఈ నిధులను టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు చెల్లించాల్సి ఉండగా అప్పటి పంచాయతీ కార్యదర్శి (ప్రస్తుతం సంతమాగులూరు మండలం పాతమాగులూరు పంచాయతీ కార్యదర్శి) ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుజ్జుల మల్లిక నేరుగా డ్రా చేసి సర్పంచ్ సోదరుడు చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించారని మురళీమోహన్‌దాస్ అప్పట్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మురళీమోహన్‌దాసు మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చీరాల డీఎల్‌పీవో శివనారాయణ డిసెంబరు 18వ తేదీన విచారణ చేపట్టి సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి బ్యాంక్ నుంచి నేరుగా డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక అందజేశారు. 3 నెలల పాటు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు వారం కిందట ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి చినకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి (ప్రస్తుత సంతమాగులూరు మండలం పాతమాగులూరు కార్యదర్శి) ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.



ఈశ్వరరెడ్డి పంచాయతీ కార్యదర్శి

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలు శిక్షణ కాలంలో ఆయాలకు సరైన సూచనలు ఇచ్చి కేంద్రాలు సజావుగా సాగేలా చూడాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య అన్నారు. మంగళవారం మంగళవారం కాకానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీవో సింగయ్య సందర్శించి మెనూ ప్రకారం తప్పని సరిగా అందించాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు అంగన్‌వాడీ కేంద్రాలను తప్పని సరిగా నిర్వహించాలన్నారు. ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లలో పిల్లలు అందరికీ ఆధార్ కార్డు పొందే విధంగా తల్లులను చైతన్య పరచాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రాలు లేని వారి వివరాలను మున్సిపల్ కార్యాలయంలో అందించి జనన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి చేయాలన్నారు. ఆర్పీలు కృష్ణారావు, రమణారెడ్డి, ధనలక్ష్మి, ఇందిరమ్మ, రమాదేవి ప్రీ టెస్ట్ గురించి, అంగన్‌వాడీ కార్యకర్తల రిజిస్టేషన్‌లపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాలను ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు సందర్శించి పలు సూచనలు చేశారు.

యద్దనపూడి, (మార్టూరు) : జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు 6రోజుల శిక్షణ తరగతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కోర్సు డైరెక్టర్ ఎంఈవో పుల్లెల సుబ్రమణ్యం మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను అభివృద్ధి చేసే ఉద్దేశంతో అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ లు వంశీకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

బల్లికురవ : అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తుందని ఎంఈవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బల్లికురవ, కొప్పెరపాడు ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో ప్రారంభించారు. ఈ సంటదర్భంగా అయన మాట్లాడుతూ బోధన ఎలాచేయాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అన్న విషయాలను తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు సురేష్, రామకృష్ణ, సూపర్ వైజర్లు సలోమి, విజయనిర్మల పాల్గొన్నారు.

పర్చూరు : చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో సుభద్ర అన్నారు. మంగళవారం మండల పరిషత్ పాఠశాలలో కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు ప్రారంభించారు. కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు, చిన్నారుల్లో ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని సుభద్ర అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కోర్సు డైరెక్టర్లు పాల్గొన్నారు.

జీబీఎస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గులియన్ బారీ సిండ్రోమ్ వైరస్ రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. కలుషిత ఆహారం, అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల జీబీఎస్ వచ్చే అవకాశం ఉందన్నారు. చేతులు, కాళ్లు నిస్సత్తువ, తిమ్మెర్లు వస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన, ఉడికిన ఆహారాన్ని తినాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.



ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో అన్ని వ్యవసాయ పథకాలు విశిష్ట సంఖ్యతో ముడి పడి ఉందని, ప్రతి రైతు తప్పని సరిగా దానిని పొందాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తొంది కార్యక్రమంలో భాగంగా ఏవో మాట్లాడారు. రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌తో లింక్ చేసిన ఫోన్‌తో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. కొందరు రైతులు వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నారని, ఇప్పుడు సాగు చేయవద్దని, దిగుబడులు తగ్గిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు రోజీ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట : వ్యవసాయ రంగాన్ని అధునికీకరణ చేయడానికి గుర్తుంపు కార్డులు అందిస్తున్నట్లు ఏడీఏ ధనరాజ్ తెలిపారు. మంగళవారం రావినూతల, ప్రాసంగులపాడు గ్రామాల్లో రైతులకు యూనిక్ ఐడీ ఆవశ్యకతను వివరించారు. మార్చిలో కంది, శనగ తదితర అపరాలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సహాయకులు మౌనిక, రాణి, సుకన్య, మహేష్ పాల్గొన్నారు.

యద్దనపూడి (మార్టూరు) : పీఎం కిసాన్ పథకంతోపాటు ప్రభుత్వ పథకాలు రైతులందరికీ చేరాలనే లక్ష్యంతో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామని ఏవో మేరీ మరియమ్మ అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని చిమటావారి పాలెం, వింజనంపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుదర్శన్, లీలాసత్య, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలనివ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జనకవరం, కొండమూరు గ్రామాలలో మంగళవారం జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, గుర్రం వెంకట్రావు, తలపనేని అంజయ్య పాల్గొన్నారు.



కొణిదెనలో ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న పీడీ విజయలక్ష్మి

శ్రమశక్తి సంఘాల ద్వారా ఉపాధి పనులు

బల్లికురవ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో కూలీలు వలసలు పోకుండా శ్రమశక్తి సంఘాల ద్వారా పటిష్టంగా ఉపాధి పనులు చేయిస్తామని డ్వామా పీడీ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని కొణిదెన గ్రామంలో ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. ప్రతి కూలీకి వంద రోజుల పనిదినాలు కేటాయిస్తామని, కూలీలు తమకు కేటాయించిన కొలతల మేరకు పనులు చేయాలని పీడీ సూచించారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతోపాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి



ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ఆయా గ్రామాలల రైతులు, చిన్నారులు, ఇతర ఆధార్ సమస్యలు ఉన్నవారు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీవో బత్తిని శింగయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు భూదార్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ లేకపోవడం అనే సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అలాంటి వారందరూ ఆధార్ కేంద్రంలో ఫోన్ నెంబర్‌ను లింక్ చేసుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కొత్త ఆధార్ తీసుకోవాలని, ఇప్పటికే నలుగురు చిన్నారులకు కొత్త ఆధార్ తీసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన

కావూరివారిపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న రైతులకు ఆపద్కాలంలో తోడుగా ఉండే ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరమని మండలం కావూరివారిపాలెం వ్యవసాయ సిబ్బంది అన్నారు. మంగళవారం సచివాలయంలో ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు స్థానిక నాయకులు, రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించి పథకాలను వివరించారు

పరస్పర దాడుల్లో మహిళకు తీవ్రగాయాలు

విచారణ చేపట్టిన పోలీసులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదం ముదిరి రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడగా, రెండో వర్గంవారు స్వల్పంగా గాయపడ్డారు. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వైకుంఠపురం పరిధిలోని శ్రీరామనగర్‌కు చెందిన కటికల అంజలికి అదే ప్రాంతానికి చెందిన నాగళ్ల వీరబ్రహ్మంకు గతంలోనే ఓ ఇంటి స్థలానికి సంబంధించి వివాదాలు జరిగి, అది కోర్టులో ఉంది. ఇదిలావుండగా అదే ప్రాంతంలోని పక్క వీధిలో అద్దెకు ఉంటున్న అంజలి వదిన అంజమ్మ మంగళవారం ఇల్లు మారుతూ సంబంధిత సామగ్రిని ఓ వాహనంలో తరలించేదుకు సర్దుకుంటుంది. దీంతో ఆ సామగ్రి మావంటూ వీరబ్రహ్మం, బంధువులు అంజమ్మను అడ్డుకున్నారు. దీంతో విషయం పెద్దదయి ఘర్షణ పడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న అంజలి అక్కడికి చేరుకుని వీరబ్రహ్మంతో వాదనకు దిగింది. దీంతో రెండు వర్గాలు దాడులు చేసుకోగా అంజలి తలకు తీవ్ర గాయమవగా, రెండో వర్గానికి చెందిన వారు కూడా గాయపడ్డారు. దీంతో హాస్పిటల్లో చేరి చికిత్స పొందుతుండగా, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజ్యలక్ష్మి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ



పాఠశాలకు ఇన్వర్టర్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యతో పాటు వసతులు కల్పిస్తున్నట్లు వేటపాలెం మండలం అక్కయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపధ్యాయులు భవనం బద్రిరెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలకు ఐటీసీ అనుబంధ సంస్థ ఫినిష్ సొసైటీ చీరాల బ్రాంచి ప్రతినిధులు రూ.40వేలు విలువ గల ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. అందించిన సాయాన్ని వృధాకాకుండా చక్కగా వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసులరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్

ఇంకొల్లు : మండలంలోని గంగవరంలోని వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.10వేల విలువైన ఫర్నిచర్‌ను బహూకరించారు. మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన వలేటి నాగేశ్వరరావు బొబ్బేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇటీవల గంగవరం హైస్కూల్ వచ్చిన సందర్భంగా పాఠశాలకు సీలింగు ఫ్యాన్లు, కుర్చీలను బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.సమత, రిటైర్డు హెచ్‌ఎం కొర్రపాటి వీరాంజనేయులు, వలేటి ఆంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది నాగేశ్వరరావును అబినందించారు.

16న మాలల సాంస్కృతిక కళాజాతర

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో మార్చి 16న జరిగే మాలల సాంస్కృతిక కళాజాతర జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు వెంగళరావు, మాల మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేడ్కర్ భవనంలో బాపట్ల జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 16న చీమకుర్తిలో జరగాల్సిన కళా జాతరలన ఒంగోలుకు మార్చడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీమోహన్, ఒంగోలు నగర అధ్యక్షుడు పీటర్‌పాల్ పాల్గొన్నారు.



ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ పోటీలు నేటి (బుధవారం) నుంచి మార్చి 9వరకు నిర్వహించనున్నారు. అలాగే మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. వరుసగా మూడునెలల పాటు క్రికెట్ మ్యాచ్‌లు ఉండటంతో బెట్టింగ్‌లకు పందెంరాయుళ్లు, మాఫియాలు సన్నద్ధం అవుతున్నాయి. యువతే లక్ష్యంగా వీరు పందేలకు రెడీ అవుతున్నారు. బాల్ బాల్‌కు బెట్టింగ్‌లు నిర్వహించేందుకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు సిద్ధం చేసుకుంటున్నారు. ఓ వైపు అవీఇవీ కుదవ పెడుతూ... మరోవైపు అధిక వడ్డీలకు అప్పులు చేసైనా ఈసారి జాక్‌పాట్ కొట్టాల్సిందేనని పందెంరాయుళ్లు భావిస్తున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ, ఐపీఎల్ మ్యాచ్‌లు ముగిసేసరికి ఎంతమంది నగదు పోగొట్టుకొని రోడ్డున పడతారో... ఇంకెంతమంది ఆత్మహత్య చేసుకుంటారో... ఎన్నికాపురాలు కూలిపోతాయో... వేచి చూడాల్సిందే.

పందేలకు సన్నద్ధం

- బాల్.. బాల్‌కు బెట్టింగ్
- యువతే లక్ష్యంగా రంగంలోకి మాఫియా
- ఆన్‌లైన్‌లో బహిరంగంగానే...
- ప్రత్యేక యాప్‌ల ద్వారా నిర్వహణ
- నేటి నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ
- మార్చి 22 నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లు
- జూదంతో నాశనమవుతున్న జీవితాలు
- వీధిన పడుతున్న కుటుంబాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తాజాగా బెట్టింగ్‌లు కొత్త రంగు పులుముకున్నాయి. గతంలో లాగా ఓ ప్రాంతంలో ఉండి నగదును నేరుగా ఒకరితో ఒకరు పందెం పెట్టుకునే పరిస్థితులు ఇప్పుడు లేవు. పందెంరాయుళ్ల హోటళ్లు, లాడ్జీల్లో గదులను అద్దెకు తీసుకొని ఈ మ్యాచ్‌కు ఇంత... ఈ ఓవర్‌కు ఇన్ని రన్స్.. ఈ బాల్‌కు ఇంత స్కోర్... అంటూ నేరుగా నగదు కలుపుకునే పరిస్థితులు బాగా తగ్గాయి. అలాగని అవి జరగటం లేదని కాదు.. అయితే నేడు టెక్నాలజీ పరుగులు తీస్తుండటంతో బెట్టింగ్ విధానంలోనూ మార్పులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా క్రికెట్ కోసం యాప్‌లు ఉన్నాయి. దీంతో ఫోన్ ద్వారా నేరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. బెట్టింగ్ నిర్వహించేవారు యాప్‌ల వివరాలు తెలిపి, అడ్వాన్స్‌గా రూ.5వేల నుంచి రూ. లక్షలు వరకు వేయాలని సూచిస్తారు. ఆ నగదును ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపాలని నెంబర్లు ఇస్తారు. నగదు జమ అయ్యాక, పందెం కాసుకునే అవకాశం కల్పిస్తారు. బెట్టింగ్‌ముఠా ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి ఈ దోపిడీకి పాల్పడుతున్నారు. అయితే ఈ యాప్‌లను నిర్వహించేది ఎవరు... ఎవరికి మనం ఆన్‌లైన్ ద్వారా నగదు పంపుతున్నాం.. అనే వివరాలు అసలు తెలియవు. అయినా బెట్టింగ్ మత్తులో పడి యువత జీవితాలను నాశం చేసుకుంటున్నది.



ఫ్యాన్సీలు....రేటింగ్‌లు

యాప్‌ల్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే సమయంలో మ్యాచ్ ప్రారంభం కాకముందే బాగా ఆడే టీమ్‌లను బట్టి రేటింగ్ పెడతారు. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు బెట్టింగ్‌లకు అవకాశం ఉంటుంది. యాప్‌లో చూపించే రేటింగ్ ప్రకారం పందెలు కాయవచ్చు, ఇవి కాకుండా ఫ్యాన్సీలు ఉంటాయి. ఒక ఓవర్‌కు ఇన్ని రన్స్ కొట్టలేరు.. ఇన్ని కొడతారు...ఆ బ్యాట్స్‌మెన్ ఇన్ని రన్స్ చేస్తాడు.. 10 ఓవర్స్‌లో ఇంత స్కోర్ చేస్తాడు...ఇలా ఫ్యాన్సీలు ఆడుకునే అవకాశం ఉండటంతో ప్రతి దానిపై పందెలకు సన్నద్ధం అవుతున్నారు.

బానిసలవుతున్న యువత

క్రికెట్ పందేల వైపు యువతే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు సెల్‌ఫోన్లు, యాప్‌లే జీవితంగా వ్యవహరిస్తున్నారు. సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, బంగారు చైన్‌లు, బైక్‌లు, కార్లు కుదువ పెట్టి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని పందేలు కాస్తున్నారు. చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోయి జీవితాలనే పోగొట్టుకుంటున్నారు. యువతతోపాటు ఈ వ్యసనానికి బానిసవుతున్న పలువురు కష్టపడిన సొమ్ముతో పాటు ఇంట్లో ఉన్న సొమ్మును, చివరికి భార్య మెడలోని తాళిని, ఆడ బిడ్డల చెవుల్లోని కమ్మలను కూడా కుదవపెట్టి, బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

బెట్టింగ్‌లకు పాల్పడుతూ చివరకు ఆత్మహత్యలకు పాల్పడేస్థితికి మీ పిల్లలు వస్తున్నారేమో.. తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలి. ఇంట్లో ఉన్న సమయంలోనూ, మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు ఫోన్ పట్టుకొని మీ పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలి. ఇంట్లోని వస్తువులు కన్పించక పోయినా, ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నా వారిని మానసిక వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించాలి. ఏదిఏమైనా ఈ మూడునెలలపాటు యువత పట్ల జాగ్రత్తగా ఉండాలి.

వీఎస్‌యూ వీసీగా శ్రీనివాసరావు

వెంకటాచలం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వైస్ చాన్సలర్ (వీసీ)గా ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును నియమిస్తూ ఏపీ ఉన్నత విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ఢిల్లీ టెక్నాలజికల్ యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీగా ఉన్న ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు గతంలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా ఎస్వీయూలో పనిచేయగా, తిరిగి అక్కడికే వెళ్లారు.



అల్లం శ్రీనివాసరావు

ఘనంగా వీడ్కోలు

ఈ సందర్భంగా విజయభాస్కర్‌రావుకు వీఎస్‌యూ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మంగళవారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన్ను శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ఇన్‌చార్జి వీసీగా విజయభాస్కర్‌రావు ఏడునెలలపాటు విశేష సేవలందించారని, ఆయన నేతృత్వంలో విద్యార్థుల శ్రేయస్సుకు వీఎస్‌యూ అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వీఎస్‌యూ అభివృద్ధికి కృషి చేసిన ఆయన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, కావలి పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ టీ వీరారెడ్డి పాల్గొన్నారు.



విజయభాస్కర్‌రావుకు వీడ్కోలు సన్మానం చేస్తున్న రిజిస్ట్రార్ సునీత, అధ్యాపకులు, సిబ్బంది

త్వరలో ఎంఐజీ లేఅవుట్లు

- ఎన్‌ఎంసీ పరిధిలోనూ ఏర్పాటుకు యత్నం
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నియోజకవర్గాల పరిధిలో మిడిల్‌క్లాస్ ఇన్‌కమ్ గ్రూపు (ఎంఐజీ) లేఅవు ట్లను త్వరలో ఏర్పాటు చేస్తామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ అంశంపై ఆయన మంగళవారం కలెక్టరు ఓ. ఆనంద్‌ని కలసి చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారి సమీపంలో ఉండే ప్రభుత్వ స్థలాలను గుర్తించి, త్వరగా నుడాకు అప్పగించాలని కలెక్టరును కోరామన్నారు. స్థలాల సేకరణ తుదిదశలో ఉందని ఆయన తెలిపారని వివరించారు. స్థలాలను అప్పగించగానే అన్ని సౌకర్యాలతో నుడా ఆధ్వర్యంలో లేఅవుట్లను ఏర్పాటు చేసి తక్కువ ధరకే ప్రజలకు అందిస్తామన్నారు. అలాగే నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలో కూడా లేఅవుట్లను వేసేందుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టరు కోరామని వెల్లడించారు. ఇందుకు కలెక్టరు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అక్రమ లేఅవుట్లను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టరు వివరించారని కోటంరెడ్డి పేర్కొన్నారు.



కలెక్టరు ఆనంద్‌తో చర్చిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

'నక్ష'తో పారదర్శకంగా రికార్డుల తయారీ

నెల్లూరు (సిటీ,ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో భూ సర్వేతో పారదర్శకంగా రికార్డులు తయారవుతాయని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ జియో స్పేషికల్ నాలెడ్జి బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్(నక్ష) ను నిర్వహిస్తున్నదని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం నగర కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి నక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నెలపాటు జరిగే ఈ సర్వేతో పలు ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. భూరికార్డులన్నీ కచ్చితంగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ప్రతి రికార్డును జీఐఎస్‌తో మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. స్మార్టు సిటీ తయారీలో ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. నెల్లూరును ప్రయోగాత్మకంగా తీసుకుని ఈ ప్రక్రియను చేపట్టారని ఆయన వివరించారు.

నిరీక్షణకు తెర !

- ఇక నుంచి త్వరగానే రిజిస్ట్రేషన్లు
- స్లాట్ బుకింగ్‌తోనే ప్రక్రియ
- కొత్తగా ఆన్‌లైన్ క్యూ మేనేజ్‌మెంట్ విధానం
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆస్తులు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ క్యూ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ విధానంలో దస్తావేజులు, వివాహాలు రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ముందుగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. స్లాట్ బుక్ అయితే ఆ సమయానికి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే సరిపోతుంది. ఇంతకు ముందులాగా కార్యాలయలో గంటల కొద్దీ నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. స్లాట్ బుక్ చేసుకుంటే ఆయా వ్యక్తులే హాజరైతే సరిపోతుంది. ప్రస్తుతం భూములు, ఆస్తులు, వివాహాల రిజిస్ట్రేషన్లకు తప్ప మిగిలిన రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూ నిర్వహణ సరిగ్గా లేక, ముందు వచ్చిన వారికి ముందుగా రిజిస్ట్రేషన్లు జరగడంలేదు. దీంతో కంప్యూటర్ ఆధారిత నిర్వహణ విధానాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్లు కూడా పరిమితంగా ఉంటాయి. పరిమితి దాటి వచ్చిన స్లాట్ బుకింగ్‌ను తరువాత రోజుకు మార్చుతారు.

జిల్లాలో పరిస్థితి

జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో సగటున రోజుకి 10 నుంచి 50 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. స్లాట్ బుకింగ్ అందుబాటులోకి వస్తే రిజిస్ట్రేషన్ ఎన్ని గంటలకు చేస్తారో సమయం కేటాయి స్తారు. ఆ సమయానికి కార్యాలయాలకు వెళితే సరిపోతుంది.

స్లాట్ బుకింగ్ ఎలా..

వెబ్‌పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ వివరాలు ఆన్‌లైన్‌లో ఫారంలో నింపాలి. ఆ తర్వాత ఐడీ వస్తుంది. ఆ ఐడీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి స్లాట్ బుక్ చేసుకుని ఆ సమయానికి కార్యాలయానికి వెళ్లాలి. లేదా మొబైల్ యాప్ ద్వారా ప్రజలు వారికి కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవాలి. అప్పుడు క్యూఆర్ కోడ్‌తో ఓ టోకెన్ వస్తుంది. ఆ క్యూఆర్ కోడ్ సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయానికి కూడా చేరుతుంది. స్లాట్ బుక్ చేసుకోవడానికి ఎలాంటి ఫీజు చెల్లించ అక్కర్లేదు. కానీ స్లాట్ రద్దు చేసుకుంటే మాత్రం రూ.100 చెల్లించాలి. రద్దు చేసుకున్న స్లాట్‌ను మళ్లీ బుక్ చేసుకుంటే రూ.200 ఫీజు చెల్లించాలి.

- సెలవు రోజుల్లో కూడా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. సెలవుకు ముందు రోజు సాయంత్రం ఐదుగంటల్లోగా స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ సదుపాయం జిల్లా ప్రధాన కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే అందుబాటులో ఉంది. డిమాండు మేరకు జిల్లాలోని అన్ని కార్యాలయాలకు విస్తరించనున్నారు. సెలవురోజున రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రూ.5వేల ఫీజు చెల్లించాలి.
- ఎనీ వేర్ విధానంలో స్లాట్ బుక్ చేసుకోవాలనుకుంటే, రిజిస్ట్రేషన్ తేదీ ముందు రోజు సాయంత్రం నాలుగు గంటలకల్లా రిజిస్ట్రేషన్ చేయాల్సిన ఆస్తి.. ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉందో..? వారికి పంపాలి.



వివాహ రిజిస్ట్రేషన్‌కు హాజరైన జంట, వారి కుటుంబ సభ్యులు

స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తాం

తమ శాఖ ఉన్నతాధికారుల నుంచి స్లాట్ బుకింగ్‌కు సంబంధించి విధివిధా నాలు అందాల్సి ఉంది. విధి విధానాలు అందాక స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తాం. దీంతో ప్రజలకు డబ్బుతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది.

- ఐ.విజయరాణి, రిజిస్ట్రార్



కబ్జా చెరలో 'కుంకుమపూడి'

- విద్యుత్ మోటార్లతో చెరువు నీరు తోడివేత
- ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు
- సర్వే చేసి హద్దుల ఏర్పాటుకు రైతుల డిమాండ్
- పట్టీపట్టనట్లుగా అధికార యంత్రాంగం



ఆక్రమణలతో కుచించుకుపోయిన కుంకుమపూడి చెరువు

వెంకటాచలం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలోని కుంకుమపూడి చెరువు ఆక్రమణలకు గురైంది. సర్వే నెంబరు-2లో ఉన్న ఈ చెరువు విస్తీర్ణం సుమారు 64.30 ఎకరాలు. చెరువు కింద 100 ఎకరాలకుపైగానే ఆయకట్టు ఉంది. కానీ చెరువు విస్తీర్ణంలో సుమారు 20 ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని కొందరు రైతులు పేర్కొన్నారు. అలాగే కాలువలు, చెరువు కట్ట కూడా కబ్జా కోరల్లో చిక్కుకుందని వారు తెలిపారు. ఆక్రమణలతో నీటి నిల్వ సామర్థ్యం బాగా తగ్గిందని, సర్వే చేసి చెరువు ఆక్రమణలను తొలగించాలంటూ ఇరిగేషన్ ఎస్ఈకి రైతులు మొరపెట్టుకున్నారు. కానీ ఇంతవరకు వారు స్పందించిన దాఖలాలు లేవు.



చెరువు నీటిని తోడేస్తున్న విద్యుత్ మోటారు

మోటార్లతో నీటి తోడివేత

చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దఎత్తున విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీటి తోడేస్తున్నారని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయకట్టు రైతులు అంటున్నారు. అనుమతి లేని విద్యుత్ మోటార్లపై విద్యుత్‌శాఖ అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. అయితే నీటి తోడేస్తున్న భూస్వాముల జోలికి వెళ్లే ధైర్యం అధికారులకు లేదని వారు విమర్శలు గుప్పిస్తున్నారు. చెరువు ఆక్రమణలతో వేసవిలో మూగజీవాలకు నీళ్ల ఉండడం లేదని, బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయని రైతులు పేర్కొన్నారు. చెరువు ఆక్రమణదారులకు, అక్రమంగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసిన భూస్వాములకు కొంతమంది ఇరిగేషన్, విద్యుత్‌శాఖ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వెనకడుగు వేస్తే ఆక్రమణలు మరింత పెరిగే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి చెరువు విస్తీర్ణంపై సర్వే చేయించి, ఆక్రమణలతోపాటు అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక రైతులతో కలిసి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మారంరెడ్డి రాధారెడ్డి ఇరిగేషన్ ఎస్ఈకి వినతిపత్రాన్ని అందించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానము

సఖ్ఖవాడ గ్రామము, దుత్తలూరు మం., శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
svpd_nrwd@yahoo.in సెల్ నెం. : 79899 62262

ఈ-ప్రొక్యూరుమెంట్-సీల్డు టెండరు-బహిరంగ వేలం ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, దుత్తలూరు మండలం, నర్రవాడ గ్రామములో వెంచేసియున్న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానము నందు తేది.01.03.2025 శనివారము ఉ.11.00 గం.లకు 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా తేది.01.04.2025 నుండి తేది.31.03.2026 వరకు వివిధ హక్కులు లీజుకు ఇచ్చుటకు ఈ-ప్రొక్యూరుమెంటు/ సీల్డు టెండర్లు/ బహిరంగ వేలం పాటలు, అదే రోజు ఉదయము 9.30 గం.లకు దేవస్థానమునకు సంబంధించిన వివిధ షాపులను మూడు సంవత్సరముల కాలపరిమితికి అద్దెకు ఇచ్చుటకు సీల్డుటెండర్లు/ బహిరంగ వేలం పాటలు మరియు అదే రోజు మధ్యాహ్నం 03.00 గం.లకు దేవస్థానమునకు అవసరమైన వివిధ ఐటములు సరఫరా చేయుటకు ఈ-ప్రొక్యూరుమెంట్/సీల్డుటెండర్లు దేవస్థాన కార్యాలయము వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల సమక్షమున జరుపబడును.

ఐటం నెం.	వివరములు	ధరావత్తు రూ.	లీజు కాలపరిమితి
	ఈ-ప్రొక్యూరుమెంట్ / సీల్డు టెండర్లు/బహిరంగ వేలం పాటలు		
1.	టెంకాయలు, పూజా ద్రవ్యములు అమ్ముకొను హక్కు	5,00,000/-	ఒక్క సంవత్సర కాలమునకు అనగా తేది: 01-04-2025 నుండి తేది. 31.03.2026 వరకు
2.	కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొను హక్కు	2,00,000/-	
3.	భక్తులు సమర్పించు చీరలు, రవికలు సేకరించుకొను, విక్రయించు హక్కు	2,00,000/-	
	సీల్డు టెండర్లు / బహిరంగ వేలం పాటలు		
4.	పొంగలి షెడ్డు నందు గల గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుకొను హక్కు	50,000/-	
5.	పండ్లు, పూలు, పూలమాలలు అమ్ముకొను హక్కు	50,000/-	
6.	పాదరక్షలు భద్రపరచుకొను హక్కు	5,000/	
7.	దేవస్థానమునకు సంబంధించిన షాపు నెం.01 నుండి 15 వరకు. షాపు నెం.20 నుండి 27 వరకు (కాలపరిమితి మూడు సంవత్సరముల వరకు)	10,000/ (ఒక షాపుకు)	తేది: 01.04.2025 నుండి తేది: 31.03.2028 వరకు
	ఈ-ప్రొక్యూరుమెంటు		
8.	కిరాణా, లడ్డు, పడితరము, పారిశుధ్య సామాగ్రి సరఫరా చేయుట	2,00,000/-	ఒక్క సంవత్సరం కాలమునకు అనగా తేది. 01.04.2025 నుండి తేది. 31.03.2026 వరకు
	సీల్డు టెండర్లు		
9.	పుష్పము సరఫరా చేయుట	20,000/-	
10.	పాలు, పెరుగు సరఫరా చేయుట	5,000/-	
11.	అభిషేకము సామానులు సరఫరా చేయుట	5,000/-	
12.	కరెంటు మరియు ప్లంబింగ్ సామానులు సరఫరా చేయుట	5,000/-	
13.	వంటచెరకు సరఫరా చేయుట	5,000/-	
14.	గోశాలకు వరిగడ్డి సరఫరా చేయుట	5,000/-	

షరతులు: 1) ఐటం నెం.1 నుండి 3 వరకు హక్కులకు ఈ-ప్రొక్యూరుమెంటు/సీల్డు టెండర్లు/ బహిరంగ వేలం ఈ మూడింటిలో ఏందులో ఎక్కువ మొత్తము లభిస్తే సదరు మొత్తమును ఖరారు చేయబడును. 2) ఐటం నెం.4 నుండి 7 వరకు సీల్డు టెండర్లు/బహిరంగ వేలం పాటలు ఈ రెండింటిలో ఏందులో ఎక్కువ మొత్తము లభిస్తే సదరు మొత్తమును ఖరారు చేయబడును. 3) ఐటం నెం.8నకు ఈ-ప్రొక్యూరుమెంటు ద్వారా మాత్రమే టెండర్లు దాఖలు చేయవలెను. అందులో తక్కువ మొత్తము దాఖలు చేసిన టెండరును మాత్రమే ఖరారు చేయబడును. 4) ఐటం నెం.9 నుండి 14 వరకు సీల్డు టెండర్లు ద్వారా మాత్రమే టెండర్లు దాఖలు చేయవలెను. అందులో తక్కువ మొత్తము దాఖలు చేసిన టెండరును మాత్రమే ఖరారు చేయబడును. 5) ఐటం నెం.1 నుండి 7 వరకు టెండరు షెడ్యూల్స్ తేది: 19-02-2025 నుండి తేది:01-03-2025 ఉదయము 9.30 గం.ల వరకు రూ.500/- చెల్లించి పొందవచ్చును. 6) ఐటం నెం.9 నుండి 14 వరకు టెండరు షెడ్యూల్స్ తేది:19-02-2025 నుండి తేది: 01-03-2025 మధ్యాహ్నం 01.00 గం.ల వరకు రూ.500/- చెల్లించి పొందవచ్చును. అదే రోజు మధ్యాహ్నం 02.00 గం.ల వరకు టెండరు షెడ్యూల్స్ స్వీకరించబడును. 7) ఈ-ప్రొక్యూరమెంటు/ సీల్డు టెండర్లు/బహిరంగ వేలంపాటలలో పాల్గొనువారు హిందువులై ఉండవలెను. 8) ఈ-టెండరు వివరములు www.eprocurement.gov.in లో AP Endowments Department Marketing నందు చూడగలరు. మిగిలిన షరతులు దేవస్థానము కార్యాలయము నందు తెలుసుకొనవచ్చును.

అమ్మవారి సేవలో
వ్యవస్థాపక ధర్మకర్తలు — నర్రవాడ, తేది : 18.02.2025 — కార్యనిర్వహణాధికారి

కావలి పురపాలక సంఘము, కావలి

సి.నెం.54/2025/ఏ1 తేది:17-02-2025.

బహిరంగ వేలం ప్రకటన

కావలి పురపాలక సంఘమునకు సంబంధించిన ఈ దిగువ తెలిపిన మార్కెట్లకు చెందిన దినసరి రుసుములు వసూలు చేయుటకు 2025-26 సంవత్సరమునకు అనగా తేది.01-04-2025 నుండి 31-03-2026 వరకు ఒక సంవత్సర కాలమునకు లీజుకు ఇచ్చుటకు తేది.24-02-2025 ఉదయము 11.00 గంటలకు కావలి పురపాలక సంఘ కార్యాలయపు ఆవరణలో కమీషనర్ గారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు వేలములో పాల్గొనుటకు
1. సాల్వెన్సీ సర్టిఫికేట్ సర్టిఫికేటు దాఖలు పరచుటకు ఆఖరు తేది.22-02-2025 సాయంత్రం 05.00 గంటల వరకు
2. మునిసిపాలిటీకి ఎలాంటి పన్నులు బకాయిలేనట్లుగా నో డ్యూస్ సర్టిఫికేటు.
పై తెలిపిన దస్తావేజులు జతపరచి నిర్ణయించిన ధరావత్తు మొత్తము చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను.

వ.నెం.	మార్కెట్ వివరములు	చెల్లించుటకు ధరావత్తు మొత్తము (రూ.లలో)	సాల్వెన్సీ మొత్తము (రూ.లలో)
1.	సంత్రీ మరియు పండ్ల మార్కెట్	6,00,000/-	40,00,000/-
2.	చేపలు, మాంసము మార్కెట్	2,50,000/-	5,00,000/-
3.	జంతు వధశాల	50,000/-	1,50,000/-

గమనిక: మిగిలిన వివరములను ఆఫీసు పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు పొందగలరు.

కమీషనరు, కావలి పురపాలక సంఘము

ఆనకట్ట.. ప్లాస్టిక్ మేట..!



ఉదయగిరి ఆనకట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పట్టణంలోని అన్ని ప్రాంతాల నుంచి మురుగు నీరు ఆనకట్టలోకి చేరుతోంది. ఆ నీటి గుండా ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, గ్లాసులు, పాలథిన్ కవర్లు, ఇతరత్రా వ్యర్థాలు ఆనకట్టకు చేరుతున్నాయి. మరోవైపు పలువురు దుకాణదారులు ఖాళీ టెంకాయలు, హోటళ్లల్లో వచ్చే వ్యర్థ పదార్థాలను అందులోనే వేస్తున్నారు. దీనికితోడు ఆనకట్ట నీటిలో గుర్రపుడెక్క అల్లుకోవడంతో దుర్వాసనతోపాటు దోమలకు కేంద్రంగా మారింది. వీటి వల్ల ప్రమాదం పొంచి ఉందని, ప్లాస్టిక్ వ్యర్థాలు అక్కడికి చేరుకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్

పట్టణ నడిబొడ్డున శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని, వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇలా వదిలేయడం వలన ఆక్రమణకు గురయ్యే అవకాశం కూడా ఉందని, వెంటనే పోలీసు శాఖ వారు వాడుకలోకి తీసుకు రావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- వింజమూరు, (ఆంధ్రజ్యోతి)



మూవయ్య నిర్వాకం.. గోడ నీడే ఆధారం..

నాడు-నేడు పనులతో పాఠశాలలు, కళాశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నామంటూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పి గాలికి వదిలేయడంతో గోడ నీడే విద్యార్థులకు ఆధారమైంది. ఉదయగిరి ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 338 మంది ఉన్నారు. అయితే కళాశాలలో నాలుగు తరగతి గదులే ఉండడంతో వారంతా వరండాలు, ఆరుబయట నేలపైనే బైఠాయించి విద్యాభ్యాసం చేయాల్సి వస్తోంది. దీనికితోడు ఫిబ్రవరి మాసంలోనే ఎండలు అధికంగా ఉండడంతో గోడ నీడనే ఆధారంగా చేసుకుని విద్యాభ్యాసం చేస్తున్నారు. నాడు-నేడు రెండో విడతలో కళాశాలకు అదనపు తరగతులకు నిధులు మంజూరు చేయకపోవడం, మరమ్మతులకే మంజూరు చేయడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

కాఫీ పొడితో అపురూప చిత్రాలు

ప్రతిభ PRATIBHA

కాఫీ పొడితో చిత్రాలు గీ(వే)యడంలో ఆయన దిట్ట. ఎన్నో సాహిత్య గ్రంథాలు, వార, మాస పత్రికల్లో ప్రచురించిన కథలు, ఫీచర్ పేజీలకు ఆయన ముఖ చిత్రకారుడిగా అందరికీ పరిచయమే. ప్రముఖ చిత్రకారుల నుంచి స్ఫూర్తిపొందని ఆయన ఎన్నో జాతీయ, రాష్ట్రస్థాయి చిత్ర ప్రదర్శనల్లో పాల్గొని అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. ఆయనే గుర్రం శ్రీనాథ్.

- రూపశిల్పి గుర్రం శ్రీనాథ్
- ఎన్నో పత్రికల్లో ఆయన బొమ్మల ప్రచురణ
- ప్రతిఒక్కరి జీవితంలో చిత్రకళ భాగం కావాలి

ఉమ్మడి నెల్లూరు జిల్లా కోట గ్రామంలో గుర్రం శ్రీనాథ్ 1962 జనవరి 19న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గుర్రం వెంకటస్వామి- కృష్ణమ్మ. ఆయనకు ఊహ తెలిసిన నాటి నుంచి పలక, కాగితాలపై పలుచిత్రాలు గీసేవాడు. శ్రీనాథ్ అభిరుచిని గుర్తించిన తండ్రి చిత్రలేఖనంలో ప్రోత్సహించారు. దీంతో ఆయన తన ఐదో ఏటనే పెన్సిల్‌తో బొమ్మలు వే(గీ)యడం నేర్చుకున్నారు. పరిసరాలను, జంతువులను పరిశీలించి, వాటి హావభావాలను అవపోసన పట్టి చిత్రాలు గీసేవారు. అలా సాధన చేస్తూ చేస్తూ... సరస్వతి, గణపతి, లక్ష్మీదేవి, విష్ణువు, తదితర చిత్రాలను కలర్ పెన్సిళ్లతో వేయడం మొదలు పెట్టారు. పేపర్, గోడలపై ఆ చిత్రాలు గీయడంతో పాటు రంగుల చాక్‌పీసులు, బొగ్గులతో గోడలు, అరుగులపై సినిమా నటీనటులు, రాజకీయ నేతల చిత్రాలను పెద్దవిగా వేయడం నేర్చుకున్నారు.

● ప్రముఖ చిత్రకారుల నుంచి ప్రేరణ

పాఠశాల విద్యలోనే శ్రీనాథ్ ప్రముఖ చిత్రకారుల చిత్రాలను చూసి ప్రేరణ పొందారు. వడ్డాది పాపయ్య, శంకర్, చిత్ర, జయ తదితర చిత్రకారుల చిత్రాలను ఏకలవ్య శిష్యుడిగా సాధన చేశారు. వివిధ చిత్రాలు గీయడంలో పట్టు సాధించారు. ప్రకృతి చిత్రాలు వేయడంలోనూ చక్కగా అవగాహన పెంచుకున్నారు. ఈ క్రమంలో మంచి చిత్రకారుడిగా గుర్తింపు రావడానికి గట్టి పునాది పడింది.

● ప్రతిచోటా ప్రథమస్థానమే...

హైస్కూలు, పాలిటెక్నిక్, డిగ్రీ (బీఎల్) కళాశాలల్లో చదివే రోజుల్లోనే ఆయా సంస్థలు నిర్వహిం చిన డ్రాయింగ్, ఆర్ట్స్ పోటీల్లో శ్రీనాథ్ ప్రథమ స్థానంలో నిలిచారు. కళాశాల స్థాయిలో జేసీస్ క్లబ్ నిర్వహించిన 'స్వాతంత్ర్య సమరం - టంగుటూరు ప్రకాశం' అంశంపై వేసిన చిత్రానికి, పోతనా మాత్యుడి పంచశతజయంతి సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీలోనూ, తిక్కనపీఠం నిర్వహించిన కవిత్రయం జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీలో నూ, వీఆర్ లా కళాశాలలో నిర్వహించిన న్యాయదేవత, చిత్రలేఖన పోటీలోనూ, జిల్లా సైన్స్ సెంటర్ నిర్వహించిన 'నాడు - నేడు వాతావరణం' చిత్రలేఖన పోటీల్లోనూ ఆయన మొదటి స్థానంలో నిలిచారు.

● విద్యాభ్యాసం

కోటలో హైస్కూలు విద్య, నెల్లూరులో పాలిటెక్నిక్, వీఆర్ కళాశాలలో బీకామ్, చెన్నైలో డ్రాయింగ్ కోర్సులు పూర్తి చేసి హయ్యర్‌లో ప్రథమ స్థానం సాధించారు. అనంతరం కర్నాటకలోని ఓపెన్ యూనివర్సిటీలో చిత్రలేఖనం కోర్సు అభ్యసించారు.


● స్వచ్ఛంద పదవీ విరమణ

1987లో నెల్లూరు జడ్పీ కార్యాలయంలో టైపిస్టుగా చేరారు. 2002లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2013 నుంచి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా కొనసాగారు. 2024 మార్చి 31న స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. వృత్తిలో రాణిస్తూనే శ్రీనాథ్ చిత్రకారుడిగా ఆంధ్రభూమి, విహారి, నిత్య, ఉష, విశాలాక్షి తదితర వార, మాస పత్రికలకు ముఖచిత్రాలను గీసేవారు. ఈ నేపథ్యంలో చిత్రలేఖనాన్ని ఆయన ప్రవృత్తిగా చేసుకున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



కాఫీ పెయింట్‌తో గీసిన సింగారించుకుంటున్న వనిత



కాఫీ పొడితో రూపొందించిన తల్లీకూతురు ఇలస్ట్రేషన్ చిత్రం

చిత్రకళ నేర్పించాలి : శ్రీనాథ్



చిత్రకళ ప్రతి ఒక్కరికి జీవితంలో భాగం కావాలి. అప్పుడే మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు సామాజిక, శాస్త్ర అంశాలపై పట్టు లభిస్తుంది. నాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమందికి చిత్రకళల పట్ల ఆసక్తి ఉన్నా రాణించేందుకు అవకాశాలు లేవు. చిత్రకళ పాఠశాలను ఏర్పాటు చేసి, ఆసక్తి ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నదే నా జీవితాశయం.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

వంద కిలోల గంజాయి స్వాధీనం

- ఉలవపాడు హైవే వద్ద తనిఖీల్లో పట్టివేత
- అనకాపల్లి జిల్లాకు చెందిన ఇద్దరి అరెస్టు
- పరారీలో మూడో వ్యక్తి
- విజయవాడ నుంచి చెన్నైకి తరలిస్తుండగా ఘటన

కందుకూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలకేంద్రం సుబ్రహ్మణ్య స్వామి ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై చేపట్టిన వాహనాల తనిఖీలో అక్రమంగా తరలిస్తున్న వంద కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గంజాయిని తరలిస్తు న్న అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం కొంతలి గ్రామానికి చెందిన ఇల్లపు నాగేశ్వరరావు ఇదే జిల్లా నాతవరం మండలం మన్నేపురట్ల గ్రామానికి చెందిన తాడి నాగ సత్యనారాయణను అరెస్టు చేశారు. కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలిలు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై సీఐకి అందిన సమాచారంతో ఉలవపాడు ఎస్ఐ అంకమ్మను అప్రమత్తం చేసి సీఐ కూడా స్వయంగా వెళ్లారు. గంజాయి రవాణా చేస్తున్న మహేంద్రక్యాబ్ వాహనాన్ని వదిలేసి స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేశారు. ఇందులో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మూడో వ్యక్తి దుర్గారావు పరారీ అయ్యాడు. పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసి వాహనంతో సహా 95 ప్యాకెట్లలో ఉన్న వంద కిలోల గంజాయిని, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి స్మగ్లర్లను విచారించగా ఆనందవేలు అనే వ్యక్తి గంజాయి కావాలని అడగటంతో తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఆనందవేలుతో పాటు స్మగ్లింగ్ చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని పట్టుకున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ అంకమ్మతో పాటు సిబ్బంది ఎన్. శంకర్, పి. శ్రీనివాసరావు, కె. బ్రహ్మయ్య, ఎస్కే రిజ్వాన్, జయశంకర్, ఎం. మాలకొండయ్య, డి. బ్రహ్మయ్యలను డీఎస్పీ అభినందించారు.



గంజాయి నిందితులతో కందుకూరు డీఎస్పీ, సీఐ, ఉలవపాడు ఎస్ఐ

పాఠశాలల్లో భాషోత్సవాల ప్రారంభం

● భాషల ఔన్నత్యం కోసమే నిర్వహణ ● నాలుగు రోజులపాటు విద్యార్థులకు పోటీలు : డీఈవో

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం భాషోత్సవాలు ప్రారంభమయ్యాయి. వివిధ నైపుణ్యాలతో భాష అభ్యసనాన్ని విద్యార్థులకు అందించడం, అంతరించి పోతున్న భాషల గొప్ప దనాన్ని చాటిచెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా మంగళ వారం నుంచి 21వతేదీ వరకు నాలుగు రోజులు పలు భాషలకు సంబంధించి వివిధ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీ రావు తెలిపారు. భాషల పండుగ ప్రారంభం సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారులతో, సిబ్బందితో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఎంపిక చేసిన భాషలకు సంబంధించి ఆయా తేదీల్లో పఠనం, పొట్టి కథలు చెప్పడం, రాయడం, చర్చావేదిక, వక్తృత్వం, ఉపన్యాసం, స్పెల్‌చెక్, రోల్‌ప్లే, బోధనోపకరణాల తయారీ వంటి అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. తొలిరోజు పలు పాఠశాలల్లో ఆంగ్ల భాషపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట మునిసిపల్ పాఠశాలలో ఉపన్యసిస్తున్న విద్యార్థి

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు షేక్ అలీం ఎంపిక



కందుకూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ అలీం జాతీయస్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. బీటెక్ పూర్తిచేసి ప్రస్తుతం ఎంటెక్ చదువుతున్న ఈయనకు చిన్నప్పటినుంచి బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి ఉంది. దీనికితోడు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఈ దశకు చేరుకోగలిగానని అలీం తెలిపారు.



జట్లకొండూరులో వరిపైరును పరిశీలిస్తున్న డీఏవో సత్యవాణి

జిల్లాలో 295 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- రాయితీలకు యూనిక్ నెంబర్ తప్పనిసరి
- ఈకేవైసీ చేయకపోతే ఇబ్బందులు
- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

మనుబోలు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది 295 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. మండలంలోని జట్లకొండూరు పంచాయతీలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 3.66 లక్షల మంది రైతులున్నారన్నారు. ముందుగా పీఎం కిసాన్ కింద ఉన్న 1.71 లక్షల మందికి ప్రత్యేక యూనిక్ నెంబరు ఇస్తున్నామన్నారు. ఇప్పటికే 50 వేల మంది రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. నెలాఖరుకల్లా ఈ కార్యక్రమం నూరుశాతం పూర్తి చేస్తామన్నారు. ఆ తరువాత మిగతా రైతులకు ఇస్తామన్నారు. వ్యవసాయశాఖ నుంచి ఎలాంటి రాయితీలు రావాలన్నా ఈ యూనిక్ నెంబర్ ప్రధానమన్నారు. రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలన్నారు. ఇది చేయకపోతే ధాన్యం కొనుగోలు చేసే విషయంలో రైతులకు ఇబ్బందులు తప్పవన్నారు. నవంబర్ నెలలోనే నాట్లు జగాలని, కొన్నిచోట్ల ఆలస్యం చేయడంతో వాతావరణ పరిస్థితులు సరిగాలేక దిగుబడి తగ్గుతోందన్నారు. ప్రతి వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కలిగిన ఆర్‌బీకేల పరిధిలో మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, శివనాయక్, ఏవో జహీర్, ఏఈవో కళారాణి, తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పారా లీగల్ వలంటీర్లు(న్యాయసేవ సహాయకులు)గా పనిచేయడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి జడ్జి జీ గీత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయసేవాధికార కమిటీలు గూడూరు, కోవూరు, కావలి, ఆత్మకూరు, వెంకటగిరి, కోట, సూళ్లూరుపేట, నాయుడు పేట, ఉదయగిరిలో పారా లీగల్ వలంటీర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండి ఇంటర్, ఆపైన విద్యార్హత కలిగిన వారు అర్హులన్నారు. ఒక సంవత్సర కాలపరిమితితో భర్తీ అయ్యే ఈ పోస్టులకు ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్ణయించిన గౌరవ వేతనాన్ని అందిస్తామని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను చైర్మన్ కం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయసేవా సదన్, డిస్ట్రిక్ట్ కోర్టు కాంపౌండ్, నెల్లూరు చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా మాత్రమే పంపాలని సూచించారు. దరఖాస్తులు ఈనెల 26 సాయంత్రం 5గంటలలోగా తమకు చేరేలా పంపాలని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికలు జరుగుతాయని, పూర్తి వివరాలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు, అంగన్‌వాడీ సేవకులు, లా, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నేడు ఛత్రపతి జయంతి



విలేకరుల సమావేశంలో ఉత్సవ బ్యాడ్జీలు చూపుతున్న కాకు మురళీరెడ్డి, కమిటీ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు బుధవారం నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి తెలిపారు. ఈ వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. నెల్లూరు నగరంలోని కమిటీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం 4గంటలకు వైఎంసీఏ మైదానం నుంచి జయంతి ఉత్సవ ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. వీఆర్‌సీ, గాంధీబొమ్మ, శివాజీ సెంటర్, ఏసీ సెంటర్, నర్తకి సెంటర్, కనకమహల్ ప్రాంతాల మీదుగా తిరిగి వైఎంసీఏ గ్రౌండ్‌కు ఊరేగింపు చేరుతుందన్నారు. ప్రజలు, శివాజీ అభిమానులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, కార్యక్రమ కన్వీనర్ అశోక్ నాయుడు, కార్యదర్శి మధురెడ్డి, సభ్యులు సోలేటి వెంకటేశ్వర్లు, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులకు చుక్కెదురు

● భూమిని లీజుకు ఇచ్చేందుకు అంగీకరించని గ్రామస్థులు

సీతారామపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో మంగళవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులకు చుక్కెదురైంది. వివరాలిలా ఉన్నాయి. ఆర్డీవో పావని అధ్యక్షతన విండోసోల్ సోలార్ ప్రాజెక్ట్‌కు తెల్లరాయి మైనింగ్ కోసం మేత పోరంబోకు భూమి 20 సంవత్సరాలు లీజుకు ఇవ్వడంపై ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మాట్లాడుతూ తెల్లరాయి మైనింగ్ కోసం మేత పోరంబోకు భూమిని లీజుకు ఇవ్వడం వల్ల పశువుల మేతకు భూమి లేకుండా పోతుందని, జీవనాధారం కోల్పోతామని, అందువల్ల భూమిని ఇవ్వమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈమేరకు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కృష్ణారెడ్డి, ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాంనాథరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసులు, ఈఆర్వో వంశీ, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో పావని

మా భూముల జోలికొస్తే ఉద్యమిస్తాం

● కరేడు గ్రామస్థుల ఆగ్రహం

ఉలవపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధి నెపంతో సారవంతమైన భూములు లాక్కోవాలని చూస్తే ప్రజా ఉద్యమం చేపడతామని కరేడు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీపీసీఎల్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం భూసేకరణ చేపడుతుందని వదంతులు వస్తుండటంతో మంగళవారం వారు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మిరియం శ్రీనివాసులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర ప్రాంతంలోని గ్రామాలను నామరూపాలు లేకుండా భారత్ పెట్రోలియం సంస్థకు కట్టబట్టి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆగమేఘాల మీద భూ సర్వే చేయిస్తున్నారని సారవంతమైన, విలువైన భూములు పోగొట్టుకోవడానికి సిద్ధంగా లేమని తీరప్రాంతం గ్రామాల ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

పరీక్ష కేంద్రం తనిఖీ

కందుకూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):స్థానిక వివేకా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని ఆంధ్రకేసరి యూనివర్సిటీ (ఏకేయూ) రిజిస్ట్రార్ హరిబాబు మంగళవారం తనిఖీ చేశారు. సింగరాయకొండ అభినవ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ స్టడీస్ విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటపాటలతో చదువు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీకేంద్రాలకు వచ్చే ప్రీ స్కూల్ పిల్లలకు ఆట పాటలతో విద్యనందించాలని హైస్కూల్ హెచ్ఎం కమల్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జునరావు, సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

కందుకూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం సాయంత్రం 4 గంటలకు అంకమ్మ ఆలయం నుంచి పామూరు సర్కిల్ వరకు హిందూ బంధువుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డాక్టరు మల్లికార్జున మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు దరఖాస్తుల పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు అందిన దరఖాస్తులను పరిశీలిస్తామని ఎంపీడీవో అప్పాజీ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 30రుణాలకు 322 దరఖాస్తులొచ్చాయన్నారు.

ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు

శకునాలపల్లి, వెంగళరావునగర్, బండగానిపల్లి, జీ.చెరువుపల్లి, నేలటూరు, కృష్ణంపల్లి,అప్పసముద్రం, తిరుమలాపురం కొండాయపాళెం, ఉదయగిరి-1,2,3 గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. కేంద్రాలు మంగళవారం నుంచి 28వరకు పని చేస్తాయన్నారు.

శిక్షణ తరగతులు

ఉదయగిరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు మొదటి విడతగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ బాలకేశవులు, రిసోర్సుపర్సన్‌లు ఫణికుమార్, సుబ్బారెడ్డి, సారధి పాల్గొన్నారు.

భూ కబ్జాకు అడ్డుకట్ట

అనంతసాగరం ఫిబ్రవరి 18(ఆంధ్ర జ్యోతి):మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో కొందరు మంగళవారం ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వ భూమిని కబ్జా చేసే ప్రయత్నానికి రెవెన్యూ సిబ్బంది అడ్డుకట్ట వేశారు. ఎక్స్‌కవేటర్‌తో ముళ్ల పొదలు తొలగిస్తుండగా సమాచారం అందుకొని భూమి కబ్జాను అడ్డుకున్నారు.

స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం సమీపంలోని 158 సర్వేనెంబర్‌లో ఎస్సీలకు కేటాయించిన ఇంటి స్థలాలను కొందరు నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమిస్తున్నారని మంగళవారం గ్రామ ఎస్సీలు తహసీల్దారు సుభద్రకు ఫిర్యాదు చేశారు. తమకు మంజూరు చేసిన స్థలాలను అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

మెలకువలు పాటించాలి

ఉదయగిరి: వరి సాగులో రైతులు తగిన మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ సూచించారు. మంగళవారం అప్పసముద్రం, కొండాయపాళెంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

మిరప రైతు కుదేలు

- తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో తగ్గిన ధరలు
- నష్టాల్లో సాగుదారులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 18ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టించిన మిరప రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. తెగుళ్లు, చీడపీడలకు తోడు మార్కెట్‌లో ధరలు పతనం మిరప రైతులను కుంగదీశాయి. అప్పులకు వెనుకాడకుండా మిరపసాగు చేసి నష్టాలు మూటక ట్టుకున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని శాఖవరం, వలేటివారి పాలెం, బడేవారిపాలెం, శామీరపాలెం, పోకూరు, కాకుటూరు, నూకవరం, పోలినేనిపాలెం జమీన్‌ఉప్పలపాడు,అంకభూపాలపురం, రామచం ద్రాపురం, చుండి, అమ్మపాలెం, బంగారక్క పాలెం తదితర గ్రామా ల్లో 700ఎకరాల్లో గతేడాది సెప్టెంబరు నెలలో రైతులు తేజ, బాడిగి తదితర రకాలను సాగు చేశారు. మొక్కలు నాటినప్పటి నుండి ఎరువులు, మందులు పిచికారీ చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. వాతావరణలో వచ్చిన మార్పులతో తామర, నల్లి, తెగుళ్ల పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. కాయ దశ సమయంలోను తుపాను ప్రభావంతో కాయపై మచ్చ ఏర్పడింది. దీంతో కాయ నాణ్యత దెబ్బతిని తాలుశాతం పెరిగింది. పంట కోతలతో సమానంగా కాయ గ్రేడింగ్‌కు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు ఈ ఏడాది తేజ రకం ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల మించి దిగుబడులు రావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం సాగుకు రూ.లక్షన్నరకు పైగా ఖర్చు అయ్యిందని వాపోతున్నారు. రెండేళ్ల నుంచి ధరలు రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. గత ఏడాది పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు అమాంతం పతనం కావడంతో చాలామంది రైతులు మిర్చిని ఏసీ గోడౌన్‌ల్లో నిల్వ చేసుకున్నారు. మంచి ధర వస్తే విక్రయించాలని ఎదురుచూసి చివరికి వారికి ధరలు మరింత తగ్గాయి. రెండేళ్ల క్రితం వరకూ తేజ రకాలు క్వింటాకు రూ.22వేల నుంచి రూ.26వేల వరకూ ధర పలికేది. అయితే ప్రస్తుతం సగం ధర కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరలకు పెట్టుబడి, ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని మిర్చి రైతులు చర్చించుకుంటున్నారు. ఇలా అయితే అప్పులు ఎలా తీర్చాల్లో అర్థం కావడం లేదంటున్నారు. అధికారులు స్పందించి మిరపకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


బండివారిపాలెంలో ఎండబెట్టిన మిరపకాయలు

భూములు ఆక్రమిస్తే కేసులు

- ఆర్డీవో పావని

ఉదయగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వారిపై కేసులు నమోదు చేయాలని ఆత్మకూరు ఆర్డీవో పావని తహసీల్దారు సుభద్రకు సూచించారు. మంగళవారం ఆమె స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ భూములు ఆక్రమించిన ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తే వాటిని సైతం ఆక్రమణదారులు ధ్వంసం చేస్తున్నారని తహసీల్దారు సుభద్ర ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లడంతో అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు సత్వరమే పరిష్కారమార్గం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు షాజియా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. అంధత్వ నివారణలో భాగంగా స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైద్యశాఖ గతంలో అంధత్వ సమస్య ఉన్న విద్యార్థులకు పరీక్షించి 127మందికి సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలతో వ్యక్తిగతంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల వసతికోసం (డార్మిటరీ) నూతన భవనం మంజూరు చేసిందన్నారు. అలాగే మెయిన్‌గేటు నుంచి లోపలికి వచ్చేందుకు సీసీరోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మండల మాజీవైస్ చైర్మన్ చంద్రబా బునాయుడు, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, మాజీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు, తెలుగు యువత మండలాధ్యక్షుడు దాసరి అశోక్, రైతు కార్యదర్శి రమేష్, గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల, టెలికాంబోర్డు మెంబరు టీ.అనూష, టీడీపీ జాగర్లమూడి శ్రీను, కుంకు మోహనరావు, కేజీబీవీ ప్రిన్సిపల్ జయంతి పాల్గొన్నారు.


కంటి అద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

మండలాభివృద్ధికి సహకరించండి

అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మండలాభివృద్ధికి సహకరించాలంటూ కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు పెంచేందుకు క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించి పనిచేసే లేబర్ సంఖ్యను పెంచేందుకు కృషిచేయాలన్నారు.

భగవంతుడి సేవలో భాగస్వాములవుదాం: ఎమ్మెల్యే దగుమాటి

- శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణపై అన్నిశాఖల అధికారులతో సమావేశం
- మార్చి 9 నుంచి 15 వరకు తిరునాళ్ల నిర్వహణ

బిట్రగుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 9వ తేదీ నుంచి 15వరకు జరుగనున్నాయని.. ఈ ఏడు రోజులు బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్నివసతులు కల్పించేలా అన్నిశాఖల అధికారులు, గ్రామస్థులు సమన్వయంతో కలిసి పనిచేయాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కోరారు. మంగళవారం కావలి ఆర్డీవో వంశీకృష్ణ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుతో పాటు ముంగమూరు జాతీయ రహదారి నుంచి కొండబిట్రగుంట వరకు ఉచిత సర్వీస్ ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుధ్యంపై కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో మాట్లాడి అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన పండితుల సూచనల మేరకు ఆలయ మహాప్రాకారం, రాజగోపురాల నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి అయిందన్నారు. తూర్పు రాజగోపురం వద్ద మండపం, కోనేటికి మెట్లు, కొండపై వాహనశాలల నిర్మాణం, కొండకింద అదనపు అతిథి భవనాలు నిర్మాణం చేపడతామ న్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్, ఆలయ ఈవో రాధాకృష్ణ, తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రమణ్యం, ఆలయ మాజీ పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఉత్సవ ఉభయకర్తలు నాగేశ్వరావు, వెంకటేశ్వరరెడ్డి, విజయకుమార్ యాదవ్, కే.వెంకా రెడ్డి, వై.వేంకటేశ్వర్లురెడ్డి, బీజేపీ నేత కే.బ్రహ్మానందం, ఆర్.రంగయ్య యాదవ్, ఆర్.పద్మారెడ్డి ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం

కందుకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ మంగళవారం కందుకూరులో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంల్ న్యూడె మొక్రసీ పార్టీల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పి.మాల కొండయ్య, సురేష్‌బాబు, ఎస్ఏ గౌస్‌లు మాట్లాడారు. బడ్జెట్‌తో సామాన్య, మధ్యతరగతి ప్రజలు మేలు జరగడం లేదన్నారు. ఈ మేరకు ఈనెల 22న సాయంత్రం 4గంటలకు ఎన్జీఓ హోంలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలోని మద్యం దుకాణాన్ని మరోప్రదేశంలోకి తరలించే చర్య తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో మోహన్, హుస్సేన్, మురళి పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి

బిట్రగుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంకుడుగుంతలు ఏర్పాటు చేస్తే వ్యర్థమైన నీరు రోడ్లపై పారకుండా ఉండటంతో పాటు భూగర్భజలాలు పెరుగుతాయని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని తెలిపారు. కొండబిట్రగుంట గిరిజన కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. వీటితో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందించే ఆర్థికసాయంపై స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రావి విజయ్‌కుమార్ యాదవ్, గిరిజన నేత అశోక్, మారుతి ఉన్నారు.

చెరువుల ఆక్రమణల పరిశీలన

బిట్రగుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోవూరుపల్లి పంచాయతీ పరిధిలోని చెరువు ఆక్రమణకు గురైయిందని దళిత నేత ఎస్.మల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం మండల సర్వేయర్ శ్రీనివాసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొందరు చెరువు భూములను ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కట్టడాలను పరిశీలించిన సర్వేయర్ నివేదికను తహసీల్దారుకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు ఇందుపూరు రమోహన్‌రెడ్డి, నాటకరాణి భాస్కర్. నాటకరాణి రంగయ్య ఉన్నారు.

ఉపాధి అక్రమాలు బహిర్గతం

- రూ.4.25 లక్షల రికవరీకి డ్వామా పీడీ ఆదేశం
- కావలిలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కావలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలో మండలంలోని జరిగిన పనుల్లో అక్రమాలు జరిగినట్లు బహిర్గతం అయ్యాయి.2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులపై డ్వామా పీడీ గంగాభవానీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో అన్నిపంచాయతీలలో జరిగిన ఉపాధి పనుల రికార్డులను పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో అలసత్వం చూపి తప్పులతడకలుగా రికార్డులు నమోదు చేశారు. డబుల్ జాబ్‌కార్డులు, పనులకు రాకుండా వచ్చినట్లు నమోదు చేయటం, అటెండెన్స్ రికార్డులో సంతకాల ఇలా అనేక రకాలుగా తప్పులు వెలుగుచూశాయి. మండలం మొత్తం మీద రూ.4.25లక్షల అక్రమాలు జరిగినట్లు గుర్తించి వాటి రికవరీకి ఆదేశించారు. అక్రమాలకు బాధ్యులైన వారికి నోటీస్‌లిచ్చారు. వారిచ్చే సమాధానంపై తదుపరి చర్యలు తీసుకోనున్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, డ్వామా అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, స్టేట్ రీసోర్స్‌పర్సన్ వెంకటరెడ్డి, కావలి ఎమ్పీడీవో సీహెచ్. శ్రీదేవి, ఏపీడీ మృదుల, ఏపీవో పెంచలమ్మ, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయలు అమ్ముకోవచ్చు

కావలి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిసరప్రాంత రైతులు పండించిన కూరగాయలను రైతుబజారులో అమ్ముకోవచ్చని స్థానిక రైతుబజారు ఎస్టేట్ అధికారి స్వరూపారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకుల ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు

- ఎన్. విజయ, ఎంపీడీవో



ఉలవపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఉపాధి, 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులకు బాటలు వేస్తున్నట్లు ఎంపీడీవో ఎన్.విజయ తెలిపారు.

ఈ తీరుస్తారా...

? అభివృద్ధి పనులు ఎలా సాగుతున్నాయి ?

! మండలానికి మంజూరైన రూ.3కోట్ల ఉపాధి పనుల నిధులతో గ్రామాల్లో 42 సిమెంట్ రోడ్లు పూర్తి చేశాం. రూ.7లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో రామాయపట్నం, ఆత్మకూరు, బద్దిపూడి గ్రామాల్లో కల్వర్టులు నిర్మించాం.

? పంచాయతీల ఆదాయం పెంచే చర్యలేవీ.

! ఉలవపాడు, కరేడు వంటి మేజర్ పంచాయతీల్లో ఇంటి, కుళాయి పన్నుల రూపంలో, తీర ప్రాంతంలో హేచరీలు, జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలు, పెట్రోల్ బంకుల నుంచి ఆదాయం సమకూరుతుంది. చిన్న పంచాయతీల్లో పన్నుల రూపంలో అల్ప ఆదాయం వస్తుంది.

? సచివాలయం ఉద్యోగుల విధులు నిర్వహణ ఎలా ఉంది.

! వలంటీర్ల వ్యవస్థ లేనందున ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకం ఆన్‌లైన్ పనులు సచివాలయం సిబ్బందితోనే చేయిస్తున్నాం. సమయానికి పింఛన్లు పంపిణీ, జియోట్యాగ్, హౌస్‌హోల్డ్ సర్వే, ఆధార్ క్యాంపులు వంటి పనులు చేయిస్తున్నాం. గ్రామ సచివాలయాల అనుబంధ భవనాలను ఆయా శాఖల పరిధిలో ఉపయోగించుకుంటున్నాం.

ప్రతిరైతు విశిష్ట సంఖ్యను రిజిస్టర్ చేయించుకోవాలి


వరిపైరును పరిశీలిస్తున్న కందుకూరు ఏడీఏ అనసూయ

లింగసముద్రం, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు విశిష్ట సంఖ్యను రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని కందుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు అనసూయ తెలిపారు. మంగళవారం ముత్యాలపాడు, పెద పవనిలో మండల వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఆధార్‌కార్డు, పొలం పాసు పుస్తకాల జిరాక్స్‌లతో పాటు ఆధార్ నంబర్ లింక్ అయిన ఫోన్‌ను తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవా లన్నారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రేమ్‌బాబు, నజీర్ పాల్గొన్నారు.

● కందుకూరు: మాచవరం రైతు సేవాకేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి వి.రాము తెలిపారు. మోపాడు, మాచవరంలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పైర్లను పరిశీలించారు. దళారులకు అమ్ముకుని నష్టపోకుండా క్వింటాల్ రూ.2,300లకు ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. రైతులు రైతు సేవాకేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సహాయకుల వద్ద ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వంశీ, నాగజ్యోతి, వ్యవసాయ సహాయకులు రమణయ్య, రోసీరేచల్ పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన

సంగం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పడమటిపాళెం రైతు సేవా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాదవి పోషకాహార ధాన్యాలు, విలువ ఆధారిత ఉత్పత్తులపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించే వరి ధాన్యాన్ని కల్లాల్లోనే నేరుగా విక్రయించే దానికంటే పాలీష్ తక్కువగా పట్టి ప్యాకింగ్ చేసి విక్రయిస్తే మంచి ధర వస్తుందన్నారు. అదేవిధంగా సేంద్రియ ఎరువులతో పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర వస్తుందని తెలిపారు. అలాగే వేరుశెనగను నూనె ఆడించి నూనె, అందులో వచ్చే చెక్కను విడివిడిగా విక్రయిస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. అదేవిధంగా జొన్నలు, రాగులు పండించే రైతులు కూడా విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే లాభాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైంటిస్టులు సురేఖ దేవి, హసీనాభాను, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ఉదయగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు వైద్యశాలలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న రూ.3.50 లక్షల నిధులతో వైద్యశాలకు అత్యవసరమైన పనులు చేపట్టాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పొందుపరిచిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు ఎన్.సంతోష్‌కుమార్ కోరారు. పట్టణంలోని ఏసీఎస్ ఆర్.కాలనీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేదంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేసిన నేపథ్యంలో మంగళవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. తనిఖీ నిమిత్తం పాఠశాలకు వచ్చిన ఎంఈవో జ్యోతికి ఆయన సమస్యలను విన్నవించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి అనుబంధ సంఘాల నాయకులు ఏలూరు ప్రసాద్, శ్రీనివాసులు, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం బహిష్కరణ

ఏఎస్ పేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీలందరూ బహిష్కరించారు. సమావేశంలో 15వ ఆర్థిక సం ఘం నిధుల గురించి పలువురు ఎంపీటీసీలు ఎంపీడీవో ప్రసన్న కుమారిని ప్రశ్నించడంతో రెండు రోజులలో తెలుపుతామని సమాధానం ఇచ్చారు. మార్చి నెలలోగా నిధులు వినియోగించుకోలేకపోతే వృథా అవుతాయని,ఎంపీపీ పద్మజారెడ్డి తెలిపారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింటు అయినటువంటి శ్రీరామ్ ఫైనాన్స్ కందుకూరు బ్రాంచి వారు ప్రకాశం జిల్లా పామూరు మండలం [illegible] గ్రామ నివాసి అయినటువంటి [illegible] గారి కుమారుడు [illegible] ... ఋణము మంజూరు చేయుటకు [illegible] ... ఈ ప్రకటన వెలువడిన 7 దినములలోపల వారి యొక్క అభ్యంతరము లిఖిత పూర్వకముగా తెలియపరచవలెను. [illegible]

ఆస్తి వివరములు

ప్రకాశం డి., [illegible] సబ్ డి. పామూరు మండలం, [illegible] ... 480 చదరపు గజములు [illegible] ...

కొమ్మన మల్లికార్జునరావు,
లీగల్ అడ్వైజర్ - [illegible]
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

స్థలం: కందుకూరు
తేది. 18-02-2025

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. Sri Ram Finance Ltd., Kandukur Branch, SPSR Nellore District issue the following notice to the General public.

My client intends to grant loan to the applicant Smt.Challa Kotlinga Prasadu, S/o. Venkata Subbaiah, R/o. Muppavaram Village, Kondepi Mandal, Prakasam District, Andhra Pradesh submitted the following documents to create the same as security to Trade Finance. On careful scrutinising the documents I have submitted my legal opinion as follows for the property as security by off the Regd. Mortgage. As such if anyone has any claims, charges, mortgages, sale agreements, court attachments or court disputes etc., shall be informed to the address within 7 days from the date of this notice. Otherwise later objections will not bind my client in this regard.

PROPERTY-1

SCHEDULE

Prakasam District, Ongole Sub Division, Ongole Mandal, Pelluru grama panchayathi, Pelluru grama survey no.165/6, 165/7,165/8 in this survey no.2-31 cents plot no 67 bounded by:- East: Plot no 77, this side 36 feet, South : Plot No. 66 this side 60 feet, West : 30 feet road, this side 36 feet, North : Plot no.68, this side 60 feet.

Within the boundaries an extent of 2160 Sq.feet or 240 Sq.yards or 30 gadlees.

PROPERTY-2

2SCHEDULE

Prakasam District, Ongole Sub Division, Ongole Mandal, Pelluru grama panchayathi, Pelluru grama survey no.254, in patta survey no.169/2c extent of 0-52 cents and 169/2a extent of 2-93 cents total extent 3-45 plot no 18 bounded by:- East: 30 feet width bajar, this side 24 feet, South : Plot No. 17, this side 60 feet, West : Other side, this side 24 feet, North : Plot no.19, this side 60 feet.

Within the boundaries an extent of 1400 Sq.feet or 160 Sq.yards or 20 gadlees.

Place : Kandukur
Date : 18-02-2025

sd/- Mallikarjuna Rao
Legal Advisor, Sri Ram Finance Ltd,
Kandukur Branch, Nellore District

ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యం


ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి సర్వే చేస్తున్న బృందం

ఉదయగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జలజీవన్‌మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని షబ్బీర్ కాలనీ సమీపంలో ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఓబీహెచ్‌ఆర్) ఏర్పాటుకు పూణేకు చెందిన సమర్థ్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ బృందం సర్వే చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో షబ్బీర్ కాలనీ, కొండాయపాళెం, బోడబండ, లింగంనేనిపల్లి గ్రామాల్లో ఓబీహెచ్‌ఆర్ ట్యాంకులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆ ట్యాంకుల్లో సోమశిల జలాలను నింపి అక్కడినుంచి పైపులైన్‌ల ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేస్తారన్నారు. మార్చి 15వ తేదీలోపు సర్వే పూర్తిచేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ జగన్నాథం, తెలుగు యువత అధ్యక్షుడు సయ్యద్ సందానీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వింజమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గంలోని 8 మండ లాలకు సంబంధించిన 16 మంది లబ్ధిదారులకు సుమారు రూ.17,17, 764 సీఎం సహాయనిధి చెక్కులను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చేతుల మీదుగా అందజేశారు. మంగళవారం వింజమూరులోని టీడీ పీ ప్రధాన పార్టీ కార్యాలయంలో బాధితులకు, ఆయా మండలాలకు చెందిన నాయకులతో కలిసి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా వర్తించని జబ్బులకు సంబంధించిన వైద్య ఖర్చులను సీఎం సహాయనిధి ద్వారా అందించడం జరుగుతుందన్నారు. బాధితులు ఎవరైనా నేరుగా కార్యాలయానికి వచ్చి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, దొరస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి గ్రామంలో సర్వే నెంబరు 78-1లోని మహాలక్ష్మి ఆలయం స్థలం 3ఎకరాల 20సెంట్లను కొందరు ఆక్రమించారని ఉప సర్పంచి కామినేని వీరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ స్థలాన్ని రక్షించాలని ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, తహసీల్దార్, ఎస్ఐలకు వినతిపత్రం అందజేశామని ఆయన పేర్కొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం

కావలిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 3-8ఏళ్ల మధ్య పిల్లలకు పునాది అభ్యసనంపై మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య పర్యవేక్షణలో 6రోజులు జరిగే శిక్షణలో ఎంఈవో గోవిందయ్య పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. సరైన శిక్షణ పొంది పిల్లలకు సరైన తర్ఫీదు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్లుగా బూచి మధుసూదన్‌రావు, బీ.వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అల్లూరులో జ్ఞానజ్యోతి శిక్షణపై అవగాహన

● అల్లూరు : జ్ఞానజ్యోతి 120రోజుల శిక్షణపై అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాధికారులు రవీంద్రనాథ్, సునీతలు పాల్గొని సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణ అనంతరం 114 రోజులు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందాక సర్టిఫికెట్లు మంజూరు చేస్తారని తెలి పారు. ప్రీస్కూల్ బాలలకు విద్యనందించే పద్ధతులు అవలంబిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసులు, మల్లికార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూపర్‌వైజర్ ఎ.రాజేశ్వరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.హరిప్రసాద్, డిఆర్‌పీలు శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

సంగం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు, వంగల్లులో రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం మరో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇప్పటికే సంగం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈసందర్భంగా ఏవో శ్రీహరి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సెక్రటరీ దస్తగిరి, గ్రామ నాయకులు పగడాల రఘురామయ్య, హరిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి ఉన్నత, జీ.చెరువుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లో జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్షయవ్యాధిపై గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు కె వెంకటసుబ్బయ్య అవగాహన కల్పించారు. క్షయవ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షయవ్యాధి నియంత్రణ పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరు: మండలంలోని రాచవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి హరీష్ క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకారయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు ఓటుహక్కు కల్పించాలి

- ఆప్టా జిల్లా కార్యదర్శి దేవిడ్‌బాబు

కావలి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఓటుహక్కు కల్పించాలని (ఆప్టా) ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దేవిడ్‌బాబు, కంచర్ల మధుసూదన్ రావులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసి శాసనసభలో తీర్మానం ప్రవేశ పెట్టాలని కోరారు.